UNIVERSAL
LIBRARY
OU_206113
UNIVERSAL
LIBRARY

విశ్వసాహిత్యమాల ౧౩.

# పారిస్ కమ్యూన్

వి. ఇ. లెనిన్

౧౯౩౮ జూన్.

అనువాదకుడు:

(విశ్వసాహిత్యమాల,)
ముంగండ,
(Via) అంబాజీపేట. తూ. గోదావరి.

శ్రీనివాస ముద్రణాలయము,
రాజమంద్రి.

వెల ౬ అణాలు,

# స్వవిషయం.

లెనిన్ మహాశయుని గ్రంథాలు యింగ్లీషులో దేశమంతటా ప్రచారంలో వున్నాయి. వాటిలో యేదీ నిషేధించబడనే లేదు. ఇటీవల మనదేశంలోకూడా అవి ముద్రించబడి, ప్రజాసామాన్యాని కందుబాటులోకి వస్తూన్నాయి. మార్క్సు, లెనిన్ మొదలైనవాళ్ల గ్రంథాలన్నీ పెద్దపెద్ద పుస్తకభాండాగారాల్లో (గవర్నమెంటు లైబ్రరీల్లోకూడా) మనకు లభ్యం అవుతూన్నాయి. ఇంగ్లీషురాని ప్రజాసామాన్యానికి అందుబాటులో వుండే టట్లుచేయాలని, మేము తెలుగులో తర్జుమాచేసి, లెనిన్ గ్రంథాల్ని ముద్రింప దలపెట్టేము. అది మహాపరాధమో, యేమో మాకు తెలియదు. 'కారల్ మార్క్సు ఉపదేశాలు' అనే గ్రంథాన్ని ౧౯౩౮ ఏప్రియిలో మన మద్రాసురాష్ట్ర మధ్యంతరమంత్రివర్గం నిషేధించింది. కాంగ్రెసువారు మంత్రిపదవులు స్వీకరించేక, ఎన్నో పుస్తకాలపైన వున్న నిషేధాల్ని తొలగించేరు. చాలా సంతోషించేము, మా పుస్తకంమీదకూడా నిషేధం తొలగిస్తారు, మన కాంగ్రెస్‌మంత్రులని. ఎంతకాలం ఓపికపట్టినా ప్రయోజనం లేకనేపోయింది. ఇది యిల్లా వుండగా మొన్ననే, మే ౧౯౩౯ తేదీని కాంగ్రెస్‌మంత్రివర్గమే, 'రష్యావిప్లవం ౧౯౧౭' అనేమా గ్రంథాన్ని నిషేధించిందని పత్రికల్లో చూసి ఆశ్చర్యపడ్డాము.

ఏమీ? ఇంగ్లీషులో నిషేధించబడని పుస్తకాలు తెలుగులో ఎందుకు నిషేధించబడాలి? అందులోనూ కాంగ్రెస్‌మంత్రివర్గమే పుస్తకాల్ని నిషేధించడమా! తెలుగులో వున్న రాజకీయగ్రంథాలే చాలా తక్కువ. ప్రజలలో రాజకీయచైతన్యం కలగాలంటే ఎన్నోవేల గ్రంథాలు బయలు

దేరాలి. కాని, నిర్బంధవిధానం యింత కఠినంగా వుంటే మన భాష అభివృద్ధిచెందేదెట్లా ? ఆంధ్రులు యీ విషయంలో తూష్ణీభావంగా వూరుకుంటే, మన గతి యింతే. సభలలో, సమావేశాల్లో, ఉపన్యాసాల్లో, పత్రికల్లో మన అసమ్మతిని తెలియజేయాలి. మన కాంగ్రెస్ సంఘాలు తీర్మానము చేయాలి. అందులోనూ ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు సంఘంవెంటనే, ఆంధ్రభాషలోని నిషిద్ధగ్రంధాలపై నిషేధాన్ని తొలగించాలని తీర్మానంచేసి, తమ దృక్పధాన్ని ప్రభుత్వానికి తెలియజేయడం కనీసధర్మం.

ఇంతకాలంనుంచి ఏ పౌరసత్వహక్కులకై బ్రిటీషుసామ్రాజ్యవాదంతో కాంగ్రెస్ పోరాడుతూందో, వాటినే, కాంగ్రెస్ మంత్రిపదవుల్లోకి వచ్చినతర్వాత అరికట్టడం, మనం ఊరుకోవడం, కాంగ్రెస్ సిద్ధాంతాలకీ ప్రతిష్ఠకీకూడా భంగకరమే.

ఇంక ప్రస్తుతవిషయం. లెనిన్ వ్రాసిన 'పారిస్ కమ్యూన్' అనే గ్రంధాన్ని ఆంధ్రమహాజనులకు అందిస్తున్నాము. దీనిని స్వీకరించి, కాపాడుకొని, ఆదరించవలసిన, కర్తవ్యం ఆంధ్రులదే.

ఆంధ్రులు ఏ వుద్యమంలోనూ వెనుకంజ వేయలేదు. మన భాష ప్రస్తుతం ఎంతో నీరసించిపోయింది. విశ్వసాహిత్యాన్నంతనూ, శాస్త్రాలన్నింటినీ తెలుగులో పెట్టాలి. మన కర్తవ్యాన్ని నేరవేర్చాలి. మన భవిష్యత్సంతతుల మార్గాన్ని సుగమంచేయాలి. ఇందులో ఆంధ్రులు పరాఙ్ముఖులౌతారా ? చూద్దాం.

ఇంక, ఆంధ్రులు మా సేవను గుర్తిస్తే, దాన్ని ఉపయోగించుకొంటే, అదే పదివేలు, మాకు. 'విశ్వసాహిత్యమాల' సంకుచితభావాలకీ, సంకుచితమైన హద్దులకీ, అతీతము ! ఆంధ్రుల ఆదరాభిమానాలుంటే, మా కర్తవ్యం నెరవేర్చటంలో వెనుకంజవేయమని యింకోసారి ఘట్టిగా చెపుతూన్నాము.

'దేశభాషలందు తెలుగు లెస్స'. కాని, తెలుగులోకూడా సరియైన, భావప్రకటనమునకు అనువైన పదాలు దొరకుటలేదు. శాస్త్రీయ, ఆర్థిక రాజకీయ, సామాజిక గ్రంథరచన, తెలుగులో సాగాలంటే, ఎంతో అభివృద్ధిచేయాలి, భాషను. ఎన్నో భాషల్లోంచి శబ్దాల్ని ఎరువుతెచ్చు కోవాలి. ఆ యా శబ్దాలన్నింటినీ తెలుగునాటి బిడ్డల్నిగా చేసుకోవాలి. కొంత కాలవ్యవధి అవసరమే. గాన, మా గ్రంథాల్లో కొంత క్లిష్టత కాన్పి స్తూంటుంటె. ఆంధ్రులు యిందుకు కినియక సానుభూతితో మా పరిశ్రమను చూడాలి. ఏమైనా, సూచనలు కూడా చేయమని కోర్తున్నాము. పర్యాయ పదాల్ని చివర యిచ్చేము. దానిని చూడమని కోరిక.

ఇంకొక్కమాట. ఇల్లాంటి పుస్తకాలు చదివేటప్పుడు, ఆషామాషీగా చదవకూడదు. అభినివేశంతో; ఓరిమితో, పరించాలి. విషయాన్ని అవగాహన చేసుకోవాలి. ఇంగ్లీషురాని తెలుగుప్రజలు మా పుస్తకాల ప్రయోజనాన్ని పొందగలరనే మా ఆశయము. మళ్లీ యింకోసారి కలుసు కుందాం.

మంగినపూడి,
1 జూన్ '38.

సంపాదకుడు.

# విషయసూచిక.


భూమిక. ౯

౧. పారిస్ కమ్యూన్ యొక్క స్మృతి. ౨౩

౨. కమ్యూన్ పల్ల నేర్చుకోవలసిన పాఠాలు. ౩౦

౩. 'కూగల్‌మాన్‌కు కారల్‌మార్క్సు వ్రాసిన లేఖలు' యొక్క రష్యనుమార్పు పీఠికనుండి ఉద్ధృతము. ౩౮

౪. 'రాజ్యాంగయంత్రము : విప్లవము' నుండి ఉద్ధృతము. ౪౪

౫. 'శ్రామికవిప్లవమూ స్వపక్షద్రోహియైన కాట్స్కీ' నుండి ఉద్ధృతము. ౮౨

౬. పార్టీప్రోగ్రామును పునర్విమర్శచేసి, పార్టీపేరును మార్చడాని గురించి రష్యన్ కమ్యూనిస్టు పార్టీయొక్క ఏడవ కాంగ్రెస్‌లో యిచ్చిన ఉపన్యాసం నుండి ఉద్ధృతము. ౯౨

౭. 'బూర్జువా ప్రజాతంత్రము : శ్రామిక వర్గనియంతృత్వము' నుండి ఉద్ధృతము. ౯౪

౮. యూరోపు అమెరికాదేశాల కార్మికులకు వ్రాసిన జాబు నుండి ఉద్ధృతము ౯౫

౯. 'మన విప్లవంలో శ్రామికుల కర్తవ్యాలు' నుండి ఉద్ధృతము ౯౮

౧౦. మూడవ 'అఖిలరష్యాసోవియట్ కాంగ్రెస్' లో 'కౌన్సిలు ఆఫ్ పీపుల్సు కమిస్సార్స్' యొక్క నివేదికనుండి ఉద్ధృతము. ౧౦౧

౧౧. పారిస్‌కమ్యూన్. శ్రామికవర్గనియంతృత్వంయొక్క కర్తవ్యాలు. ౧౦౩



# భూ మి క.

ఫ్రాంసుదేశంలో సుమారు అరవైయేడు సంవత్సరాలక్రిందట, అనగా ౧౮౭౧ సంవత్సరంలో 'పారిస్ కమ్యూన్' రాజ్యాధికారాన్ని వశం చేసుకుంది. 'రెండవ సామ్రాజ్యము' అప్పటికే నిర్వీర్యమై పోయింది. దాని శిధిలములనుండే బయలుదేరిన యీ 'పారిస్ కమ్యూన్' డెబ్భదియొక్క రోజులు చరిత్రాత్మకంగా బూర్జువావర్గానికి గుండెల్లో గాలమై వుంది. వెర్సేలిస్ విప్లవప్రతికూలుర ఫిరంగిగుండ్ల కెరయై వీరోచితంగా అంతరించింది. పందొమ్మిదో శతాబ్దంలో "యూరోపులో జరిగిన అంతర్యుద్ధా లన్నిటిలోకీ ఈ 'పారిస్ కమ్యూన్' మిక్కిలి వృత్త్రాష్టమైన సంఘటన" అనిన్నీ, ౧౮౪౮ జూన్‌లో జరిగిన తిరుగుబాటు కంటేనూ ఎక్కువ ప్రాముఖ్యత గలదనిన్నీ, విశాలదృష్టితో చూస్తే స్పష్టం అవుతుంది. 'శ్రామిక విప్లవయుగానికి' పూర్వపుచరిత్ర రక్తరంజితమైన పారిస్ కమ్యూన్‌తో సమాప్తం అయింది; దానితోనే శ్రామిక వర్గ విప్లవాల యుగం ప్రారంభం అయింది. విప్లవకారియైన శ్రామిక వర్గంయొక్క ప్రతిఘటన, పోరాటవిధానములు--అత్యున్నతస్థానాన్ని పొందినాయి; ఈ యుగం అంతాకూడా వీరకృత్యాలతోనూ, రక్తపాతంతో గూడిన పరాజయాలతోనూ, ధైర్యంతోగూడిన స్వతంత్ర ప్రయత్నాలతోనూ, దినదినాభివృద్ధి పొందుతూన్న పోరాటాలతోనూ ప్రసిద్ధిజెంది వుంది. మానవచరిత్రలో, కూలీవర్గం యొక్క సోషలిస్టు విప్లవాలకి ఈ 'కమ్యూన్' మొదటి 'రిహార్సలు.' మానవసమాజాన్నంతనీ బానిసత్వాన్నుంచీ, దోపిడీవిధాన్నుంచీ తప్పించుటకున్నూ, తమ వర్గముయొక్క

రాజకీయ దాస్యవిమోచనమన్నూ, అణిచివేయబడి, దోపిడీ చేయబడు తూన్న వర్గాలన్నిటికీ పురోభాగంలో వుండి, శ్రామికవర్గం తన స్వశక్తి చేతనే అధికారాన్ని వశపరచుకోడానికి ఇదే మొదటిసారి.

కమ్యూన్‌తోనే నవీనయుగారంభం అయింది. మానవచరిత్రలో దీనితోనే ఆధునిక సామ్రాజ్యవాదశకం ప్రారంభించింది. సామ్రాజ్యవాద శకంలోని శ్రామికవర్గ విప్లవోద్యమంయొక్క షరతులూ, పద్ధతులూ, ఆదర్శాలూ కూడ ఈ పారిస్ కమ్యూన్‌లో ప్రతిఫలించి వున్నాయి. శ్రామిక వర్గ విప్లవంయొక్క రూపాన్ని అభివృద్ధిచేసి, యెత్తుగడలను, వ్యూహ రచనావిధానాన్ని నిర్ణయించడానికి, (లెనినిస్టు రూపంలో) కమ్యూన్‌వల్ల నేర్చుకున్న పాఠాలు చాల సహాయం చేసేయి. మనం, ఈనాడు, పారిస్ కమ్యూన్‌యొక్క చారిత్రక ప్రాముఖ్యాన్నీ, దాని గుణపాఠాల్నీ సరిగా తెలుసుకోవాలంటే, అప్పటినుంచీ జరుగుతూన్న వర్గకలహాల అనుభ వాన్నీ, ఇరవయ్యో శతాబ్దంలోని శ్రామికవర్గ విప్లవాల యథార్థపాఠాల్నీ, అందులోనూ ముఖ్యంగా '౧౯౧౭ అక్టోబరు విప్లవం' యొక్క పాఠాల్నీ తెలుసుకోవలసి వుంటుంది.

శ్రామికవిప్లవాల చరిత్రలో పారిస్ కమ్యూన్‌యొక్క స్థానాన్ని తెలుసుకోడానికి ముందుగా ౧౮౭౧ మార్చి ౧౮ మొదలు మే ౨౮ తేదీ వరకూ జరిగిన సంఘటనల్ని గురించి స్పష్టంగా చెప్పవలసి వుంటుంది.

రెండవ సామ్రాజ్యమును నాశనాన్నుంచి తప్పించడానికై లూయీ బోనపార్టీ రగుల్కొల్పిన ఫ్రాంకో–జర్మన్ యుద్ధమే (౧౮౭౦–౧౮౭౧) దాని పతనాన్ని పూర్తిచేసింది. (బిస్మార్కుయొక్క వుద్దేశ్యాల్ని గురించి వ్రాయడానికి యిచ్చట తావులేదు.) "రెండవ సామ్రాజ్యవినాశ నానికి సూచనలు అప్పుడే పారిస్‌లో కనిపిస్తూన్నాయి. ఈ సామ్రాజ్యం యెట్లా బయలుదేరిందో అట్లే ఒకనాటకంలాగ అంతరవుతుంది." అంటూ, ౧౮౭౦ జూలై ౨౩ తేదీని ప్రకటించబడిన యింటర్‌నేషనల్ వర్కింగ్

మెన్సు ఎసోసియేషన్ యొక్క మొదటి మేనిఫెస్టోలో మార్క్సు సూచించినట్లుగానే 'సేడన్' యుద్ధముతో రెండవ సామ్రాజ్యం కూలిపోయింది. 'బోనపార్టి సామ్రాజ్యం' యొక్క పునాదు లదివరకే కదలిపోయినాయి. యుద్ధంలో ఓడిపోవడంతో దాని పతనం పూర్తి అయింది. తరువాత రాజ్యాధికారాన్ని వహించిన 'రిపబ్లిక్', బోనపార్టి సింహాసనాన్ని ఆక్రమించడానికై యేమీ ప్రయత్నం చేయనవసరం లేకపోయింది.

“ఈ రిపబ్లిక్ సామ్రాజ్యాన్ని కూలద్రోయనేలేదు. రెండవ సామ్రాజ్యం ఖాళీచేసిన స్థానంలోకి వచ్చి అమరుపెట్టింది. ఒక సామాజిక విజయంగా కాక కేవలం జాతీయ రక్షణాయత్నంగా మాత్రమే, యీ రిపబ్లిక్ ప్రకటించబడింది.” Civil war in France, మార్క్సు.

ఇప్పటి ప్రత్యేక పరిస్థితుల్నిబట్టి చూస్తే, బోనపార్టి ప్రభుత్వ పీఠాన్ని ఆక్రమించిన రిపబ్లిక్ ఒక జీవితాన్ని రెండు తలలతో ప్రారంభించిందని స్పష్టం అవుతుంది. జాతీయ రక్షణ ప్రభుత్వం (Government of National Defence) రాజ్యాధికారాన్ని తన చేతుల్లోకి తీసికొన్న సెప్టెంబరు 4 వ తేదీనే, పారిస్‌నగరంలోని శ్రామికులు తాము కూడా 'కంట్రోలు కమిటీ'ల నేర్పాటు చేసేరు. పారిస్‌నగర సంరక్షణకై 'థీర్స్' ప్రభుత్వం యేమేమి యేర్పాట్లు చేస్తూన్నదీ పరిశీలించడానికీ, పారిసునగరముకు ఆహారపదార్థాల సప్లై నిరాటంకంగా జరుగునట్లు చూడడానికీ యీ కంట్రోలు కమిటీలు పూనుకొన్నాయి. పై విధంగా ఒక విచిత్రమైన ద్వంద్వప్రభుత్వవిధానం యేర్పడింది. చరిత్రలో తిరిగీ యిట్లాంటి ద్వంద్వప్రభుత్వమే ౧౯౧౭ ఫిబ్రవరిలో జారు చక్రవర్తి ప్రభుత్వం పతనమైపోయినతర్వాతనుండి అక్టోబరువిప్లవం వరకూ రష్యాలో యేర్పడింది. కాని, ౧౮౭౧ లో యీ ద్వంద్వప్రభుత్వం, ఉన్నతమైన పరిణామం పొంది కనిపించింది.

౧౮౭౦ సెప్టెంబరు 4 తేదీ మొదలు ౧౮౭౧ మార్చి ౧౮ వ తేదీ వరకూ వున్న మధ్యకాలంలో యీ రెండు ప్రభుత్వవిధానాలూ అధికారా నికై పెనగులాడినాయి. పారిస్ కూలీల బలం, సాయుధమైన నేషనల్ గార్డుమీదా, ప్రజల ఆయుధబలంమీదా ఆధారపడి వుంది. అందువల్లనే థీర్సు, జూలిస్‌ఫావ్‌రీ మొదలైనవాళ్ళ ప్రభుత్వం తలపెట్టిన ముఖ్య కార్య క్రమం, పారిస్ కూలీల ఆయుధాల్ని లాక్కోవడమే. 'జాతీయ రక్షణ' కోసం యేర్పడిన ప్రభుత్వమే యీ విధంగా జాతీయ ద్రోహానికి పూను కొంది. పారిస్‌ను రక్షించడానికి పూనుకొన్న రిపబ్లిక్‌నకూ, శ్రామికవర్గా నికీ మధ్య విరోధానికి కారణం 'పారిస్ రక్షణయే' అయింది. దీనికి ఫలితంగా ౧౮౭౧ మార్చి ౧౮ వ తేదీని తీవ్ర పోరాటం జరిగింది.

౧౮౭౧ జనవరి ౨౮ వ తేదీని ఆహారపదార్థాయిలేక మాడిపోయి పారిస్‌నగరం ప్రష్యన్ సైన్యాలకి లోబడింది. "కోటలు స్వాధీనంచేయ బడినాయి. ప్రాకారాలన్నీ నిరాయుధములుగా చేయబడినాయి. ప్రభుత్వ పటాలాల యొక్క, 'గార్డి మొబైల్' యొక్క ఆయుధాలన్నీ కూడా శత్రు వులకు వశంచేయబడినాయి. సైనికులంతా యుద్ధ ఖైదీలుగా పరిగణించ బడ్డారు. కాని, నేషనల్‌గార్డు మాత్రం తన ఆయుధాల్నీ, ఫిరంగుల్నీ కూడా దగ్గరనే వుంచుకొంటూ, ప్రష్యా సైన్యంతో తాత్కాలిక యుద్ధ విరామసంధిని చేసికొంది. పారిస్‌లోకి విజయోత్సవంతో ప్రవేశించడా నికై, జయాన్నిపొందిన ప్రష్యా సేనలకి గుండెల్లేకపోయినాయి........ ఫ్రెంచిసామ్రాజ్య సైన్యాలన్నీ కూడా యే ప్రష్యా సేనలయెదుట తమ ఆయుధాల్ని దించివేసినాయో, ఆ సైన్యాల మనస్సుల్లోనే పారిస్‌కూలీల యెడల అంతటి భయభక్తులు కలిగినాయి; విప్లవానికి పుట్టిల్లైన పారిస్ మీద కసితీర్చుకొనడానికి వచ్చిన ప్రష్యా ప్రభువర్గం, సాయుధమై, జాగృతమై యున్న యీ పారిస్ విప్లవశక్తికి దూరంగా నిలుచుని

చేతులు జోడించవలసి వచ్చింది." అని Civil war in France యొక్క పీఠికలో యేంగిల్సు వ్రాసేరు.

జనవరినెలలో ప్రష్యన్‌లు చేయసాహసించని కార్యాన్ని, రెండు నెలలతర్వాత 'థీర్సు' స్వయంగానే ప్రష్యన్‌ల సహాయంతో చేయపూను కొన్నాడు. అతడు తన ప్రభుత్వ సైన్యాల్ని మార్చి ౧౮వ తేదీని పారిస్ శ్రామికులపైకి పంపించేడు. పారిస్ శ్రామికులు స్వయంగా పోతపోసి తయారుచేసికొన్న ఫిరంగుల్ని దొంగిలించడానికే యీ సైన్యాలు పంప బడినాయి. కాని, తమ ఆయుధాల్ని లోబరచడానికి శ్రామికులు అంగీకరిం చలేదు. వెర్సైలిస్ ప్రభుత్వం చేసిన యీ పనికి మండిపడి పారిస్ తిరగ బడింది. ప్రజలు తిరగబడి, వెర్సైలిస్ ప్రభుత్వ సైన్యాల్ని యెముకలు విరగ్గొట్టి, వెనక్కి తరిమివేసేరు. శ్రామికులపేరిట ప్రభుత్వాన్ని 'సెంట్ర ల్‌కమిటీ' స్వాధీనంచేసుకుంది. నేషనల్‌గార్డుచే యెన్నుకోబడిన యీ కమిటీని, ఒక విధంగా 'సోవియటు ఆఫ్ రెడ్‌గార్డు డిప్యూటీస్' అని చెప్పవచ్చు. (సైనికప్రతినిధుల సంఘము)

ఈ నూతనప్రభుత్వం యొక్క స్వభావం యెట్లాంటిదో, దాని విశిష్ట కార్యక్రమ మెట్టిదో, అనే ప్రశ్నకు, మార్చి ౧౮ వ తేదీనాటి ప్రకటనలో 'నేషనల్‌గార్డు యొక్క సెంట్రల్ కమిటీ చక్కని ప్రత్యుత్తర మిచ్చింది.

> "పాలకవర్గంయొక్క ద్రోహాలు, అపజయాలు; వీటి మధ్యగా పరిస్థితు లింకా విషమించకుండా చేయాలంటే ప్రజా కార్యనిర్వహణాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని శ్రామికవర్గం గ్రహించింది. ... . తమ అదృష్టాన్ని తామే నిర్ణయించుకో దానికై ప్రభుత్వాధికారాన్ని, తమ చేతుల్లోకి తీసుకోవడమే తమకు విధియనిన్నీ, హక్కుయనిన్నీ వారు తెలుసుకున్నారు."

పారిస్‌లోని విప్లవ సంఘటనలయొక్క, పారిస్ కమ్యూన్ యొక్క వర్గస్వభావము విదేశీయులనుండి దేశాన్ని రక్షించడానికి చేసే

పోరాటంచేత కప్పివేయబడి వుంది. పై వాక్యములు దానిని స్పష్టం చేస్తూన్నాయి. మార్క్సు తన Civil war in France లో యిట్లా వ్రాసేడు. "దానిలోని రహస్యం యిదే. కమ్యూన్ తప్పక శ్రామికవర్గం యొక్క ప్రభుత్వమే. వస్తూత్పత్తి చేసే వర్గానికిన్నీ, దోపిడీ చేసే వర్గానికిన్నీ జరిగిన పోరాటానికి ఫలితంగా యిది యేర్పడింది. కూలీల ఆర్థిక దాస్యవిముక్తి, యే విధానముక్రింద రొలగిపోయిందో అట్లాంటి రాజ్యాంగ విధానము చిట్టచివరకి కనుగొనబడింది. అదే కమ్యూన్."

పారిస్ కమ్యూన్ తాను జీవించియున్న దెబ్బదియొక్క దినాల్లోనూ చేసిన మహత్తరకార్యాల్నీ, చరిత్రాత్మకపోరాటాన్నీ వర్ణించుటకు యిక్కడ తావు లేదు. మేధావంతుడగు మార్క్సు నిశ్చలమైన విమర్శనా శక్తితో కొన్ని శాశ్వత స్మరణీయాలైన అంశాలను తాను వ్రాసిన Civil war in France లోనూ, జనరల్ కౌన్సిలు యొక్క మేనిఫెస్టోలోనూ యిచ్చేడు. పారిస్ కమ్యూన్ యొక్క చరిత్రనీ, స్వరూప స్వభావాలనీ, 'స్వర్గాన్నికూడా ముట్టడించే' దానియొక్క విప్లవచర్యలనీ, (సామాజిక రాజకీయ పరిస్థితులవల్లా, శ్రామికవర్గం యొక్క అపరిపక్వత వల్లా చేయబడిన) గొప్ప పొరపాట్లనీ,— మార్క్సు నిశ్చలమైన విమర్శనాశక్తితోనూ, సూక్ష్మబుద్ధితోనూ సూచించేడు.

పారిస్ కమ్యూన్ యొక్క విప్లవచర్యలు అనేక సంఘటనలచేత ఆటంకపరచబడ్డాయి; కొన్ని ఊహామాత్రములుగానే వుండిపోయినాయి. నిరంతరం వెర్సేలిస్ ప్రభుత్వంయొక్క ఫిరంగిగుండ్లవర్షంలో, శత్రు సమూహాలచేత అన్నివైపులా ఆక్రమించబడివుండడంచేత, చేయదలచిన పనుల్ని చేయునవకాశం దొరికిందిగాదు; సాధించిన విప్లవాన్ని రక్షించడానికే యావచ్ఛక్తినీ వినియోగించవలసి వచ్చింది. కమ్యూన్‌లో పోరాడినవాడున్నూ, చరిత్రకారుడున్నూ అయిన 'లిస్సాగరే' 'కమ్యూన్' ప్రభుత్వకార్యాలయం గాదనీ, యుద్ధరంగముందలి బారికేడ్ అనీ

గ్రహించనందుకు కమ్యూన్ నాయకులను చీవాట్లుపెట్టేడు. అతను చెప్పి నది కేవలమూ నిరాధారమైనది కాదు గాని అందులో సగంమాత్రమే నిజము. వెర్సేలిస్– బిస్మార్కియన్ విప్లవ వ్యతిరేక పక్షం– యొక్క నిరంతర అగ్నివర్షంవల్ల, కమ్యూన్ 'బారికేడ్' గానే వుండవలసి వచ్చిందే గాని 'గవర్నమెంటు ఆఫీసు' కాలేకపోయింది. అందువల్లనే కమ్యూన్ కూలీవర్గంయొక్క విజయంవల్ల లభించిన అధికారాన్ని సుస్థిరం చేసుకోడానికిన్నీ, నిర్మాణకార్యాల్ని కొనసాగించడానికిన్నీ కేవలం కొన్ని తప్పటడుగులు మాత్రమే వేయగలిగింది.

తన పనిని పూర్తిగావించలేకపోవడానికి, యింకో ఆటంకంకూడా వుంది. కమ్యూన్‌ను నడిపించడానికిన్నీ, నిర్మాణం చేయడానికిన్నీ సమర్థమైన శ్రామికవర్గ పక్షము, స్పష్టమైన రాజకీయ సిద్ధాంతాలమీద యేర్పడి వున్నది, అప్పట్లో లేకపోవడమే ఆ గొప్ప లోపము. చిన్నచిన్న చేతి పరిశ్రమల్లో పనిచేసేవాళ్ళలోనుంచే పారిస్ శ్రామికవర్గం ముఖ్యంగా బయలుదేరింది. అప్పటికింకా ఆధునిక యంత్రపరిశ్రమలు ప్రాథమికావస్థలోనే వున్నాయి. నిజమైన విప్లవదృక్పథంగల శ్రామికవర్గపక్షం అప్పటికింకా యేర్పడనేలేదు. శ్రామికులలోని వర్గచైతన్యము వివిధతరహాలుగా వుండేది. వాళ్ళందరూ అనేక రాజకీయపక్షాలకు చెంది వుండేవాళ్లు. శ్రామికవర్గం అప్పటికింకా పక్వస్థితిలోకి రాలేదని చాటడానికి ఇదే చాలు. నేషనల్ గార్డు యొక్క సెంట్రలు కమిటీలోనూ, మార్చి 26వ తేదీని యెన్నుకోబడిన 'కమ్యూన్' లోనూ కూడ పరస్పర విరుద్ధమైన రాజకీయాశయాలు గల వివిధపక్షాల ప్రతినిధులు వున్నారు: ప్రౌధన్ కక్షికి చెందిన పెట్టీ బూర్జువా అనార్కిస్టులు, బ్లాంక్విస్టులు, రెబూఫిస్టులు, జాకోబిన్‌లు, యింటర్‌నేషనల్‌కు చెందినవాళ్లు, మొదలైనవారనేకులు. ఈ కడపట పేర్కొన్న పార్టీకి చెందినవాళ్లు స్వల్పసంఖ్యాకులుగా వున్నా కానీ, కమ్యూన్‌యొక్క కార్యక్రమాన్ని నిర్ణయించ

దంలో వాళ్ళదే ముఖ్యపాత్ర యని చెప్పవచ్చును. కమ్యూన్ చేసిన పనులనుబట్టి చూస్తే యీ విషయం స్పష్టం అవుతుంది. వాళ్ళు వ్యక్తిగతంగా, రాజకీయంగా, సిద్ధాంతరీత్యా, అనుభవం అంతగా లేనివాళ్ళే గాని వీళ్ళే కమ్యూన్‌లో ముఖ్య పాత్ర ధరించేరు.

పారిస్ శ్రామికుల్లో చిరకాలానుగతమైన పెట్టీ బూర్జువాతత్త్వమూ, ప్రజాతంత్ర భ్రమలూ యెక్కువగా వున్నాయి. వాళ్ళంతా చేతిపరిశ్రమల నుండి వచ్చి-వుండడమున్నూ, జాకోబినుల నియంతృత్వకాలంనాటి, ౧౮ వ శతాబ్దపు బూర్జువా విప్లవాలనాటి దేశభక్తి యనే భ్రమనుంచి విముక్తులు గాకుండడమున్నూ దీనికి కారణాలు. ఫ్రెంచి కూలీవర్గంలోని యీ పురాతనభ్రమలని తొలగించడానికి 'కమ్యూన్' యొక్క అనుభవాలూ, మే నెలలోని రక్తప్రవాహసంకులితాలైన ఆ దుర్దినాలున్నూ అవసరమై వున్నాయి

ఈ విధంగా 'కమ్యూన్' తన మార్గాన్ని పూర్తిగా గడవకముందే, తప్పించరాని విధికి లోనై పోయింది. వెర్సేలిస్ సేనలు కురిపించే అగ్ని వర్షంలో మునిగిపోయి, మొట్టమొదటి కూలీప్రభుత్వం యిరవై అయిదు వేల స్త్రీ పురుషుల, పసిపాపల యొక్క రక్తంలో మునిగి, మే నెల ౨౮ తేదీని కూలిపోయింది. పారిస్ ప్రజలలో, కూలీలలో ఉత్తమోత్తముల ప్రాణాలు బలి యియ్యబడినాయి.

★ ★ ★

కమ్యూన్ యొక్క చారిత్రక ప్రాముఖ్యతను గ్రహించాలంటే ఒకే ఒక చారిత్రక దృక్పథముయొక్క రెండు ముఖాలనుండే పరిశీలించాలి. మొదటిది, శ్రామికవర్గ విప్లవంయొక్క అభివృద్ధి క్రమంలో కమ్యూన్ యొక్క స్థానము దృష్టిలో వుంచుకొని; రెండోది, యిరవదో శతాబ్దంలోని శ్రామికవర్గ విప్లవాలకి మార్గదర్శిగా దీనికిన్నీ యితర విప్లవాలకిన్నీ గల భేదాన్ని దృష్టిలో వుంచుకుని.

౧౮౪౮ వ సంవత్సరపు జూన్ విప్లవంలోని అనుభవాల్ని పునాదిగా చేసుకుని, వాటిని కార్యరూపంలోకి తెచ్చింది. పారిస్ కమ్యూన్. ౧౮౪౮ జూన్ విప్లవం యొక్క ప్రాముఖ్యతని చక్కగా గ్రహించే మార్క్స్ యిట్లా చెప్పేరు.

" ౧౮౪౮ ఫిబ్రవరికి పూర్వము ఫ్రాంసులో జరుగు ప్రతీ తిరుగుబాటూ 'ప్రభుత్వ విధానాన్ని మార్చడానికే' ప్రయత్నిస్తుంది. కాని ౧౮౪౮ జూన్ తర్వాత బయలుదేరే ప్రతీ విప్లవమూ కూడా 'బూర్జువా సమాజ విధానాన్నే' మార్చడానికి యత్నిస్తూ వుంటుంది." Class Struggles in France. ఈ విషయాన్ని పారిస్ కమ్యూన్ . ఋజువు చేసింది. ౧౮౪౮ జూన్ నాటికి శ్రామికవర్గం 'తనంతట తానే విప్లవాన్ని నడిపించే సామర్థ్యాన్ని' సంపాదించి వుండలేదు ; పారిస్ కమ్యూన్ ఒకటే. 'సామాజిక విప్లవాన్ని తీసుకువచ్చే వర్గం ఒక్క శ్రామికవర్గమే' అని బహిరంగంగా వెల్లడిచేసిన మొదటి విప్లవం. ౧౮౪౮ జూన్ నాటికి శ్రామికవర్గం. 'తన సామాజిక దాస్యవిముక్తికోసం శత్రుశిబిరాన్ని జయించే ప్రయత్నాలు చేసే సమర్థత గలది అయింది ; కమ్యూన్‌తోనే యీ ప్రయత్నాలు కార్యరూపాన్ని దాల్చినాయి. వర్గభేదాలున్నూ, వర్గప్రభుత్వమున్నూ యే ఆర్థికవిధానానికి ఫలితాలో, ఆ విధానాన్ని కూలద్రోయడానికి సాధనంగా వుపయోగించబడింది, కమ్యూన్. ౧౮౪౮ జూన్‌లోనే పెరించి శ్రామికులు ప్రత్యేకవర్గంగా యేర్పడి, కేవైగ్నాక్ యొక్క అగ్నివర్షంలో తమ జన్మదినోత్సవాన్ని రక్తరంజితంగా చేసుకున్నారు. కమ్యూన్‌తో, శ్రామికవర్గం తమ ప్రభుత్వాధికారం మొదటిసారి స్థాపించ గలిగేరు.

సందొమ్మిదో శతాబ్దంలో ఫ్రాంసులోని వర్గకలహాలయొక్క, శ్రామికవిప్లవాలయొక్క చరిత్ర ప్రపంచ శ్రామికులకు మరువరాని గుణపాఠాల్ని గరపుతూవుంది. ౧౮౪౮ జూన్ తిరుగుబాటు, ౧౮౭౧ లోని

పారిస్ కమ్యూన్, ఇటీ అనుభవమునైననే తరువాతి శ్రామికవర్గ పోరాటాలూ, విప్లవాలూ ఆధారపడి వున్నాయి. శ్రామిక విప్లవాల చరిత్రలో పారిస్ కమ్యూన్‌తో ఒక నూతనాధ్యాయం ప్రారంభం అయింది. 'ప్రపంచ చరిత్రకు ముఖ్యావసరమైన ఒక నూతనమార్గాన్ని' పారిస్ కమ్యూన్ చూపించింది. (౧౮౭౧ యేప్రిలు ౧౭ తేదీని కూగల్‌మాన్‌కు మార్క్స్ వ్రాసేడు.) కమ్యూన్‌వల్ల నేర్చిన గుణపాఠాలు నేటికీ ప్రపంచ శ్రామికులకు మార్గసూచకములుగా వున్నాయి. విజయవంతమైన ౧౯౧౭ అక్టోబరు విప్లవంవల్ల కమ్యూన్‌యొక్క అనుభవాలన్నీ యధార్థాలని ఋజువుచేయబడినాయి. శ్రామికవర్గ నియంతృత్వం అంటే యేమిటి? అనే సమస్యని పరిష్కరించి, దానిలోనే యిమిడివున్న అనేక యితర సమస్యలకికూడా 'కమ్యూన్' సమాధానం యిచ్చింది. ఈ సమస్యనిగురించి చర్చించి, మార్క్స్ తను వ్రాసిన Civil war in France, Eighteenth Brumaire అను గ్రంథాల్లో ఒక పర్యవసానానికి వచ్చేడు. జూన్ తిరుగుబాటువల్ల నేర్చిన పాఠాల ఫలితమే అది. "రాజ్యాంగంయొక్క అధికార వర్గాన్ని, ఇదివరకటి ఒకరి చేతుల్లోంచి యింకొకరి చేతుల్లోకి యిదివరకులాగ మార్చడముగాక వాటిని పూర్తిగా నాశనంచేయడమే" ఫ్రెంచి విప్లవానికి యిప్పటినుంచీ ప్రథమ కర్తవ్యము కాగలదు. (౧౮౭౧ యేప్రిలు ౧౨ తేదీని మార్క్స్ కూగల్‌మాన్‌కు వ్రాసిన జాబు.) నాశనం చేయబడిన బూర్జువారాజ్యాంగయంత్రం యొక్క స్థానాన్ని యేది ఆక్రమించాలి? అనేదే తరువాతి మనల నెదుర్కొనే సమస్య. ఈ సమస్య పరిష్కరించబడితేనే శ్రామికవర్గ విప్లవం అభివృద్ధి చెందుతూ, ముందుకు సాగిపోతుంది. మార్క్స్‌కూడా తన కమ్యూనిస్టు మేనిఫెస్టోలో దీనికి అస్పష్టంగానే సమాధానం యిచ్చేడు. "రాజ్యాధికారం వహించే వర్గంగా శ్రామికవర్గమే తన సంస్థను బూర్జువారాజ్యాంగ యంత్రంయొక్క స్థానంలో యేర్పరచాలి." జూన్ ౧౮౪౮ తిరుగుబాటులోని గుణపాఠాల్నిబట్టి,

మార్క్స్ Class Struggles in France అనే గ్రంథంలో యీ క్రింది హెచ్చరికల్ని యిచ్చేరు: "బూర్జువావర్గం నశించాలి! కూలీల నియంతృత్వం స్థాపించాలి!" తరువాత Eighteenth Brumaire లో యీ సంకేతపదాల్ని విపులీకరించుతూ, హెచ్చరికను "బూర్జువావర్గము యొక్క అధికారివర్గాన్ని, మిలిటరీ సంస్థల్ని నాశనం చేయండి!" అని యిచ్చేరు. కాని, యీ హెచ్చరిక మొట్టమొదట అనుభవంలోకి వచ్చినది, కమ్యూన్‌లోనే. ఇది యథార్థమని కమ్యూన్‌లోనే రుజువైంది. "చిట్ట చివరకు శ్రామికవర్గంయొక్క ఆర్థిక దాస్యవిమోచనమును సాధించగల రాజ్యాంగవిధానమే" కమ్యూన్ అని మార్క్స్ Civil war in France లో వ్రాసేరు. దీనికి యేంగెల్సు యీ వ్యాఖ్యానాన్ని చేర్చేరు:

> "బాగుంది. ఈ నియంతృత్వం యెట్లా వుంటుందో తెలుసుకోవాలని వుందా, మరి? పారిస్ కమ్యూన్‌ను చూడండి. శ్రామికవర్గనియంతృత్వం అంటే అదే!" Civil war in France కు పీఠికలో ౧౮౯౧ మార్చి ౧౮ న యేంగెల్సు వ్రాసేరు.)

పారిస్ కమ్యూన్‌యొక్క గుణపాఠాలను గురించి మార్క్స్ చెప్పిన గంభీరమైన సిద్ధాంతాలు గ్రహించాలంటే కమ్యూన్‌యొక్క పాఠాలతో అవినాభావసంబంధం కలిగి, వాటికంటే ముందుకు పోయి, వాటికి యథార్థత్వము నిచ్చిన యిరువదో శతాబ్దంలోని విప్లవానుభవాలమీద దృష్టినుంచి చూడాలి. పశ్చిమ యూరోపునందలి సోషల్ డెమోక్రాటిక్ పార్టీలలోని సంస్కరణ వాదులచేతా (revisionist), కేంద్రీకరణవాదుల (centralist) చేతా, కమ్యూన్ యొక్క పాఠాలన్నిటికీ పెడర్థాలు చెప్పబడినాయి; తీవ్రవాదులు కూడా వాటిని మరిచిపోయేరు. ఈ విధంగా విస్మరించబడి, పెడమార్గంలో పెట్టబడిన కమ్యూన్‌పాఠాల్ని తిరిగి లెనిన్ బయటకుతీసి, ప్రచారం చేయవలసివచ్చింది. రష్యాలోని విప్లవసంఘటనల అనుభవంమీద 'శ్రామికవర్గ నియంతృత్వము' ను (కమ్యూన్ చరిత్రనుంచి మార్క్సుచేత సిద్ధాంతీ

కరించబడిన దానిని) లెనిన్ తిరిగి కనిపెట్టి, దానిని విపులీకరించి, గంభీరంగా చేసేడు.

పారిస్ కమ్యూన్ యొక్క పాఠాలు తిరిగి ౧౯౦౫, ౧౯౧౭ అక్టోబరు విప్లవాల్లో. ఉన్నతదశలో అనుభవానికి వచ్చేయి. శ్రామికవర్గ నియంతృత్వం యేర్పడడానికి తగిన సామాజిక పరిస్థితులు బలీయం కావడంతో. దానియొక్క చారిత్రక కర్తవ్యాలు ముఖ్యస్థానంలోకి రావడంతో. యీ నియంతృత్వంయొక్క సామాజికశక్తిత్వం మార్పు చెందుతూ, దాని రూపముకూడా (దోపిడీచేసే వర్గంయొక్క ప్రభుత్వాన్ని తీవ్రంగా నిర్మూలించడానికై దోపిడీచేయబడుతూన్న కష్టజీవులచేత నిర్మించుకోబడిన శ్రామికవర్గ నియంతృత్వరూపములు) అభివృద్ధి పొందినాయి. మనం యీ రోజున 'ప్రజాతంత్ర రాజ్యాంగ విధానం యొక్క ఉన్నతరూపం' (లెనిన్) అంటే, 'ప్రజారాజ్యం' Commune State యొక్క అభివృద్ధి క్రమంలోని వివిధదశల్ని నిర్ణయించగలుగుతూన్నాము. తగినంత విస్పష్టరూపంలోకి అభివృద్ధిచెందనిదైనా, పెట్టీ బూర్జువా ప్రజాతంత్ర సిద్ధాంతాలచేత క్రుంగదీయబడినదైనా, 'పారిస్ కమ్యూన్', శ్రామికవర్గ నియంతృత్వానికి మొదటిరూపం. "నూతన సమాజమందలి శక్తులకు స్వేచ్ఛ నీయవలసిన" (Civil war in France లో మార్క్స్ వ్రాసేడు.) చారిత్రక కర్తవ్యము కమ్యూన్‌పైననే వున్నది. ఆ కాలంనాటి శ్రామికులలోని స్వల్పసంఖ్యాకులైన వర్గచైతన్యంగలవాళ్లమీదే కమ్యూన్ యొక్క జయం ఆధారపడివుంది. వ్యావసాయిక ప్రజల్ని తమవైపుకి ఆకర్షించుకోడానికి శ్రామికవర్గపక్షం చేసే యత్నాలు అప్పటికింకా ప్రారంభదశలోనే వున్నాయి.

౧౯౦౫ లో రష్యాలోని సోవియట్లు, పారిస్ కమ్యూన్‌కంటె విశాలమైన సామాజిక బలాన్ని కలిగివుండడంచేతా, శ్రామికవర్గము బూర్జువా విప్లవంలో ప్రముఖపాత్ర వహించడంచేతా, విప్లవచైతన్యం

వ్యవసాయిక ప్రజల్లోకూడా మహావేగంగా వ్యాపించడంచేతా "శ్రామికవర్గ నియంతృత్వాన్ని" అనగా "కష్టజీవుల ప్రజాతంత్రాన్ని" సాధించడంలో యింకో అడుగు ముందుకు వేయగలిగేయి. ౧౯౧౭ అక్టోబరు విప్లవం విజయవంతం అయిన తర్వాతనే చరిత్రలో మొదటిసారి 'శ్రామికవర్గ నియంతృత్వం' సరియైన రూపాన్ని దాల్చి, పెట్టుబడిదారీ సమాజపతనాన్నీ, సోషలిజం యొక్క పుట్టుకనీ సూచిస్తూ, సోవియట్ల రూపంలో సాధించ బడింది. శ్రామికవర్గం ఒక్కటే చివరకంటా విప్లవకారియనిన్నీ, దోపిడీ చేయబడుతూన్న పీడిత ప్రజాసామాన్యాని కంతకీ నిజమైన ప్రతినిధి యనిన్నీ, యీ వర్గనియంతృత్వమే 'నూతనసామాజిక శక్తులన్నిటికీ' స్వేచ్ఛ నిచ్చి, నవీనసోషలిస్టు సమాజాన్ని నిర్మించే బాధ్యతను వహించగల దనిన్నీ, మనము గుర్తించాలి.

ఈ పుస్తకంలో మిక్కిలి ముఖ్యమైన వ్యాసాలు, వుపన్యాసాలు, యితర గ్రంథాల్లోని ఉద్ధృతభాగాలు, మొదలైన వెన్నో వున్నాయి. వీటిలో కమ్యూన్‌వల్ల నేర్చిన గుణపాఠాల కొక స్థిరరూపం యిచ్చి, లెనిన్ వాటి నభివృద్ధిచేసేడు. అతనియొక్క సిద్ధాంతాల్లోనూ, వ్రాతల్లోనూ కూడా—శ్రామికవర్గ నియంతృత్వ సమస్యా, దాని కొరకై చేసే పోరా టమూ, దోపిడిచేసేవాళ్లయొక్క రాజ్యాంగాన్ని నాశనం చేసి 'శ్రామికవర్గ ప్రజాతంత్ర' స్థాపనకై సాగించే విప్లవపోరాటమూ,— వీటిని గురించే సూత్రప్రాయంగా కనిపించుతూ వుంటాయి. నూతనశకారంభకమైన సోవియట్ల అధికారం ౧౯౧౭ విప్లవం తర్వాత యథార్థరూపాన్ని దాల్చింది. లెనిన్ తన యెత్తుగడలు, వ్యూహరచనానైపుణి, ప్రతిభావిశేషమూ,— అన్నీ యీ సోవియటు అధికారాన్ని విస్పష్టంచేయడానికే వినియోగించేడు. అతని వుపదేశాల్లోని యాథార్థ్యాన్ని ౧౯౧౭ అక్టోబరు విప్లవం చాటింది. ఈ విప్లవమే పారిస్ కమ్యూన్ యొక్క అనుభవాల్ని మెరుగుపెట్టి, చారిత్రకంగా ఉన్నతస్థితిలో అమలులో పెట్టింది.

కమ్యూన్ యొక్క గుణపాఠాలమీద లెనిన్ వ్యాఖ్యానాలు చారిత్రక రచనలు మాత్రమే కాదు. అవి నేటికీ మనకు మార్గదర్శకములు. మొత్తంమీద అవన్నీ ప్రపంచ శ్రామిక విప్లవానికి వుపయుక్తమైన యెత్తుగడల్ని నిర్ణయించడానికి ముఖ్యావసరములు.

**పాల్ బ్రస్.**

ప్రపంచ చరిత్రలో మొదటి శ్రామికవర్గ విప్లవమే, పారిస్ కమ్యూన్. 1870 సెప్టెంబరులో నెపోలియన్ సింహాసనభ్రష్టుడై, రెండవ సామ్రాజ్యము కూలిపోయింది. దాని స్థానంలో జాతీయప్రభుత్వం స్థాపించబడింది. అదే ఫ్రెంచిరిపబ్లిక్. దానిలో ముఖ్యులుగావున్న 'థీర్స్' మొదలైనవాళ్ళు జర్మన్‌లతో కలిసి జాతిద్రోహానికి పూనుకోగానే పారిస్ శ్రామికులూ, ప్రజలూ తిరుగబడి, ప్రభుత్వాధికారాన్ని డెబ్బది రోజులవరకూ తమ చేతుల్లో వుంచుకొన్నారు. "పాలకవర్గంగా యేర్పడ్డ శ్రామికవర్గంయొక్క సంస్థ" యొక్క మొదటి రూపమే కమ్యూన్. ఆ తర్వాత రష్యాలో 1905 డిసెంబరు విప్లవంలో యీ 'శ్రామికవర్గసంస్థ' సోవియట్ రూపాన్ని దాల్చింది. తరువాత 1917 అక్టోబరు విప్లవంలో శ్రామికులు తమ విజయాన్ని చారిత్రాత్మకంగా స్థిరపరచుకొన్నారు.

ఇది 'పారిస్ కమ్యూన్'. ఇదివరలో 'రష్యావిప్లవం, 1905' ప్రకటించేము. (అది మద్రాసు కాంగ్రెస్ ప్రభుత్వంచేత నిషేధించబడింది.) త్వరలో 'అక్టోబరు విప్లవం' కూడా ప్రకటించి, ప్రపంచశ్రామిక విప్లవాల చరిత్రల్ని ఆంధ్రుల కర్పించి, మా కర్తవ్యాన్ని నెరవేర్చుకొంటాము.

**మహీధర జగన్మోహన్‌రావు.**

౧

# పారిస్ కమ్యూన్ యొక్క స్మృతి.

పారిస్ కమ్యూన్ ప్రకటించబడిన తర్వాత నలభై సంవత్సరాలు గడిచేయి. ఫ్రెంచి శ్రామికులు, వాళ్ల ఆచారం ప్రకారంగా ౧౮౭౧ మార్చి ౧౮ తేదీ నాటు విప్లవాన్ని నడిపించిన కూలీల స్మృతిగౌరవసూచకంగా సభలు, ఊరేగింపులు జరుపుతూన్నారు. మే నెలాఖరున వీళ్లందరూ పూలదండలు తీసుకొనివచ్చి తుపాకుల కెరమై మరణించిన కమ్యూనార్డుల (కమ్యూన్‌లో పనిచేసినవాళ్లు) సమాధులదగ్గర వుంచుతారు. భయంకరమైన ఆ 'మే వారము' లో బలిఅయిపోయిన ఆ ధైర్యశాలుల సమాధుల వద్ద వీరంతా తిరిగి ప్రతిజ్ఞలు తీసుకుంటారు: వాళ్లవుద్దేశాలు పూర్తిగా నెరవేరేవరకూ, వాళ్ల పక్షము సంపూర్ణంగా జయించేవరకూ, నిరంతర పోరాటం జరపడానికి ప్రతిజ్ఞలు చేస్తారు.

ఒక్క ఫ్రాంసులోనే గాక ప్రపంచమంతటా కూడా శ్రామికులు పారిస్ కమ్యూన్‌లోని కూలీలను తమ మార్గదర్శకులుగా భావిందుకు

గౌరవిస్తున్నారు? కమ్యూన్‌వల్ల నేర్చుకోదగిన విశేషమేమి ?

కమ్యూన్ దానంతటదే బయలుదేరింది. ఎవరూ కూడా తెలిసిపుండి. యిది యిట్లాచేద్దామని కమ్యూన్‌ను బయలుదేరతీయలేదు. జర్మనీతో జరిగినయుద్ధంలో ఓడిపోవడం; యుద్ధకాలంలోని కష్టాలు; మామూలు పనులు దొరక్కపోవడం; మధ్యతరగతిప్రజల ఆర్థికవినాశనం: ఉన్నత వర్గాల మీదా, తమ అసామర్థ్యాన్ని వెల్లడిచేసికొన్న ప్రభుత్వోద్యోగుల యెడలా ప్రజాసమూహాలకు గల అసహ్యభావం;తమ దుస్థితియెడల అసంతృప్తితో, సామాజికవిధానం మారిపోవాలని యత్నించే కష్టజీవుల్లోని సంచలనం; నేషనల్ ఎసెంబ్లీలోని సభ్యుల్లో చాలమంది రియాక్షనరీలు అవడంవల్ల 'ప్రజాస్వామ్యప్రభుత్వం' యొక్క గతి యేమగునో యనే భయం,—యివీ, యింకా అనేక యితరకారణాలూ కలిసి పారిస్‌ప్రజలను మార్చి ౧౮ వ తేదీని తిరగబడేటట్లు చేసేయి. ఇందువల్ల తలవనితలంపుగా ప్రభుత్వాధికారమంతా 'నేషనల్ గార్డు' చేతుల్లో, కష్టజీవులూ, వాళ్లతోకలిసిన మధ్యతరగతిప్రజలూ,— వీళ్ల ప్రతినిధులచేతుల్లో పెట్టబడింది.

ఇట్లాంటి సంఘటన చరిత్రలో అంతకుముందెప్పుడూ జరిగియుండలేదు. అప్పటిదాకా అధికారమంతా భూస్వాములయొక్క, పెట్టుబడిదారులయొక్క చేతుల్లో,అంటే ప్రభుత్వాన్నినడిపించే యీ వర్గప్రతినిధులచేతుల్లోనే వుండేది. మార్చి ౧౮ వ తేదీ విప్లవంతర్వాత థీర్సుప్రభుత్వము సేనలతోటీ, పోలీసులతోటీ, ప్రభుత్వోద్యోగులతోటీ పారిస్‌నుండి పారిపోగానే ప్రజలచేతుల్లోనే అధికారంపడింది. శ్రామికులు తమ చేతుల్లోకి ప్రభుత్వాధికారాన్ని తీసుకున్నారు. కాని, ఆధునికసమాజంలో ఆర్థికంగా పెట్టుబడి విధానానికి బానిసలుగా చేయబడిన శ్రామికవర్గం, పెట్టుబడితో తమ్ము బంధింపుతూన్న సంకెళ్లను బద్దలుకొడితేనేగాని రాజకీయంగా స్వాతంత్ర్యాన్ని పొందలేదు. ఇందువల్లనే 'కమ్యూన్' సోషలిస్టుపద్ధతిని అవలంబించవలసివచ్చింది. అనగా బూర్జువావర్గంయొక్క అధికారాన్నీ, పెట్టుబడి

యొక్క ఆధిక్యతను కూలద్రోయ యత్నించింది. ప్రస్తుతసామాజిక విధానంయొక్క పునాదుల్నే నాశనం చేయ సంకల్పించింది.

మొదట్లో యీ ఉద్యమం చాలా అనిశ్చితంగానూ, అగమ్యగోచరం గానూ వుంది. కమ్యూన్ తిరిగి జర్మనులతో యుద్ధాన్ని జయప్రదంగా కొనసాగిస్తుందనే ఆశతో కొందరు దేశాభిమానులు దానిలో చేరేరు. బాకీలు, అద్దెలు, కొంతకాలం నిలుపుచేసి, చిన్నచిన్నదుకాణదారుల్ని దివాలాల నుంచి తప్పించడంచేత వాళ్లంతా కమ్యూన్‌లో చేరేరు. (పూర్వపు ప్రభుత్వం వాళ్లకట్లాంటి సదుపాయం యేమీ చేయలేదు.) అంతేగాక, రియాక్షనరీలతో (మూర్ఖులూ, విద్యాజ్ఞానంలేనివాళ్లూ అయినభూస్వాములు) కూడిన 'నేషనల్' ఎసెంబ్లీ తిరిగి నిరంకుశరాజరికాన్నే స్థాపిస్తుందేమో అనే భయంవల్ల ప్రారంభంలో బూర్జువా ప్రజాస్వామ్యవాదులందరూ కమ్యూన్‌కే సానుభూతిచూపేరు. కాని యీ ఉద్యమంలో ముఖ్యపాత్ర కూలీలదే. (అందులోనూ పారిస్‌లోని వృత్తివిప్లవులు అగ్రగణ్యులు). రెండో సామ్రాజ్యపురోజుల్లోనుంచీ వాళ్లల్లో సోషలిస్టుప్రచారం బ్రహ్మాండంగా కొనసాగించబడుతూవుండేది. ఈ కూలీల్లో చాలామంది ఫస్టు యింటర్‌నేషనల్‌కు చెందినవాళ్లు కూడా వున్నారు.

కమ్యూన్‌కు చివరివరకూ కూలీలే విశ్వాసపాత్రులుగా వున్నారు. బూర్జువా ప్రజాస్వామ్యవాదులూ, మధ్యతరగతులవాళ్లూ త్వరలోనే కమ్యూన్ నుంచి విడిపోయారు. ఉద్యమం, సోషలిస్టువిప్లవంగా మారుతూందనగానే బూర్జువా ప్రజాతంత్రవాదులున్నూ, ఓడిపోతుందనితోచగానే మధ్య తరగతులవాళ్లున్నూ, కమ్యూన్‌ను వదిలేశారు. 'తమ'ప్రభుత్వాన్ని ఒక్క ఫ్రెంచిశ్రామికులే నిర్భయంగానూ, విసుగులేకుండానూ ప్రోత్సహించి, దానికోసమై పోరాడి, ప్రాణాల్నికూడా బలియిచ్చేరు. కష్టజీవుల దాస్య విముక్తికై, వాళ్లందరికీ భవిష్యత్తును సుఖపూరితంగా చేయడానికై అసహాయులుగానే పోరాడి, మరణించేరు.

నిన్నటిదాకా స్నేహితులుగావున్నవాళ్లు వదిలివేయడంచేతా, యితరుల సహాయం లభించకపోవడంచేతా. 'కమ్యూన్'కు అపజయం తప్పదని తేలిపోయింది ఫ్రాంసుదేశపు బూర్జువావర్గం, భూస్వాములు, స్టాక్ బ్రోకర్లు, ఫాక్టరీయజమానులు. పెద్దచిన్నదోపిడీగాండ్లందరూ, తోడిదొంగలంతా ఏకమై కమ్యూన్‌ను యెదిరించేరు. ఈ బూర్జువాసంఘటనను బిస్మార్కు బలపరచేడు. (విప్లవజ్వాలల్లోవున్న పారిస్‌ను అణిచివేయడానికి బిస్మార్కు లక్షమంది ఫ్రెంచిసైనికుల్ని, తనకు ఖైదీయిగానున్నవాళ్లని విడిచిపెట్టేడు.) వెనకబడివున్న వ్యవసాయికప్రజల్నీ, మధ్యతరగతుల్నీ రెచ్చగొట్టి, పారిస్ శ్రామికులంటే వ్యతిరేకులుగాచేసి, వారిమీద దండెత్తునట్లుచేయడంలో ఫ్రెంచి బూర్జువాలు కృతకృత్యులైరి. వీళ్లందరూ పారిస్‌ను రెండువైపుల చుట్టుముట్టేరు; (మిగిలినరెండుప్రక్క లా జర్మన్ సైన్యాలు చుట్టుముట్టివున్నాయి.) ఇతరపెద్దపట్టణాల్లో కూడా (మార్సేలిస్, లయాన్స్, సెంటు ఎటీన్నె, టీజోన్ మొదలైనవి) కూలీలు తిరిగబడి, ప్రభుత్వాధికారాన్ని వశపరుచుకుని, కమ్యూన్ ప్రకటించి, పారిస్ కమ్యూన్ సహాయార్థం రాదలచేరు. కాని, వారి ప్రయత్నాలు అపజయం పొందినాయి. మొట్టమొదట శ్రామికవిప్లవధ్వజాన్ని యెగరవేసిన పారిస్, తన స్వశక్తిమీదే ఆధారపడి వుండవలసివచ్చింది. కమ్యూన్‌కు పతనం తప్పదని నిశ్చయమైపోయింది.

ఉత్పత్తిసాధనాల అభివృద్ధి, శ్రామికుల సంసిద్ధతా,— అధమం యీ రెండు నియమాలైనా పూర్తిఅయివుండాలి, యేదైనాసామాజికవిప్లవం జయప్రదంకావాలంటే. కాని, ఫ్రాంసులో ౧౮౭౧ నాటికి యిందులో యే నియమమూ కూడా పూర్తికాలేదు. ఫ్రెంచి పరిశ్రమలు అప్పటికి కొంచెం కొంచెంగా అభివృద్ధిచెందుతూ వున్నాయి; ప్రజల్లో అత్యధికసంఖ్యాకులు మధ్యతరగతికిచెందినవాళ్లు. (రైతులు, చిన్నవర్తకులు, వృత్తినిపుణులు మొదలైనవాళ్లు.) అంతేకాక కూలీలకు సుశిక్షితమైన పార్టీ యేదీ లేదు. కూలీలందరూ అశిక్షితులుగాను, అసంసిద్ధులుగాను, వుండి, తమ

కర్తవ్యమేదో, దానిని యెట్లా నెరవేర్చాలో కూడా తెలియని స్థితిలో వున్నారు. శ్రామికులకై తీవ్రంగా పనిచేసే రాజకీయసంస్థలు గాని బలమైన ట్రేడ్ యూనియన్‌లు గాని, సహకారసంఘాలు గాని లేవు

అన్నింటికంటే ముఖ్యంగా ఒక్క విషయంలో కమ్యూన్‌కు చాల అసౌకర్యం యేర్పడింది. చేయవలసిన కార్యక్రమాన్ని గురించి ఆలోచించి, నిర్ణయించి, దాన్నిపూర్తిచేయడానికి యత్నించే మాత్రపు వ్యవధి కూడా లేకపోయింది

ఇన్ని వ్యతిరేకపరిస్థితుల్లో, తన స్వల్పజీవితకాలంలోనే, కమ్యూన్ కొన్నిఘనకార్యాల్ని నెరవేర్చగలిగింది. వాటినిబట్టే మనం కమ్యూన్ యొక్క తత్వాన్నీ, ఆదర్శాల్నీ బాగా గ్రహించగలము. పాలకవర్గాలచేతిలో కీలుబొమ్మగా వుపయోగించబడుతూన్న సైన్యాన్ని రద్దుచేసి, దానిస్థానే ప్రజాసంఘాన్నే సాయుధమొనర్చింది కమ్యూన్. చర్చికీ, ప్రభుత్వానికిన్నీ సంబంధంలేదని ప్రకటించి, మతసంస్థలకి ప్రభుత్వం యిస్తూన్న విరాళాల్ని నిలిపివేసి, ప్రజలలో విద్యావ్యాప్తిగావించే బాధ్యతని ప్రభుత్వమే వహిస్తుందనీ, ఆ విద్యకూడా మతసంబంధంకానిదే యనీ ప్రకటించి, కాషాయవస్త్రాల్లో సంచరించే ప్రజాపీడకుల (మతబోధకుల) నోటమట్టి కొట్టింది. సామాజికవిషయాల్లో కమ్యూన్ చేయగలిగింది చాలా స్వల్పము. అయినా ఆ స్వల్పమే చాలు, కమ్యూన్ ప్రజానుకూలమైన ప్రభుత్వమనీ, కష్టజీవుల ప్రతినిధియనీ చాటడానికి. రొట్టెలఫాక్టరీల్లో రాత్రిళ్లు పనిచేయించరాదని శాసించింది; పనివాళ్లకు జుల్మానాలువేయడాన్ని 'చట్టసమ్మతంగా పనివాళ్లను దోపిడీచేయడాన్ని' నిషేధించింది; యజమానులచేత ఆపివేయబడినవి, విడిచిపెట్టబడినవి. యిలాంటి ఫాక్టరీలూ, యంత్రాలయాలూ కూడా ఆయా ఫాక్టరీ కార్మికుల సంఘాలకు స్వాధీనం చేయబడాలనీ, సరుకుల ఉత్పత్తి యథాప్రకారంగా కొనసాగిస్తూవుండాలనీ శాసనాన్నిచేసి కమ్యూన్ మార్గదర్శి అయింది. ప్రభుత్వంలోనూ, ప్రభుత్వ

శాఖలన్నిటిలోనూ పనిచేసే యే ఉద్యోగికీ కూడా యివ్వబడే జీతం, సాధారణకూలీకి యిచ్చే వేతనం కంటె అధికంగా వుండరాదనిన్నీ, యేపక్షంలోనూ కూడా ఉద్యోగులకిచ్చే జీతాలు సంవత్సరానికి ౬౦౦౦ ఫ్రాంకులకు మించరాదనీ కూడా చట్టము చేయబడింది. వీటన్నిటివల్లా కమ్యూన్ యొక్క నిజమైన ప్రజాతంత్రస్వభావమున్నూ, శ్రామికవర్గతత్త్వమున్నూ ఋజువు చేయబడుతూన్నాయి.

దానిసత్త్వంమీదా, దోపిడీవిధానంమీదా ఆధారపడివున్న పాత ప్రపంచానికి పారిస్ కమ్యూన్‌యొక్క యీ చర్యలన్నీ కూడా హృదయశల్యాలు అయినాయి. పారిస్ సిటీహాలుమీద శ్రామికవర్గంయొక్క ఎర్రజెండా యెగురుతూన్నంతకాలమూ బూర్జువాసమాజం నిశ్చింతగా ఊరుకుని వుండలేకపోయింది. అశిక్షితమైన విప్లవశక్తుల్ని సుశిక్షితమైన ప్రభుత్వసైన్యాలు ఓడించగలిగినాయి. జర్మనులచేత చావదెబ్బలుతిని, శోకముడిచిన బోనపార్టిస్టు సేనాపతులు, ఓడిపోయిన తమ సోదరదేశీయులతో పోరాడడంలోనే తమ ప్రతాపం అంతా చూపించేరు. ఈ ఫ్రెంచి రెన్నైన్‌హాంఫ్‌లు, మెల్లర్ - జకోమెల్‌స్కీలు, — ఓక్లండబటా కలిసి పారిస్‌నగరంలో అంతవరకూ యెవరూ కనీవినీ యెరుగని హత్యాకాండను ప్రారంభించేరు. ముష్కరులైన సైనికులు, ముప్ఫదివేలమంది పారిస్ ప్రజల్ని చంపిపారేశారు. నలభై అయిదువేలమందిని యెరెస్టుచేసి, వాళ్లలో చాలమందిని పురితీసేరు, కాల్చివేసేరు: కొందరికి ప్రవాసశిక్షలూ, మరికొందరికి దీర్ఘశిక్షలూ విధించేరు. అనేకవృత్తులకు చెందిన పనివాళ్లని, మొత్తంమీద ఒక లక్షమందిని పారిస్ కోల్పోయింది.

బూర్జువాలు సంతృప్తులయేరు. వాళ్లనాయకుడు, రక్తపిపాసి, వామనస్వరూపి యైన థీర్సు, పారిస్ కూలీలకు తనూ, తన సేనాధిపతులూ కలిసి ఒసగిన రక్తస్నానానికి సంతృప్తుడై, "అమ్మయ్యా, ఇప్పటికి సోషలిజాన్ని కొంతకాలందాకా తలయెత్తకుండా చేసేము" అన్నాడు, కాని,

యీ బూర్జువా కుక్కల మొరుగులు వృథా అయినాయి. కమ్యూన్‌ను అణిచివేసిన తర్వాత ఆరు సంవత్సరాల్లోనే ఫ్రాన్సులో తిరిగి శ్రామికోద్యమం బయలుదేరింది. అప్పటికింకా కమ్యూన్‌లో పోరాడినవాళ్లు వేలకొద్దీ జైళ్లలోనూ, ప్రవాసంలోనూ మగ్గుతూనేవున్నారు. ఈ నూతనతరంలోని సోషలిస్టులు, పూర్వుల అనుభవాలతో తమ యెత్తుగడలను సరిచేసికొని, వాళ్ల ఓటమిపట్ల యెట్టినిరుత్సాహమూ చెందక, కమ్యూన్ కొరకై పోరాడిన వాళ్ల చేతుల్లోంచి పడిపోయిన జెండాను తమ చేతుల్లోకి తీసుకుని, ఆత్మవిశ్వాసంతో, ధైర్యసాహసాలతో ముందుకుసాగేరు. "సామాజికవిప్లవం చిరస్థాయి యగుగాక!" "కమ్యూన్ చిరస్థాయి యగుగాక!" అనే హెచ్చరికలు ఆకాశాన్ని బద్దలుచేసేయి. తరవాత కొద్దిసంవత్సరాల్లోనే యీ నూతన శ్రామికవర్గ వుద్యమాన్ని, దేశమంతటా వీళ్లు చేస్తూన్న ఆందోళనని ప్రభుత్వం గుర్తించి, అప్పటికింకా జైళ్లలోవున్న కమ్యూనార్డులను వదలి పెట్టవలసివచ్చింది.

కమ్యూన్‌లో పోరాడినవాళ్లని ఒక్క ఫ్రెంచిశ్రామికులే గాక ప్రపంచమంతటావున్న శ్రామికులు గౌరవిస్తూన్నారు. ఎందుచేతనంటే, కేవలమూ స్థానికమైన హక్కులకోసం గాని, సంకుచితమైన జాతీయ ఆదర్శాలకోసం గాని, కమ్యూన్ పోరాడలేదు; మానవసమాజంలోని కష్టజీవులందరికొరకూ, అణచిపెట్టబడి, దోపిడీచేయబడుతూన్న పీడిత ప్రజలందరియొక్క స్వేచ్ఛకొరకు పోరాడింది. ఎక్కడెక్కడ పీడించబడుతూ, పోరాడుతూన్న శ్రామికులున్నారో అక్కడక్కడ, సామాజిక విప్లవంకోసం పోరాడేవాళ్లల్లో అగ్రేసరురాలుగా 'కమ్యూన్' కీర్తించబడుతూ, సానుభూతినందుతూంది. దాని జీవితం—పతనం, ప్రపంచానికే ముఖ్యమైన పారిస్‌నే స్వాధీనంచేసుకుని రెండునెలలుపైగా తమ స్వాధీనంలో వుంచుకున్న కష్టజీవుల ప్రభుత్వము, శ్రామికవర్గంయొక్క బ్రహ్మాండమైన పోరాటం, ఓటమితర్వాత వాళ్లకష్టాలు,— వీటన్నిటినీ

చూసినతర్వాత ప్రపంచం అంతటా కోట్లకొద్దీ కూలీలు మేలుకున్నారు. ఇవన్నీ వాళ్లల్లో నూతనభావాలు కల్గించి, వాళ్లకి సోషలిజంపట్ల గాఢ సానుభూతిని కలిగించినాయి. పారిస్‌లో మ్రోగిన ఫిరంగిమ్రోతలు గాఢ నిద్రలోంచి, వెనకబడిఉన్న శ్రామికుల్ని మేల్కొల్పి, ప్రతిచోటా విప్లవయుత సోషలిస్టుప్రచారోత్సాహాన్ని కలిగించినాయి. ఇందువల్లనే కమ్యూన్ చనిపోలేదని మనం అంటున్నాము. ఇప్పటికీ, మనలో ప్రతి ఒక్కనిలోనూ, అది జీవించే వుంది.

కమ్యూన్ యొక్క ఆదర్శమే సామాజికవిప్లవానికి ఆదర్శం; అదే కష్టజీవుల అర్థికరాజకీయవిముక్తి కొరకై చేసే పోరాటానికీ ఆదర్శం. కమ్యూన్‌యొక్క ఆదర్శమంటేనే ప్రపంచశ్రామికవర్గంయొక్క ఆదర్శమన్నమాట. ఈ అర్థంలోనే పారిస్ కమ్యూన్ మృతజీవి.

రబోఛయా గెజెటా, నం 4, 5, (15) 28-4-1911.

౨

# కమ్యూన్‌వల్ల నేర్చుకోవలసిన పాఠాలు.*

౧౮౭౧ వ సంవత్సరపు ఫ్రెంచివిప్లవంలో జరిగిన హఠాత్సంభవమైన మార్పువల్ల నూతనప్రభుత్వం యేర్పడింది. దానివల్ల ఫ్రాంసులో

* ౧౮ మార్చి ౧౯౦౮ ని జనీవాలో ఒక అంతర్జాతీయసమావేశం జరిగింది. ఆ రోజున మూడు సాంవత్సరికోత్సవాలు జరిగినాయి. మార్క్స్ యొక్క ౨౫ వ వర్ధంత్యుత్సవం; ౧౮౪౮ మార్చి విప్లవంయొక్క ౬౦ వ

పద్దెనిమిది సంవత్సరాలవరకూ నెపోలియన్ పరిపాలన సాగింది. అతని పరిపాలన ఫ్రాంసుదేశానికి ఆర్థికవినాశాన్నే గాకుండా జాతీయావమానాన్ని కూడా తెచ్చిపెట్టింది. వెనుకటి ప్రభుత్వంపైన తిరుగబడిన శ్రామిక వర్గం తనమీద రెండు కర్తవ్యాలను పెట్టుకుంది. ఒకటి జాతీయమైనదీ, రెండోది వర్గసంబంధమైనదీ. జర్మనీల దాడినుండి ఫ్రాంసును రక్షించడం, పెట్టుబడిదారీవిధానాన్నుంచి కూలీలని స్వతంత్రులుగా చేయడం,— అనే యీ రెండు కర్తవ్యాలనీ సమన్వయించడమే. కమ్యూన్ యొక్క స్వతంత్ర ఉపజ్ఞకు లక్షణము.

బూర్జువావర్గం 'జాతీయ సంరక్షక ప్రభుత్వము' ను స్థాపించింది. జాతీయ స్వాతంత్ర్యం కొరకు యీ ప్రభుత్వంక్రింద శ్రామికవర్గం పోరాడ వలసివచ్చింది. కాని, యీ ప్రభుత్వమే జాతిద్రోహకరం అయింది. యథార్థానికి యిది పారిస్ శ్రామికవర్గంతో పోరాడడానికే నిర్ణయించబడిందా అన్నట్లు కనబడింది. 'దేశభక్తి' అనే భ్రమలో బడియున్న శ్రామికులు యీ విషయాన్ని గమనించలేకనే పోయేరు. ఈ 'దేశభక్తి' కి మూలం, పద్దెనిమిదో శతాబ్దంలోని 'మహావిప్లవ' కాలం నాటిది. కమ్యూన్‌లో పని చేసిన సోషలిస్టుల బుద్ధులింకా యీభ్రమలోనే పడివుండినాయి. ఉదాహర ణకు ఒక్క సంగతిని చూడండి. నిజమైన విప్లవకారుడు, సోషలిజాన్ని సమర్థించడంలో ప్రప్రథముడూ అయిన 'బ్లాంక్వి' కూడా 'మన మాతృ దేశం ఆపదలో వుంది!' అనే బూర్జువా హెచ్చరికనే తన పత్రికకి పేరుగా వుంచేడు. ఇంతకన్న వేరు ఋజువు ఎందుకు ?

దేశభక్తి, సోషలిజమ్ అనే పరస్పర విరుద్ధాలైన రెండుబాధ్యతలనూ

---

జన్మోత్సవం; పారిస్ కమ్యూన్ యొక్క 30 వ దినోత్సవం. ఆ సంవత్సరంలో వ్లాదిమిర్ లెనిన్, రష్యన్ సోషల్ డెమాక్రాటిక్ లేబర్ పార్టీ తరఫున కమ్యూన్ యొక్క ప్రాముఖ్యతని గురించి కొనియాడుతూ యిచ్చిన ఉపన్యాసం యిది.

కలగాపులగం చేయడమే ఫ్రెంచి సోషలిస్టుల గొప్ప పొరపాటు. 'జాతీయత' అనే తప్పుటభిప్రాయానికి దాసులుకావద్దని, ౧౮౭౦ సెప్టెంబరులో యింటరేషనల్ యొక్క మేనిఫెస్టోలో మార్క్స్ ఫ్రెంచి శ్రామికవర్గాన్ని హెచ్చరించేడు. మహావిప్లవం జరిగినప్పటినుంచీ అనేక గొప్ప మార్పులు జరిగినాయి; వర్గభేదాలు మరింత సునిశితం అయినాయి. యూరోపుఖండంలోని విప్లవ వ్యతిరేక శక్తులతో పోరాడడానికి పూర్వపు రోజుల్లో విప్లవకారియై జాతిఅంతా యేకమైనా, ప్రస్తుతం శ్రామికవర్గం, తన ప్రయోజనాలకి విరుద్ధమైన ప్రయోజనాలు గల వర్గాలతో యేకీభవించుట సాధ్యము గాదనిన్నీ: జాతీయావమానాలకి బాధ్యత బూర్జువావర్గాన్నే వహించనిమ్మనీ; బూర్జువావర్గంయొక్క అధికారం క్రిందనుండి కష్టజీవుల్ని తప్పించడమే శ్రామికవర్గంయొక్క కర్తవ్యమనీ; మార్క్స్ ఫ్రెంచిశ్రామికవర్గాన్ని హెచ్చరించేడు.

అనుభవంలోకూడా, 'బూర్జువా దేశాభిమానం' తన తత్వాన్ని బయటపెట్టడంలో ఎంతో ఆలస్యం కాలేదు. వెర్సేలిస్ ప్రభుత్వం ప్రష్యాలతో లజ్జాకరమైన సంధిని చేసికొని, తన అసలు పనిని నెరవేర్చడానికి మొదలుపెట్టింది; తనకు భయకారణమైన పారిస్ శ్రామికుల ఆయుధ సేకరణాన్ని నిలుపడానికై ప్రభుత్వం ప్రయత్నించింది. దీనికి సమాధానంగా పారిస్ కూలీలు 'కమ్యూన్' ప్రకటించి, అంతర్యుద్ధాన్ని ప్రారంభించేరు.

బూర్జువావర్గం యే ప్రజాతంత్రహక్కులకై కేవలమూ శుష్కసానుభూతిని మాత్రమే చూపిస్తుందో, అట్లాంటి వాటికోసం పోరాడడానికి సోషలిస్టుశ్రామికవర్గం తనలో యెన్ని చీలికలున్నాకానీ ఏకమత్యంతో కలియగలదని కమ్యూన్ ఋజువుచేస్తూంది. శ్రామికవర్గం ప్రభుత్వాధికారాన్ని వశంచేసుకొని, గందరగోళంగావుండే ప్రత్యేకశాసననిర్మాణం అవసరంలేకుండానే, అతిసులువుగానూ, నిరాడంబరంగానూ సామాజిక విధానాన్ని ప్రజాతంత్రయుతంగాచేసి, ప్రభుత్వోద్యోగుల ప్రాబల్యానికి

స్వస్తిచెప్పి, ప్రభుత్వాన్ని నిర్వహణచేసే ఉద్యోగుల్ని సంపన్నప్రజలే యెన్నుకోవాలనే నియమాన్ని చేసేరు.

కాని రెండు పొరపాట్లు, వీళ్ల ఈ గొప్పవిజయం యొక్క ఫలాన్ని వీళ్లకిందకుండా చేసినాయి. మొదటి పొరపాటు, శ్రామికవర్గం తన కర్తవ్యాన్ని పూర్తిగావించకముందే సగందారిలో ఆగిపోయింది. సామాన్యజాతీయతత్త్వంపైన ఆధారపడిన 'పరమ' న్యాయాన్నే దేశంలో స్థాపించాలని కలలుగంటూ, 'దోపిడీగాళ్లను దోచుకోవడాన్ని' కడకంటా కొనసాగించక త్రోవతప్పేరు. ఒక్క ఉదాహరణ చాలు, దీన్ని రూఢి పరచడానికి: బ్యాంకు మొదలగువాట్లని శ్రామికులు స్వాధీనంచేసుకోనేలేదు. 'న్యాయసమ్మతమైన మారకము' మొదలైన ప్రౌధాన సిద్ధాంతాలు అప్పటి సోషలిస్టుల్లో జాగృతాలైవున్నాయి. ఇంక రెండో పొరపాటు, శ్రామికవర్గంయొక్క అనవసరమైన ఉదారభావం; తన శత్రువుల్ని పూర్తిగా నాశనంచేయడానికి బదులు వాళ్లల్లో నైతికపరివర్తన తీసుకురావాలని యత్నించేరు. అంతర్యుద్ధంలో మిలిటరీచర్యలకిగల ప్రత్యేకప్రాముఖ్యతను శ్రామికులు గుర్తించలేకపోయేరు. పారిస్‌లో రపుకు జయం కలగడంతోనే దృఢదీక్షతో వెర్సేలిస్‌పైకి దాడిసల్పక, వెర్సేలిస్‌ప్రభుత్వము తన సైన్యాలతో పారిస్‌మీదికి వచ్చి, భయావహమైన ఆ 'మే—వారపు' నందరి దారుణ హత్యాకాండలు చేయడానికి అవకాశం యిచ్చేరు.

ఈ లోపాలన్నీ వున్నాకానీ, పారిస్ కమ్యూన్ పందొమ్మిదో శతాబ్దంలోని బ్రహ్మాండమైన శ్రామిక వర్గోద్యమానికి ఉజ్వలమైన ఉదాహరణగావుంది. కమ్యూన్‌యొక్క చారిత్రక ప్రాముఖ్యతను, మార్క్స్ చాల కొనియాడివున్నాడు. వెర్సేలిస్ ద్రోహులగుంపు పారిస్‌శ్రామికులపైకి దాడి సల్పినప్పుడు పారిస్‌శ్రామికులు పోరాడకుండానే తమ ఆయుధాల్ని లోబరచివుంటే, అట్టి బలహీనతవల్ల శ్రామికవర్గోద్యమంలో కలిగియుండే నైతిక పతనమూ, భీరుత్వమూ మిక్కిలి వినాశనకరమైవుండేవి. తమ

ఆయుధఘటనాన్ని సమర్థించుకొంటూ చేసే పోరాటంలో వాళ్లు పొందిన నష్టం ఎంతఎక్కువైనా, పోరాడకుండా లొంగిపోవటంవల్ల ఉద్యమానికి కలిగే నైతికపతనం కన్నను ఎక్కువ నష్టదాయకము కాజాలదు. కమ్యూన్‌లో చేయబడిన త్యాగాలు అసంతమైనవే గాని శ్రామికవర్గ పోరాటాల్లో అది వహిస్తున్న ప్రాముఖ్యతని బట్టి చూస్తే ఆ త్యాగముల సంతగా పాటించనక్కరలేదు. కమ్యూన్ యూరోపుఖండం అంతటా సోషలిస్టుపోరాటాన్ని బయలుదేరతీసింది; అంతర్యుద్ధం యొక్క ప్రాధాన్యతను బహిరంగంగా చాటింది; శ్రామికులలో వున్న "దేశాభిమానం" అనే భ్రమను తొలగించింది: ప్రజలందరికీ జాతీయాశయాలు సామాన్యమే నని బూర్జువాలుచేసే ప్రచారంలో వాళ్లకుగల అమాయికమైన నమ్మకాన్నికూడా పోగ్రోలింది. సోషలిస్టువిప్లవం యొక్క వివిధసమస్యల్ని గూర్చి సరిగా ఆలోచించి, నడచుకోగలిగేటట్లుగా, పారిస్ కమ్యూన్ యూరోపియన్ శ్రామికవర్గాన్ని తయారుచేసింది.

పారిస్ కమ్యూన్ ఒక మరువరాని పాఠాన్ని శ్రామికవర్గానికి గరపింది. కష్టజీవులు దానిని జ్ఞప్తిలో అమలులో పెడతారు. ఇప్పటికప్పుడే రష్యాలోని డిసెంబరు తిరుగుబాటులో యీ పాఠాన్నే ఉపయోగించేరు. *

౧౯౦౫ విప్లవానికి పూర్వం రష్యాలోని రాజకీయపరిస్థితులు యించుమించుగా, ఫ్రాంసులో నెపోలియన్ పరిపాలన నాటి పరిస్థితుల్ని పోలివున్నాయి. రష్యాలోకూడా నిరంకుశప్రభువర్గం యొక్క పరిపాలన దేశాన్ని భయంకరమైన ఆర్థికవినాశానికిన్నీ, జాతీయావమానానికిన్నీ పాల్పరచింది. కాని, ఎంతోకాలానికి గాని విప్లవం బయలుదేరజాలకపోయింది. సాంఘికపరిస్థితులు అభివృద్ధిపొందుతూ, ప్రజాపుద్యమానికి కావలసిన నియమాలను కల్పించిన తర్వాతనే విప్లవం వచ్చింది. విప్లవకాలానికి

* ౧౯౦౫ డిసెంబరులోనే రష్యాలో విప్లవం జరిగింది.

పూర్వం తిరుగుబాటుచేసిన వాళ్లెంత శాంతత్వాన్ని, త్యాగస్ఫూర్తి ప్రదర్శించినా, ప్రభుత్వాన్ని యెన్ని సార్లు యెదిరించినా, ప్రజాసామాన్యం ఉపేక్షాభావాన్నే వహించి వుండడంవల్ల ఫలితం శూన్యం అయింది. ఒక్క సోషల్ డెమోక్రసీయే * యెడతెగని ప్రయత్నాలవల్లా, ప్రణాళికాబద్ధమైన పనివల్లా, ప్రజాసమూహాల్ని ఉద్రిక్తపూరితమైన పోరాటవిధానాల్లో, బ్రహ్మాండమైన ఉద్వేగింపులూ, అంటిపెట్టుకుమూ, ఏపిలో పరిపోషణ చేసింది

సోషల్ డెమోక్రాటిక్ పార్టీ తన నిరంతర ప్రచారం ద్వారా శ్రామికవర్గంలోని విస్తృతవిభాగాల్లో 'జాతీయత' 'దేశాభిమానం' అనే పిచ్చిభ్రమల్ని తొలగించి, తానే పూనుకొని, జారు చక్రవర్తి ౧౯౦౫ అక్టోబరు ౧౭ తేదీని మేనిఫెస్టో ప్రకటించేటట్లు చేయగలిగింది. ఆ స్థితికి వచ్చేటప్పటికి శ్రామికవర్గమే, పోరాటంలో తర్వాతి మెట్టు అయిన సాయుధవిప్లవానికి తయారయింది. 'జాతీయతా' భ్రమలనుంచి విడివడుట చేత శ్రామికులు తమ శక్తుల నన్నింటిని స్వీయవర్గసంఘర్షణలోనికి కేంద్రీకరించుకొన గలిగేరు. అంటే, సైనికుల యొక్క, రైతుల యొక్క ప్రతినిధులతో గూడిన సోవియట్లలోనికి తమ బలాన్ని కేంద్రీకరించ గలిగేరు. ఆశయాల్లోనూ, కర్తవ్యాల్లోనూ యెంత భేదం వున్నా, ౧౭౮౯ లోని ఫ్రెంచివిప్లవంలో వలెనే ౧౯౦౫ లోని రష్యావిప్లవంలోనూ, పారిస్ శ్రామికుల వలె రష్యా శ్రామికులు, ఒకే విధమైన పోరాట పద్ధతుల్ని,— అనగా అంతర్యుద్ధపద్ధతిని అవలంబించేరు. అదివరలో పారిస్ కమ్యూన్ నుంచి గ్రహించిన పాఠాన్ని మనసులో పెట్టుకొని వుంటూ, శ్రామికవర్గం, శాంతియుతపద్ధతులకు విప్లవపోరాటంలో గల స్థానాన్నికూడ తృణీకరించరాదని గుర్తించింది; దైనందినప్రయోజనాలను

* ౧౯౦౫ నాటికింకా బోల్షివిక్‌లు సోషల్ డెమోక్రాటిక్ పార్టీలోనే వున్నారు. ఆ నాటికింకా 'సోషల్ డెమోక్రసీ' అనే మాట నీచత్వానికీ, ద్రోహానికీ సూచకం కాలేదు.

సాధించడంలోనూ, విప్లవాలకై తయారవడంలోనూ, శాంతియుత పద్ధతుల ప్రాముఖ్యత, అవసరమూ చాలా వుంటుంది. కాని, వర్గసంఘర్షణ ఒక ప్రత్యేకదశకు వచ్చేటప్పటికి సాయుధపోరాటంగానూ, అంతర్యుద్ధంగానూ మారక తప్పదని కూడా శ్రామికులు జ్ఞాపకం వుంచుకోవాలి; బహిరంగ యుద్ధంలో శత్రువుల్ని నిర్దాక్షిణ్యంగా నాశనం చేసివెయ్యాలనే కర్తవ్యాన్ని శ్రామికవర్గం గుర్తించవలసిన సమయం వచ్చిపడుతుంది. ఈ విషయాన్ని 'కమ్యూన్' ద్వారా బహిరంగపరచి, ఫ్రెంచిశ్రామికవర్గం మార్గదర్శి అయింది. దీనినే తిరిగి 1905 డిసెంబరు విప్లవంలో రష్యన్ శ్రామికులు బలపరిచేరు.

కష్టజీవులు తీసుకువచ్చిన బ్రహ్మాండమైన యీ రెండు తిరుగుబాటులూ అణచివేయబడినా త్వరలోనే తిరిగి యింకో గొప్ప తిరుగుబాటు బయలుదేరి తీరుతుంది. అందులో శ్రామికవర్గంయొక్క శత్రువులు నిర్వీర్యులై పోతారు; సోషలిస్టు శ్రామికవర్గం తప్పక జయించి తీరుతుంది.

జగ్రానిచ్నయా గజెటా, నెం 2, 23-3-1908.

# 3

# 'ఎల్. కూగల్‌మాన్ కు కారల్ మార్క్స్ వ్రాసిన లేఖలు' యొక్క రష్యన్ కూర్పు పీఠిక నుండి ఉద్ధృతము.

కమ్యూన్ యొక్క ఉత్కృష్టతను అంచనావేయడమే, మార్క్స్ కూగల్‌మాన్‌కు వ్రాసిన జాబుల్లోని అమూల్యవిషయం. రష్యన్ సోషల్ డెమోక్రాటులలోని మితవాదుల మాటలతో పోల్చిచూస్తే, మార్క్స్ అంచనా యొక్క ప్రాముఖ్యత మరింత విస్పష్టంగా కనిపిస్తుంది. ౧౯౦౫ డిసెంబరు విప్లవం తర్వాత ప్లెఖనోవ్, పిరికిపందలాగ, "మరి సాయుధ విప్లవాన్ని చేపట్టియుండకుండా వుండవలసినది!" అన్నాడు. ఇల్లాగ చెపుతూ కూడా ప్లెఖనోవ్, తనని మార్క్స్‌తో పోల్చుకోడానికి సిగ్గుపడలేదు. ౧౮౭౦ లో మార్క్స్ కూడా తిరుగుబాటును నిలపడానికే యత్నించేడని, ప్లెఖనోవ్ వాదన.

ఔను, విప్లవాన్ని నిలపడానికే మార్క్స్ యత్నించేరు. కాని యీ పోలికను తీసుకురావడంవల్ల ప్లెఖనోవ్, తనకూ మార్క్స్‌కూ మధ్య యెల్లాంటి అగాధమైన భేదాన్ని బయటపెట్టేడో చూడండి!

రష్యావిప్లవం విజృంభించడానికి ఒక నెలరోజులు ముందే, ౧౯౦౫ నవంబరులో ప్లెఖనోవ్ తిరుగుబాటు చేయవద్దని శ్రామికుల్ని

హెచ్చరించకపోవడమే గాకుండా, ఆయుధప్రయోగంలో తర్ఫీదు పొందడం, వాటిని సేకరించడం, వీటి ఆవశ్యకత చాలా వుందని నొక్కిచెప్పేడు. కాని, తరువాతి ఒకి నెలరోజుల్లో, విప్లవం చెలరేగినప్పుడు ప్లెఖనోవ్, ఆ విప్లవస్వభావాన్ని, సాధారణ ఉద్యమపరిణామంలో దాని స్థానాన్ని, అంతకుముందు అవలంబించిన పోరాటవిధానాలతో దీనికి గల విశేష సంబంధాన్నీ వివరించడానికి కొంచెమైనా ప్రయత్నించక, ఏదో తప్పుచేసి పశ్చాత్తాపపడుతూన్న బుద్ధిమంతుడులాగ "మీరు సాయుధతిరుగుబాటు చేయకుండా వుండవలసింది!" అంటూ ఘోష పెట్టేడు.

"కమ్యూన్ ప్రారంభించడానికి ఆరునెలలు ముందు ౧౮౭౦ సెప్టెంబరులోనే మార్క్సు ఫ్రెంచికార్మికులను హెచ్చరించడం: తిరుగుబాటుచేయడం పిచ్చి యని అంటూ ఇంటర్‌నేషనల్ యొక్క సుప్రసిద్ధమైన మేనిఫెస్టోలో వ్రాసేడు. ౧౭౯౨ వ సంవత్సరంలోకి పారిస్ శ్రామికుల్లో విప్లవోత్సాహాన్ని తిరిగి రేకెత్తించుట సాధ్యమగునని చెప్పేవాళ్ల వాదన జాతీయోద్రేకపూరితమైన భ్రమమాత్రమే యని మార్క్సు ముందుగానే బయటపెట్టేడు. "మీరు సాయుధతిరుగుబాటును చేపట్టకుండా వుండవలసింది" అంటూ పని జరిగిపోయిన తర్వాత గాక, చాలా నెలలు ముందే మార్క్సు శ్రామికుల్ని హెచ్చరించగలిగేడు.

౧౮౭౦ సెప్టెంబరు ప్రకటనలో నిరుపయోగమని తాను చెప్పిన యీ తిరుగుబాటుయత్నము ౧౮౭౧ మార్చిలో యథార్థరూపాన్ని దాల్చినప్పుడు మార్క్సు వైఖరి యెట్లా వుంది? (డిసెంబరు సంఘటనల్ని ప్లెఖనోవ్ అవకాశంగా తీసికొన్నట్లే) ఈ గొప్పసంఘటనను అవకాశంగా తీసికొని మార్క్సు, కమ్యూన్ కు నాయకత్వం వహించిన తన ప్రతికక్షులైన ప్రౌధనిస్టులు, బ్లాంక్విస్టులు,— వీళ్ల మీద దెబ్బతీయడానికి ప్రయత్నించేడా? బడిపంతులులాగ బులుపు చూపుతూ, "నేను చెప్పలేదూ! జాగ్రతగా వుండండి అని ఘొరపెట్టురుంటూనే వున్నా। మీ విప్లవ

ప్రలాపాలకీ, బడాయికీ, మెగురువాటుకీ, ఫలితం యెట్లా వుందో తెలిసిందా" అంటూ చెప్పిపోదవ చూసేడా? ప్లెఖనోవ్, డిసెంబరు విప్లవంలో పోరాడిన వాళ్లని నిరుత్సాహపరచినట్లుగా "మీరు సాయుధతిరుగుబాటు లేవతీయకుండా వుండవలసింది." అంటూ పెద్ద పండితుడులాగ సొగసుగా ధర్మోపన్యాసం యిచ్చేడా?

లేదు! ౧౮౭౧ యేప్రిలు ౧౨ తేదీని మార్క్సు, కూగల్‌మాన్‌కు ఉత్సాహపూరితమైన జాబును వ్రాసేడు. చదువుకున్న ప్రతి రష్యన్ కూలీ యొక్క, ప్రతి రష్యన్ సోషల్ డెమోక్రాట్ యొక్క యింట్లో యీ జాబు ప్రతి యొకటి ముఖ్యంగా వుండాలని నా ఉద్దేశ్యం.

౧౮౭౦ సెప్టెంబరులో, తిరుగుబాటు చేయడం పిచ్చి అని చెప్పినా, ౧౮౭౧ యేప్రిలులో తిరుగుబాటుకు ప్రజాసమూహాలు చూపిన ఆదరణని చూసిన తర్వాత తన ధోరణిని మార్చుకున్నాడు. అంతర్జాతీయవిప్లవోద్యమంలో ఒక అడుగు ముందుకువేసిన ఆ సుప్రసిద్ధ సంఘటనలో చాల ఆసక్తిని ప్రదర్శిస్తూ, తాను కూడ ఆ పోరాటంలోని వాడే అయినట్లుగా మార్క్సు ప్రవర్తించేడు.

'అధికారివర్గాన్నీ, సైన్యాల్నీ ఒకరి చేతుల్లోంచి మరొకరి చేతుల్లోకి మార్చడానికి గాక, వాటిని నాశనం చేయడానికే యీ ప్రయత్నం' అని మార్క్సు వ్రాసేడు. ప్రౌఢనిస్టుల చేతా, బ్లాంక్విస్టుల చేతా నడిపించబడుతూన్న పారిస్ కూలీలకు, మార్క్సు ఆశీర్వాదగీతాల్ని కూడా పాడేడు. "ఎట్లాంటి మార్దవము, ఎట్లాంటి చారిత్రాత్మకమైన కార్యోత్సాహము, ఎట్లాంటి స్వార్థత్యాగము, ఈ పారిస్ ప్రజల్లో కనిపిస్తూంది!" అంటూ మార్క్సు వ్రాసేడు . "వీళ్ల శౌర్యానికి సరిపోలేది చరిత్రలో యెక్కడా లేనేలేదు!" (పేజీ ౭౫).

ప్రజాసమూహాల యొక్క చరిత్రాత్మకమైన కార్యోత్సాహానికే, మార్క్సు, మిగిలిన అన్నిటికంటే అధికప్రాధాన్యత యిచ్చేరు..........

తాను కూడా ప్రజాసమూహాల యొక్క పోరాటంలో పాల్గొంటూన్నట్లే భావిస్తూ, తనకు సహజమయిన పట్టుదలతోనూ, ఉద్రేకంతోనూ ఆతడు "వెర్రి ధైర్యం" తో "స్వర్గాన్ని కూడా ముట్టడించ సంసిద్ధులుగా నున్న" పారిస్ ప్రజల చర్యల్ని పరిశీలించేడు.

౧౯౦౫, ౧౯౦౭ సంవత్సరాల్లో రష్యాలోని 'విప్లవోత్సాహాన్ని' కొంచెపరుస్తూండడమే పనిగాగల నేటి 'యథార్థ' మార్క్సిస్టులు అప్పుడే వుంటే మార్క్స్ నెంతగా ఎగతాళిచేసి వుండేవాళ్లో గదా! "స్వర్గాన్ని కూడా ముట్టడించే యత్నానికి" భౌతికవాది, అధిశాస్త్రవేత్త, భ్రమాజనిత సిద్ధాంతాలకు పరమశత్రువు అయిన మార్క్స్ యిచ్చిన గౌరవాన్ని చూస్తే యీ వ్యక్తులు ఆతనిని యెట్లా వెక్కిరించివుండే వాళ్లో గదా!

కాని, విప్లవంపోరాటంలోని ఉన్నతరూపాన్ని గురించి చర్చించ డానికే భయపడే యీ వృథావాగాడంబరులకున్న తెలివితేటలు మార్క్స్‌కు లేవు. మరి! అతడు యీ క్రింది క్లిష్టసమస్యల్ని గురించి ఆలోచించ నారంభించేడు: "కాపురలమీదే వుండడం మంచిదా? లేక శత్రువుల్ని యెదిరించడానికి సమయం వచ్చిందా?" అంటూ, లండన్ నగరానికి బయటనే యేదో మహాయుద్ధసన్నాహం జరుగుతూన్నట్లుగా (మార్క్స్. లండన్‌లో వుండేవాడు) ప్రశ్నించు కున్నాడు. వెంటనే యీ ప్రశ్నకు సమాధానంగా, ఎదుర్కోవాలి, తప్పకుండా ఎదిరించాలి. "వాళ్లు వెంటనే వెర్సేలిస్ పైకి దండెత్తి యుండవలసింది "

'మే నెల' లో జరిగిన భయంకరరక్తపాతానికి కొద్ది వారాలు ముందుగానే, ౧౮౭౧ యేప్రియు నెలలో మార్క్స్ దీనిని వ్రాసేడు

'స్వర్గాన్ని ముట్టడించే' 'పిచ్చి' పనిని తలపెట్టిన తిరుగుబాటు దారులతో, "మీరు వెంటనే వెర్సేలిస్ పైకి దాడివెడలి యుండవలసింది" అని మార్క్స్ చెప్పేడు.

"మీరు సాయుధతిరుగుబాటు చేయకుండా వుండవలసింది. మీరు

సాధించిన స్వాతంత్ర్యాన్ని అపహరించడానికి శత్రువులు చేస్తున్న ప్రయత్నాల్ని బలప్రయోగపూర్వకంగా యెదిరించకుండా వుండవలసింది.'' అన్నాడు ప్లెఖనోవ్, ౧౯౦౫ డిసెంబరులో.

"సెంట్రలు కమిటీ తన అధికారాన్ని తొందరపడి ముందుగానే వదలిపెట్టడం, రెండో పొరపాటు," అంటూ మార్క్స్ తన విమర్శనను కొనసాగించేడు. (ఇక్కడ, మిలిటరీ నాయకత్వం వహిస్తూన్న నేషనల్ గార్డు యొక్క సెంట్రలు కమిటీ యని మార్క్స్ అభిప్రాయం.)

తగిన యేర్పాట్లు జరగక ముందే తిరుగుబాటు బయలుదేరునేమో యని మార్క్స్ ముందుగానే ఉద్యమనాయకుల్ని హెచ్చరించేడు. ప్లాంక్వి. ప్రౌధన్ల సిద్ధాంతాలలో పొరబాట్లు యెన్ని వున్నా కానీ మొత్తం ఉద్యమాన్నే ఉన్నతదశకు తీసుకొనిపోతూన్న ప్రజాసమూహాల పోరాటంలో మార్క్స్, సహాయకుడుగానూ, అనుషంగిక సలహాదారుడుగానూ వున్నాడు. "స్వర్గాన్ని కూడా ముట్టడించే" శ్రామికవర్గం యొక్క ప్రయత్నాలలో అతనికున్న సంబంధం యిదే.

"ఏమైనా జరిగినా, ప్రస్తుతపు పారిస్ తిరుగుబాటు, వెనుకటి సమాజం యొక్క నీచశునకాలకీ, తోడేళ్ళకీ, పందులకీ లోబడిపోయి. ఓడిపోయినా సరే, ౧౮౪౮ జూన్ తిరుగుబాటు తర్వాతనుంచీ మనపార్టీ చేసిన ఘనకార్యాల్లో యిదే ముఖ్యమైనదిగా వుంటుంది." అంటూ మార్క్స్ వ్రాసేడు.

కమ్యూన్ యొక్క పొరపాట్లలో దేన్నీ కూడా, మార్క్స్ శ్రామికవర్గానికి తెలుపకుండా దాచలేదు. 'స్వర్గము' కోసం చేసే పోరాటంలో నేటికీ మార్గదర్శిగా వుండదగినట్టివన్నీ, బూర్జువా అతివాద, ఉదారవాద కుసవాలకి భయావహమైనట్టివన్నీ, ఒక మహాగ్రంథాన్ని యీ సాహస కార్యానికి మార్క్స్ అంకితమిచ్చేడు.

ప్లెఖనోవ్ కూడా ఒక గ్రంథాన్ని వ్రాసి, ౧౯౦౫ డిసెంబరు

తిరుగుబాటును అంకితం ఇచ్చేము. కాని, అది 'కేదెట్స్'కు* పారాయణ గ్రంథమైనది.

తిరుగుబాటుయొక్క జయంలో విరాసను వ్యక్తపరిచి, అద్భుత కార్యాలు చేయ యత్నించవాని. యథార్థపరిస్థితులను బట్టి సరియైనో దానికే గల కారణాలన్నీ చెప్తుంటూ, కుగల్‌మాన్‌కు జవాబు వ్రాసేడు. ౧౮౪౮ జూన్ ౧౩ వ తేదీ నాడు పారిస్‌లో జరిగిన శాంతియుతమైన ప్రదర్శనాలతో, తిరుగుబాటు చేసిన కమ్యూనార్డ్‌లను పోల్చి, చూపించేరు.

ఇందుకు వెంటనే తగురీతిని మార్క్స్ సమాధానమిస్తూ, కూగల్‌మాన్‌ను చీవాట్లు పెట్టేడు. (౧౮౭౧ ఏప్రిలు ౧౭)

"పరిస్థితులన్నీ మనకనుకూలంగా ఉన్నప్పుడే పోరాటాన్ని కొనసాగించకలిగేటట్లైతే, ప్రపంచ చరిత్రనిర్మాణంలో కష్టమేమీ వుండదనే వుండదు," అని మార్క్స్ వ్రాసేడు.

౧౮౭౦ సెప్టెంబరులో తిరుగుబాటు తలపెట్టుట పిచ్చి యని మార్క్స్ చెప్పేడు. కాని, ఎప్పుడైతే ఒకసారి ప్రజాసమూహాలు తిరుగుబాటు చేసినాయో అప్పుడు మార్క్స్ వాళ్లతో ముందుకు పోవడానికే నిశ్చయించేడు. పోరాటంలో వుంటూ నూతనవిషయాల్ని తెలుసుకొనగోరేడే కాని, వాళ్లకు ఏవో ఉపదేశాలు చేయయత్నించలేదు. రాబోయే మంచిచెడుగుల్ని ముందుగానే నిశ్చయించడం దుష్పాండిత్యమూ, దుర్గుణమూ అని మార్క్స్ ఉద్దేశ్యం. ప్రపంచచరిత్రనిర్మాణభారాన్ని శ్రామికవర్గం తన మీద వేసుకొని, మిత్వంతోనూ, స్వార్థత్యాగంతోనూ తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూంది. శ్రామికవర్గంయొక్క యీ ప్రయత్నాలకే మార్క్స్ ప్రథమగణ్యత నిచ్చేడు. చరిత్రనిర్మాణబాధ్యత గలవాళ్ల దృష్టితోనే మార్క్స్ మానవచరిత్రను అవలోకించేడు. ముందుగానే

---

* కేదెట్స్ — కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రాట్ [illegible]

పరిస్థితుల్ని అమోఘంగా నిర్ణయించి చెప్పగలననేవాళ్ళ దృష్టితో గాని. 'ఇది అట్లా జరుగుతుందని ముందుగానే అనుకున్నాను,' అనో, లేక. 'మన సాయుధవిప్లవం లేవదీయకుండా ఉండవలసింది.' అనో శ్రీరంగ నీతులూ, శుష్కప్రియాలూ చెప్పే మధ్యతరగతి బుద్ధిమంతులచేత గాని, మార్క్సు చరిత్రను చూడలేదు.

ఎట్టి ఆశాలేని పరిస్థితుల్లో కూడా, విప్లవాల పోరాటాలకు తలవొగ్గి, ఓడిపోవడానికీ, ప్రజాసమూహాలు ఎంతో తెగువతో పోరాడి ఓడిపోవడానికీ ఉపయోగం ఉంటుందనే విషయాన్ని మార్క్సు చక్కగా గ్రహించేడు.

మన ప్రస్తుతపు నామమాత్రపు మార్క్సిస్టులకు, మార్క్సు గొప్ప మేధావి యని చెంపలు కొట్టుకోవడంతోనే సంతృప్తి; అంతటితోనే వాళ్ళకు సంతోషము. పూర్వపు చరిత్రయొక్క సిద్ధాంతాన్ని మాత్రమే చెపుతూ భవిష్యత్తును మనమే నిర్మాణము చేసుకోగలమనే ప్రయత్నం చేయకుండావుండే యిట్లాంటి వాళ్ళకు పై విషయం అగ్రాహ్యము; అంతేగాక సిద్ధాంతములో కూడా వాళ్ళకి దీని మాటేం కాని ప్లెఖనోవ్ కూడా 1905 విప్లవం తర్వాత, తన ఉపదేశాన్ని చేసినప్పుడు యీ విషయాన్ని ఎత్తుకోనే లేదు.

కాని, మార్క్సు యీ విషయాన్నే ముందుగా యెత్తుకొన్నాడు. 1870 సెప్టెంబరులోనే, తిరుగుబాటుచేయడం కేవలం పిచ్చి యని చెప్పితి ననే విషయం పూర్తిగా స్మృతియందుంచుకొనే మార్క్సు, యీ సమస్యని ముందుగా యెత్తుకున్నాడు

వెర్సైల్స్‌లోని బూర్జువాశునకాలు, పారిస్ ప్రజలను, "పోరాడండి; లేదా యుద్ధం చేయకుండానే లొంగిపొండి," అని సవాలు చేసేరు. ప్రజలు యీ రెండోపద్ధతికే ఒడంబడియున్నట్లైతే మన దృష్టానికి మేలవుండేది కాదు. ఎందరో ఉద్యమనాయకులు పోయినందువల్ల గలిగే నష్టముకంటె, పోరాడకుండా లొంగిపోవడం వల్ల శ్రామికవర్గంలో వ్యాపించే నైతికపతనంవల్ల కలుగు నష్టం ఎన్నోరెట్లు హెచ్చుగా వుండేది.

శ్రామికవర్గానికి అర్హమైన రాజనీతికౌశల్యాన్ని గురించి మార్క్సు కూగల్‌మాన్‌కు వ్రాసిన జాబులలో వ్రాసేడు. దీనిని గురించిన మార్క్సు ఉపదేశాన్ని పూర్తిగా వివరించే ప్రయత్నాన్ని ఇక ముగింపు చేస్తాను.

# ౪

# 'రాజ్యాంగయంత్రము - విప్లవము' సంక్షిప్త ఉద్ధృతము.

## 1871 లోని పారిస్‌కమ్యూన్ యొక్క అనుభవము : మార్క్సు వివరణ.

### 1. కమ్యూనార్డుల యత్నాలలో శౌర్యం ఎందులో వుంది ?

౧౮౭౦ సంవత్సరం ఆకురు రాలేకాలంలో, కమ్యూన్ యేర్పడ దానికి కొన్నినెలలు ముందుగానే, ప్రభుత్వాన్ని కూలద్రోసే యత్నం నిరాశచే చేసే పిచ్చిపని యని మార్క్సు, పారిస్ శ్రామికుల్ని హెచ్చరించిన విషయం అందరికీ తెలిసినదే. కాని, ౧౮౭౧ మార్చినెలలో జయాప జయాల్ని నిర్ణయించే కడపటిపోరాటం కూలీలమీద విరుచుకుపడింది. కూలీలు పోరాడడానికే నిశ్చయించేరు. తిరుగుబాటు చెలరేగింది. ఎన్నో దుశ్శకునాలు కనిపిస్తూన్నా కానీ మార్క్సు యీ శ్రామికవిప్లవానికి మహోత్సాహంతో స్వాగతం యిచ్చేడు. 'అసమయంలో' బయలుదేరిన

ఉద్యమం అంటూ విమర్శించి, దుష్పాండిత్యగర్వాన్ని ప్రదర్శిస్తూ, మార్క్స్ పెడసరంగా వుండలేదు. మార్క్సిజమ్‌ను విడిచిపెట్టి, ద్రోహిగా మారిపోయి, అపకీర్తిపాలైన ప్లెఖనోవ్, ౧౯౦౫ నవంబరు నెలలో రష్యా కూలీ-రైతుల పోరాటాన్ని ప్రోత్సహిస్తూ మాట్లాడి తరువాత డిసెంబరులో విప్లవం నిజంగా చెలరేగడంతోనే, ఉదారవాదుల మాదిరిగా భయపడిపోయి, సర్దిమాట్చుకుని "వారు ఆయుధాలు పట్టుకొని తిరగబడకుండా వుండవలసింది," అన్నాడు. మార్క్స్ యిలా ప్రవర్తించలేదు.

'స్వర్గాన్ని కూడా ముట్టడించుతున్న' కమ్యూనార్డుల పరాక్రమానికి యెంతో మెచ్చుకోవడమేగాక, మార్క్స్, తిరుగుబాటులో ఓడిపోయిన ఆ ప్రజావిప్లవోద్యమంలో చరిత్రాత్మకమైన ఘనయత్నం వుందని గుర్తించి శ్లాఘించేడు. పందలకొద్దీ కార్యప్రణాళికలు, చర్చలు, వీటన్నింటికంటె యెన్నో రెట్లు అధికప్రాముఖ్యత వహించేటట్టి అభివృద్ధిని ప్రపంచ కార్మికవిప్లవానికి కలుగజేసి, అనుభవపూర్వకమైన ఒకముందడుగును నిర్మించిందని కూడా అతడు అభిప్రాయపడ్డాడు. ఈ నూతనయత్నాన్ని సూక్ష్మంగా వివరించి, యెత్తుగడల విషయమై దీనినుండి కొన్నిగుణపాఠాల్ని నేర్చి, ఈ కమ్యూన్ యొక్క అనుభవాన్నిబట్టి తనసిద్ధాంతాన్ని పరిశీలించి, మార్క్స్ తనపైని నిలుపుకొన్న చారిత్రకకర్తవ్యాన్ని నెరవేర్చేడు.

కమ్యూనిస్టు మేనిఫెస్టోలో ఒకేఒక 'సవరణ' మాత్రమే చేయవలసి వుందని మార్క్స్ నిర్ణయించేడు. పారిస్ కమ్యూన్ యొక్క విప్లవానుభవముల నాధారంచేసికొనే, మార్క్స్. యీసవరణను చేసేడు.

౧౮౭౨ జూన్ ౨౪ వ తేదీని మార్క్స్, ఏంగెల్సులు, కమ్యూనిస్టు మేనిఫెస్టో యొక్క నూతన జర్మన్‌ముద్రణకు 'అవతారిక' ను వ్రాసేరు. వారు యిద్దరూ కలిసి వ్రాసినవాటిలో యిదే కడపటిది. కమ్యూనిస్టు మేనిఫెస్టో యొక్క కార్యక్రమం "యిప్పుడు కొన్నిచోట్ల కాలాను

ముఖ్యంగా లేద" ని ఆ అవతారికలో వాళ్లువ్రాసేరు.

"........అందులోనూ ప్రత్యేకంగా, 'కార్మికవర్గము, తయారుగావున్న రాజ్యాంగయంత్రాన్ని స్వాధీనంచేసికొని, తన వర్గం యొక్క ప్రయోజనాలకై దాన్ని నడిపించుకోవడం సాధ్యముగాదని యే' - కమ్యూన్ ఋజువుచేసింది," అని మార్క్సు, యేంగిల్సులు వ్రాసేరు.

పై పేరాలో " " గుర్తులమధ్య వున్నభాగాన్ని మార్క్సు వ్రాసిన 'ఫ్రాంసులోని అంతర్యుద్ధం' అనేగ్రంథాన్నుంచి ఎత్తి తీసుకున్నారు.

ఈ విధంగా పారిస్ కమ్యూన్ వల్ల నేర్చిన యీ గుణపాఠాన్ని మార్క్సు, యేంగిల్సులు మిక్కిలి ఆవశ్యకమైనదని తలచుటచేతనే కమ్యూనిస్టు మేనిఫెస్టోలో దీనినొకముఖ్యమైన సవరణగా ప్రవేశపెట్టేరు.

ఈ ముఖ్యమైన సవరణకే లొంగుబాటుదారులు వెడర్థాలుచెప్పడం ముఖ్యంగా గుర్తించదగివుంది. కమ్యూనిస్టు మేనిఫెస్టో చదివేవాళ్లల్లో నూటికి తొంభైతొమ్మిదిమందికి గాకపోయినా తొంభైమందికైనా దీని అర్థం తెలిసివుండదనే చెప్పాలి. ఈ వెడర్థాల్ని గురించి ముందు యింకా విపులంగా, వీటిని గురించిన ప్రత్యేకప్రకరణంలో పరిశీలించుదము.

అధికారాన్ని వెంటనే లాక్కోవాలని గాక క్రమంగా మార్పు జెందాలని మార్క్సు చెప్పేడనుటే పైనయివ్వబడిన మార్క్సు సిద్ధాంతానికి నీచమైన వెడర్థము. ఇప్పుడు అమల్లోవున్నదిచేయని చెపులే ప్రస్తుతం చాలును.

యథార్థంచెప్పాలంటే మార్క్సుచెప్పినది కేవలమూ దీనికి వ్యతిరేకమైనదే. కూలీవర్గాలు 'ప్రస్తుతపు రాజ్యాంగయంత్రాన్ని' బద్దలుకొట్టెయ్యాలని, నాశనంచేయాలనేగాని, దానిని స్వాధీనంచేసికోడానికి ప్రయత్నం చేస్తూవుండాలని గాదు మార్క్సు అభిప్రాయం.

౧౮౭౧ ఏప్రిల్ ౧౨ వ తేదీని, అంటే కమ్యూన్ ప్రారంభమైన రోజుల్లోనే మార్క్సు కూగల్‌మాన్‌కు యిట్లా వ్రాసేడు.

" ... 'బ్రూమైర్ పద్దెనిమిదోతేదీ' (*Eigtheenth Brumaire*) అనే నా గ్రంధంయొక్క చివరిప్రకరణాన్ని చూస్తే, ఫ్రెంచివిప్లవం యొక్క అనంతరకర్తవ్యం యేదని చెప్పేనో తెలుస్తుంది. ఇదివరదాకా చేస్తూన్నట్లు అధికారవర్గాన్నీ, సైనిక సంస్థల్నీ ఒకరిచేతుల్లోనుంచి యింకొకరిచేతుల్లోకి మార్చడమే విప్లవానికి కర్తవ్యంకాదు. దానికర్తవ్యం, యీ రాజ్యాంగ యంత్రాన్ని బద్దలుకొట్టెయ్యడమే (మార్క్సు *Zerbrechen* అనే మాటను వుపయోగించేడు); అంతేగాక, యూరోపుఖండంమీద యే నిజమైన ప్రజావిప్లవానికైనా సరే యిదే ప్రథమకర్తవ్యం. ధైర్యవంతులైన మన పారిస్ కామ్రేడుల ప్రయత్నాలలోని రహస్యం యిదే." (*Neue Zeit 10. i, 1901, 1902,* పేజీ ౭౦౯).

విప్లవసమయాల్లో 'రాజ్యాంగయంత్రం' విషయమై శ్రామికవర్గం యొక్క కర్తవ్యాన్ని గురించి మార్క్సిజమ్ చెప్పే ప్రధానపాఠం యీ మాటల్లోనే, అనగా, 'రాజ్యాంగయంత్రంయొక్క అధికారివర్గ, సైనిక బలాన్ని నాశనంచేయడం' అనే యీ మాటల్లోనే క్లుప్తంగా యిమిడివుంది. ప్రస్తుతపు కౌట్స్కీ అనుయాయులు యీ పాఠాన్ని మరచిపోవడమే గాకుండా, దీనికి పెడర్థాలుకూడా తీస్తూన్నారు। వాళ్లు మార్క్సిజానికి చెప్పే అర్థం యిట్లాంటిదే।

పైన ఉదాహరించిన మార్క్సు వాక్యాల్లో రెండుముఖ్యవిషయాల్ని గుర్తుంచుకోవడం అవసరం. మొదటిది: ఒక్కయూరోపుఖండం మీదికే తన యీ సిద్ధాంతం చెందుతుందని మార్క్సు చెప్పేడు. ౧౮౭౧ లో యిట్లా చెప్పడం సహజమే. ఇంగ్లాండుదేశం అప్పటికింకా స్వచ్ఛమైన పెట్టుబడిదారీదేశంగా వుండినదేగాని తగినంతగా అభివృద్ధిచెందిన సైనిక,

అధికారివర్గ సంస్థలతోగూడియుండనే లేదు. అందుచేతనే మార్క్సు, యింగ్లాండును తన సూత్రంలో మినహాయించేరు. "అప్పట్లోవున్న రాజ్యాంగయంత్రాన్ని" నాశనంచేయాలనే మొట్టమొదటిషరతు లేకుండానైనా యింగ్లాండులో, విప్లవం,— ప్రజావిప్లవమైనాసరే,— సాధ్యము అవుతుందని మార్క్సు చెప్పేరు.

ఈ రోజున, ౧౯౧౭ లో, మొట్టమొదటి బ్రహ్మాండమైన సామ్రాజ్యవాదయుద్ధకాలంలో మార్క్సుయొక్క యీ సూత్రం నిలువబడ నేరదు. ప్రపంచం అంతట్లోకీ, ఆంగ్లో–శాక్సన్ 'స్వాతంత్ర్యానికి' ఉదాహరణలుగా కడపటివరకూ మిగిలిన యింగ్లాండు, అమెరికాలు కూడా నేడు, యూరోపులో సర్వసాధారణమైన అధికారివర్గ, సైనికసంస్థల ప్రాబల్యమనే బురదలోనే దిగబడిపోయినాయి; 'స్వాతంత్ర్యం' అంటే,— ప్రతీదానినీ తమకు లోపుచేసివేస్తూ, తమక్రిందనున్న ప్రతీదానినీ అణిచివేసి, నాశనంచేసివేస్తూవుండే అధికారివర్గ, సైనికసంస్థలు లేకపోవడమనే అర్థం. అందుచేత, నేడు, యింగ్లాండులోనూ, అమెరికాలోనూకూడా, నిజమైన ప్రతిప్రజావిప్లవానికీ 'రాజ్యాంగయంత్రం యొక్క ప్రస్తుతసాధనాలను' బ్రద్దలుకొట్టెయ్యడం, నాశనంచేయడం, ప్రధమకర్తవ్యం అయివుంది. (ఇంగ్లాండు, అమెరికాదేశాల రాజ్యాంగయంత్రాల్లో యీ సైనిక, అధికారివర్గసంస్థల ప్రాబల్యము, ౧౯౧౪—౧౭ సంవత్సరాల మధ్యకాలంలో యితరయూరోపియన్ సామ్రాజ్యవాదదేశాలలోనికి వలెనే సంపూర్ణత్వాన్ని చెందేయి).

రెండోది: రాజ్యాంగయంత్రం యొక్క అధికారివర్గ, సైనికసంస్థల్ని నాశనంచేయడమే నిజమైన ప్రతిప్రజా విప్లవానికీ మొదటికర్తవ్యము అంటూ మార్క్సుచెప్పిన గంభీరవాక్యానికి ప్రత్యేకశ్రద్ధ చూపవలసి వుంటుంది. 'ప్రజా' విప్లవం అనేమాటను మార్క్సునోటవినడం ఆశ్చర్యకరంగానే వుండవచ్చును. మార్క్సిస్టులుగా పరిగణింపబడాలని కోరే

వాళ్లూ, 'స్ట్రూవీ' అనుయాయులూ అయిన రష్యన్ ప్లెఖనోవిస్టులూ, మెన్షివిక్‌లూ యీ 'ప్రజావిప్లవం' అనే మాట కేవలమూ పొరపాటువల్ల వ్రాయబడినదే నని చెప్పవచ్చును. వాళ్లు, మార్క్సిజాన్ని యిట్లాంటి దౌర్భాగ్యపు 'ఉదారవాద' స్థితికి దెచ్చేరు; వాళ్ళదృష్టిలో బూర్జువావిప్లవం, శ్రామికవిప్లవం, అని రెండే తప్ప వేరేతరహా లేనేలేదు; యీ భేదాన్నైనా వాళ్ళు కేవలమూ నిర్జీవంగానే గ్రహించేరు.

ఇరువదో శతాబ్దంలోని విప్లవాన్ని ఉదాహరణగా తీసికొంటే, పోర్చుగీస్, టర్కిష్ విప్లవాలు రెండూకూడా బూర్జువావిప్లవాలేనని మనం గుర్తించవలసివుంటుంది. వీటిలో యేదీకూడా 'ప్రజా విప్లవం' కాదు. ఎందువల్లనంటే, ప్రజాసమూహాలు— అథవా ప్రజల్లో అత్యధికసంఖ్యాకులు, స్వతంత్రంగానూ, చురుకుగానూ, తమ తమ ఆర్థిక, రాజకీయ హక్కులకొరకై ముందుకువచ్చి ఆ విప్లవాలలో పాల్గొనలేదు. పోర్చుగీస్, టర్కిష్ విప్లవాలలోవలె ౧౯౦౫— ౧౯౦౭లోని రష్యన్ బూర్జువా విప్లవంలో గొప్ప గొప్ప 'విజయములు' కలుగలేదు. అయినా అది నిస్సందేహంగా ప్రజావిప్లవమే. ఎందుచేతనంటే, సామాజికంగా మిక్కిలీ హీనస్థితిలో నుంచబడి, దోపిడీచేయబడుతూ, అణిచిపెట్టబడియున్న అత్యధికసంఖ్యాకులైన ప్రజలు, తమంతటతామే తిరగబడి, విప్లవమార్గమంతటా తమకోర్కెల చిహ్నాలనే ముద్రిస్తూ, నాశనం చేయబడవలసిన వెనుకటి సమాజంయొక్క స్థానంలో నిర్మించబడవలసిన స్వీయ, నూతన సమాజ విధానాలనే ప్రత్యక్షంచేస్తూ, విప్లవాన్ని ముందుకు తీసుకుపోయేరు.

ప్రజల్లో అధికసంఖ్యాకులుగా కార్మికులేగల దేశం ౧౯౧౭ నాటికి ఒక్కటైనా యూరోపులో లేనేలేదు. 'ప్రజా' విప్లవం తనప్రవాహంలోకి అత్యధికసంఖ్యాకుల్ని ఆకర్షించిందంటే, కార్మికుల్నీ, రైతుల్నీ కూడా కలిపి విప్లవంలోకి తెచ్చిందన్నమాట. 'ప్రజలు' అంటే యీసందర్భంలో

కార్మికులూ- రైతులూ అనిఅర్థం. ఈ రెండువర్గాలూ కలిసినవన్నమాట. ఎందుచేత? 'రాజ్యాంగయంత్రము యొక్క అధికారివర్గ, సైనికసంస్థలు,' వాళ్ళద్దరినీ కూడా అణచిపెట్టి, పీడించి, దోపిడీచేస్తూన్నాయి గనుక. ఈసంస్థల్ని బద్దలుకొట్టి, నాశనంచేయడంలోనే ప్రజలయొక్క, అత్యధిక సంఖ్యాకులయొక్క,—అంటే కార్మికులూ, రైతుల్లో అధికసంఖ్యాకులూ — వీళ్ళయొక్క నిజమైన మేలువుంది. కార్మికులతో బీదరైతులు తమంతటనే యేకీభవించడానికి యిదే మొదటికారణం. ఇటువంటి యేకీభావం కుదరకపోతే 'ప్రజాతంత్రం' అస్థిరమై, సోషలిజంలోనికి మార్పుచెందడం అసంభవం అవుతుంది.

కార్మికులకూ, రైతులకూ, ఐకమత్యం కుదర్చడానికి పారిస్ కమ్యూన్ మార్గం వేయనారంభించిందనే విషయం అందరికీ తెలిసినదే. కాని, అనేక బాహ్యాభ్యంతర కారణాలచేత కమ్యూన్ యీ కార్మిక కర్షక సమ్మేళనాన్ని పూర్తిచేయ లేకపోయింది.

మధ్యతరగతులయొక్క (వీళ్ళనిగూర్చి మార్క్స్ తరుచుగాను, యెక్కువగాను మాట్లాడుతూ వుండేవాడు) ప్రత్యేకలక్షణాల్ని దృష్టిలో వుంచుకుంటూ. ౧౮౭౧లో యూరోపుఖండంమీద రాజ్యాల్లోని వివిధ వర్గాలయొక్క పరస్పరసంబంధాల్ని అతిజాగ్రతగా పర్యాలోచిస్తూ, పదను గుణ్యాంగా మార్క్స్, 'నిజమైన ప్రజావిప్లవాన్ని' గూర్చి మాట్లాడేరు. రాజ్యాంగయంత్రాన్ని 'నాశనం' చేయడం కూలీ-రైతుల కిద్దరికీ ప్రయోజనకారియే ననీ, 'పరశ్రమోపజీవి' యైన యీరాజ్యాంగాన్ని నాశనంచేసి, దానిస్థానే, ఒకనూతన విధానాన్ని స్థాపించడమే వారిద్దరికీ కర్తవ్యమై వుందనీకూడా, అతడొక నిశ్చయానికి వచ్చేడు.

నాశనంచేయబడిన పూర్వపు రాజ్యాంగయంత్రంయొక్క స్థానంలో ఎట్లాంటి నూతనవిధానాన్ని నిర్మించాలి?

2. నాశనం చేయబడిన రాజ్యాంగయంత్రంయొక్క స్థానంలో దేనిని ప్రవేశబెట్టాలి?

౧౮౭౨ నాటికింకా, కమ్యూనిస్టు మేనిఫెస్టోలో యీ ప్రశ్నకు మార్క్సు, అస్పష్టంగానే సమాధానం యిచ్చేరు. దానిలో, మనల్ని ఎదుర్కొంటూన్న సమస్యలనే పేర్కొన్నారు గాని వాట్లను పరిష్కరించు మార్గాల్ని స్పష్టంగా చూపనే లేదనికూడా చెప్పవచ్చును. "ప్రజాతంత్రాన్ని స్వాధీనం చేసుకొని" "పాలకవర్గంగా యేర్పడిన శ్రామికవర్గ సంస్థ" వెనుకటి రాజ్యాంగయంత్రంయొక్క స్థానాన్ని ఆక్రమించాలి.- యిట్టిదే యీ ప్రశ్నకు కమ్యూనిస్టు మేనిఫెస్టో యిచ్చిన సమాధానం.

పాలకవర్గంగా యేర్పడ్డ శ్రామికవర్గ సంస్థ అనుభవంలోకి వచ్చేటప్పటికి యెట్లాంటి రూపాన్ని దాలుస్తుందోననీ, యీ సంస్థ యేవిధంగా సంపూర్ణమూ, సుసంగతమూ నైన 'ప్రజాతంత్ర విజయము'తో మేళవించబడుతుందోననీ, ప్రజా ఉద్యమానుభవమే యీ సమస్యకు యెట్లాంటి సమాధానాన్ని యిస్తుందోననీ, మార్క్సు, ఊహాప్రపంచంమీదఆధారపడకుండా, యథార్థోద్యమాభివృద్ధికై యెదురుచూచేరు.

కమ్యూన్ యొక్క అనుభవం స్వల్పమే అయినా, 'ఫ్రాన్సులో అంతర్యుద్ధం' అనే గ్రంథంలో మార్క్సు, దానికి బహుసూక్ష్మమైన వివరణము నిచ్చేరు. ఈ వివరణలోని కొన్ని ముఖ్యభాగాల్ని యిక్కడ పేర్కొందము:

"రాజ్యాంగాధికార కేంద్రీకరణము' మధ్యమ యుగంలో ప్రారంభమై, పందొమ్మిదో శతాబ్దంలో అభివృద్ధి చెందింది "శాశ్వత సైన్యము, పోలీసు, అధికారివర్గము, మతగురువులు, ధర్మశాస్త్రవేత్తలు, మొదలైన యీ రాజ్యాంగాలు సర్వవ్యాప్తము లైపోయేయి." పెట్టుబడిదారులకు, కూలీలకూ మధ్య వర్గ వైరుధ్యములు దినదినాభివృద్ధి చెందుతూన్నకొలదీ, రాజ్యాంగము, అంతకంతకు ఎక్కువగా కూలీల నణచు సాముదాయిక శక్తిగా, వర్గాధిక్యత స్థాపించుట కుపయోగించే సాధనంగా మారుతుంది. వర్గ

కలహంలో కొంత అభివృద్ధిని సూచించే ప్రతీ విప్లవమూ జరిగిన తర్వాత యీ రాజ్యాంగయంత్రంయొక్క హింసావిధానం మిక్కిలి స్పష్టంగా కనిపిస్తూ వుంటుంది "

౧౮౪౮—౪౯ విప్లవం అయినతర్వాత రాజ్యాంగాధికారము. "కూలీలతో తాము చేసే పోరాటంలో పెట్టుబడిదారుల జాతీయ సాధనముగా" ఉపయోగపడింది. రెండో సామ్రాజ్యం యీ విషయాన్ని ఋజువు చేస్తూంది.

"సామ్రాజ్యమునకు సరియైన ప్రతిశక్తి ( యాంటీ—థీసిస్ ) కమ్యూన్." "వర్గ పరిపాలనయొక్క చక్రవర్తిత్వరూపాన్నేగాక వర్గ పరిపాలననే నిర్మూలించు రిపబ్లిక్ విధానంయొక్క.... ... నిర్దిష్టరూపమే కమ్యూన్......... ."

ఈ శ్రామికవర్గ ప్రజాస్వామ్యంయొక్క,— సోషలిస్టు ప్రజాస్వామ్యంయొక్క 'నిర్దిష్ట' రూపం యేది? అది, నిర్మించ బూనుకొంటూన్న రాజ్యాంగయంత్రం ఎట్లాంటిది?

"కమ్యూన్ యొక్క మొట్టమొదటి శాసనం, శాశ్వతసైన్యాన్ని రద్దుచేసింది; దాని స్థానే ప్రజలన్నే సాయుధుల నొనరించింది."

సోషలిస్టులమని చెప్పుకొనే ప్రతిపార్టీయొక్కయు ప్రణాళికలలో నేడు యీ కోరిక ముఖ్యంగా కనిపిస్తూంది. కాని, మన సోషలిస్టుల యొక్క, రివల్యూషనరీలయొక్క ప్రవర్తనవల్లనే వాళ్ళ ప్రణాళికలలోని విలువ బయటపడింది. వీళ్ళు ఫిబ్రవరి ౨౭ * వ తేదీనాటి విప్లవం తర్వాత వెంటనే యీ విషయాన్ని ఆచరణలోనికి తీసికొనిరా నిరాకరించేరు.

"........పారిస్ యొక్క వివిధభాగాల్లోని ప్రజలందరియొక్కా వోట్లచేత ఎన్నుకోబడిన మునిసిపల్ ప్రతినిధులతో కమ్యూన్

* ౧౯౧౭ మార్చి ౧౨ వ తేదీనాటి రష్యావిప్లవంలో.

ఏర్పడింది. వాళ్లు ప్రజలకు బాధ్యులై, వాళ్ళచేత తిరిగి పిలిపించ బడేటందుకు లోబడి వుంటారు. వాళ్ళల్లో అధికసంఖ్యాకులు కూలీ లుగా కాని, చాలాకాలాన్నుంచి కూలీ ఉద్యమ ప్రతినిధులుగా కాని గుర్తించబడినవాళ్ళే..... ."

" .. .రాజ్యాంగయంత్రానికి సాధనమాత్రంగా అంతవరకూ వున్న పోలీసుశాఖయొక్క రాజకీయ విధుల నన్నిటినీ తొలగించి వేసి, దానిని కమ్యూన్ యొక్క కార్యనిర్వహణశాఖగా, ప్రజలకు బాధ్యతవహించేదానినిగా, అవసరమైనప్పుడు పూర్చదగినదానినిగా చేసివేసేరు....... పరిపాలనాశాఖ లన్నింటిలోనూగల ఉద్యోగు లందరికీకూడా యీ నియమాలే వర్తిస్తాయి. కమ్యూన్ యొక్క సభ్యుడు మొదలుకొని చిన్న ఉద్యోగిదాకా, అందరు ప్రజా సేవ కులూ కూడా సాధారణ పనివానియొక్క రోజు కూలికే, తమ విధులను చేయాలి. రాజ్యాంగయంత్రంయొక్క ఉన్నతోద్యోగా లకు స్వస్తి చెప్పడంతో వాటికి చెందిన ప్రత్యేక సౌకర్యాలూ, పార్టీనిధ్యలసుములూ కూడ అపుచేయబడినాయి........ పోలీసు శాఖను, శాశ్వతసైన్యాన్నీ తొలగించడంతో, వెనుకటి ప్రభుత్వా నికి భౌతికాధికారాన్ని యిచ్చే ఆయుధాల్ని లాక్కోవడం పూర్తి అయింది. తరువాత నైతికంగా పీడిస్తూ, భావదాస్యాన్ని విధించు చూన్న మతాధికారుల ప్రాబల్యాన్ని తొలగించడంతో ప్రభుత్వం యొక్క రెండో ఆయుధంకూడా లాక్కోబడింది.........న్యాయాధి కారు లందరూ తమ బూటకపు స్వాతంత్ర్యాన్ని గోల్పోయారు.... భవిష్యత్తులో వీళ్లుకూడా ప్రజలచేత యెన్నుకోబడి, వాళ్ళకు బాధ్యులై, తిరిగి తొలగించబడదగిన (వోటర్లచే) వాళ్ళుగానే వుంటారు........"

నాశనం చేయబడిన రాజ్యాంగయంత్రంయొక్క స్థానంలో కేవలమూ నిజమైన, సంపూర్ణమైన ప్రజాతంత్రాన్ని, కమ్యూన్ యీ విధంగా స్థాపించింది: సైన్యాన్ని రద్దుచేసి, ఉద్యోగు లందరూ ప్రజలచే ఎన్నుకోబడి, తిరిగి వాళ్ళచేతనే తొలగించబడదగినవాళ్ళై వుండేటట్లు శాసించింది. ఈ 'కేవలమూ' అనే దాని అర్థం ఏమిటంటే, బ్రహ్మాండములైన అనేక సంస్థల్ని తొలగించి, మూలతత్త్వంలోనే భేదించే మరొక విధమైన సంస్థల్ని, వాటి స్థానంలో ప్రవేశపెట్టింది: "పరిమాణం, తరంగా మారుటను" యిదొక ఉదాహరణ: ప్రజాతంత్రవిధానం, పొందగలంత అభివృద్ధినీ పొంది, కాపిటలిస్టు ప్రజాతంత్రంనుండి శ్రామికప్రజాతంత్రంగా మారుతుంది: (ఒక నిర్దిష్టవర్గాన్ని పీడించి, అణచిపెట్టే ప్రత్యేక శక్తిగా వున్న)రాజ్యాంగయంత్రం తొలగించబడి, యథార్థానికి రాజ్యాంగయంత్రం అనడానికి వీలులేని మరొక సంస్థ, దాని స్థానాన్ని ఆక్రమించుతూంది.

ఇంకా, బూర్జువావర్గాన్ని అణచిపెట్టి, వాళ్ళ ప్రతిఘటనను నాశనం చేయవలసే వుంటుంది. ఇట్లు చేయడం కమ్యూన్‌కు ఎంతో అవసరం: యీ ముఖ్యకర్తవ్యాన్ని తగినంత దీక్షతో కొనసాగించకపోవడమే, కమ్యూన్ ఓడిపోవడానికి మొదటి కారణము. కాని, బానిసత్వం, దాసత్వం, కూలిపని–పద్ధతులలోవలె స్వల్పసంఖ్యాకమైన వర్గంకాక, యిక్కడ అత్యధికసంఖ్యగల ప్రజాసామాన్యమే అణచిపెట్టే శక్తిగా వుంటుంది. అత్యధికసంఖ్యాకులగు ప్రజలొకసారి తమ్ము పీడిస్తూన్నవాళ్ళ నణచివేసిన తర్వాత "అణచివుంచడానికి" ప్రత్యేకశక్తి యేదీ అవసరమే వుండదు. రాజ్యాంగయంత్రం అంతరించి పోవనారంభిస్తుందనడం అంటే యిదే. ప్రత్యేక సౌకర్యాలుగల స్వల్పసంఖ్యాకుల (ప్రత్యేక సౌకర్యాలుగల పెద్ద అధికారులు, సైన్యాధికారులు మొదలైనవాళ్లు) సంస్థలకు మారుగా అత్యధిక సంఖ్యాకులగు ప్రజలే ప్రత్యక్షంగా వాటికార్యాలను నిర్వహిస్తారు; ఈ విధంగా, రాజ్యాంగయంత్రంచేసే పనులన్నీ క్రమ క్రమంగా ప్రజలే

నిర్వహించుకొంటూన్నాంతలదీ ప్రత్యేకంగా యీ సంస్థ వుండవలసిన అవసరమే వుండదు.

ఈ సందర్భంలోనే, కమ్యూన్ చేత అవలంబించబడి, మార్క్సు చేత బలపరుపబడిన ఒకవిషయాన్ని గుర్తించాలి: ఉద్యోగులకుగల పెద్ద జీతాల్ని, ప్రత్యేక సౌకర్యాల్ని తొలగించి, వాళ్ళ జీతాల్ని, 'సామాన్యపు పనివానియొక్క కూలీరేటు' కంటె ఎక్కువ వుండకుండాచేసింది, కమ్యూన్. బూర్జువాప్రజాతంత్రంనుంచి శ్రామికవర్గప్రజాతంత్రంగా మార్పు యిక్కడే స్పష్టంగా కనిపిస్తుంది. పీడించే వర్గంయొక్క ప్రజాతంత్రం, పీడించబడేవాళ్ళ ప్రజాతంత్రంగా,— ఒక నిర్దిష్టవర్గాన్ని అణచి పెట్టడానికి వుపయోగించే 'ప్రత్యేకశక్తిగా' వున్న రాజ్యాంగయంత్రం, ప్రజల్లో అత్యధికసంఖ్యాకులగు 'కూలీ—రైతులు', తమను పీడించే వాళ్ళను అణచిపెట్టడానికి వుపయోగించే 'అఖండశక్తిగా',— మార్పుచెందు తుంది. రాజ్యాంగయంత్రానికి సంబంధించినంతవరకూ అతి ముఖ్యమైన యీ విషయంలోనే, మార్క్సుయొక్క బోధనలు మరచిపోబడినాయి. మార్క్సుయొక్క వ్రాతలకు అనేక వ్యాఖ్యానాలు వ్రాయబడి, ప్రచారంలో వున్నాయి, కాని, వాటిల్లో యీ విషయాన్నే యెత్తుకోలేదు. ఇది పూర్వ కాలపు 'అమాయికత్వం' తప్ప మరేమీ కాదన్నట్లుగా దీన్నిగూర్చి ఉపే క్షగా ఊరుకోవడం 'బాగానేవుంది.' ఇది యెట్లావుందంటే, క్రైస్తవ మతం ప్రభుత్వాలవల్ల అనుసరించబడి, రాజమతస్థానాన్ని పొందినతర్వాత క్రైస్తవులు, ప్రారంభదశలో తమ మతంలోవుండే సౌజన్యతనూ, 'అమా యకత్వాన్ని', ప్రజాతంత్ర విప్లవతత్వాన్నీ కూడా 'మరచినట్లు'గానేవుంది.

ప్రభుత్వంయొక్క ఉన్నతోద్యోగుల జీతాల్నితగ్గించడం అనేది పురాతన ప్రజాతంత్రతత్వంలోని అమాయికపుకోరికగా కనిపించవచ్చును. నేటి ఒడుగుబాటు తత్వముకు జన్మదాతయు, యిదివరలో సోషల్ డెమోక్రాటున్నూ అయిన ఇ. బెరన్‌స్టీన్, అనేకసార్లు, 'పురాతన' ప్రజా

తంత్రతత్త్వాన్ని వేళాకోళంచేసే బూర్జువా అపభ్రంశవాక్యాల్ని బలపరచడంలో తన తెలివితేటల్ని వినియోగించేరు. కాట్స్కీ అనుయాయులైన నేటి ఒదుగుబాటుదారు లందరికీ వలెనే బెర్న్‌స్టీన్ కూడా, పెట్టుబడిదారీ విధానాన్నుంచి సోషలిస్టు విధానంలోకి మార్పుచెందాలంటే యేదోకొంత వరకూ 'పురాతన' ప్రజాతంత్రానికి 'తిరిగివెళ్ళకుండా' సాధ్యంకాదనే విషయం గ్రహించలేకనే పోయాడు. (అట్లాతిరిగి వెళ్ళకపోతే, అత్యధిక సంఖ్యాకులు, అంటే ప్రజలలో ప్రతీవ్యక్తీ కూడా రాజ్యాంగవిధుల్ని నిర్వహించడం యెట్లా సాధ్యపడుతుంది?) ఇంకో విషయం చెప్పాలిసివుంది. పెట్టుబడిదారీవిధానంమీదా, పెట్టుబడిదారీ విజ్ఞానంమీదా నిర్మించబడ్డ 'పురాతన' ప్రజాతంత్రవాదానికీ, ఆదిమకాలంనాటి— పెట్టుబడిదారీ విధానానికి పూర్వంవుండే 'పురాతన' ప్రజాతంత్రవాదానికీ, ఎంతోభేదంవుందని బెర్న్‌స్టీన్ మరచిపోయేడు.

పెట్టుబడిదారీవిజ్ఞానం, బహుళోత్పత్తి విధానాన్నీ, ఫాక్టరీలనీ; రైల్వేలనూ, పోస్టల్, టెలిఫోన్ మొదలైన అనేక యితరసౌకర్యాల్నీ కలిగించింది. వెనుకటి 'రాజ్యాంగయంత్రం' యొక్క విధుల్లో చాలవరకు వీటిసహాయంవల్ల క్లుప్తీకరించబడినాయి. వీటినియింకా సూక్ష్మీకరించి కాగితాలు నమోదుచేయడం, బొత్తులుగా వేరుచేయడం, సరిచూడడం మొదలైన పనులక్రిందమార్చి, ప్రతిసాధారణ అక్షరాస్యుడూకూడ వీటిని సులభంగా నిర్వహించగలిగేటట్లు చేయవచ్చును. ఇందువల్ల యీ ప్రభుత్వ విధులనన్నిటినీ 'సామాన్యపనివాని కూలీరేటుకే' నిర్వహించునట్లు చేయాలి. ఇట్లుచేస్తే 'ఉద్యోగఛాయా' లోని ఆధిక్యత, ఉద్యోగాలయందలి ప్రత్యేకసౌకర్యాలూ తొలగిపోయి తీరుతాయి.

మినహాయింపు లేకుండా ఉద్యోగులందరూ యెన్నుకోబడాలనీ, ఎప్పుడుపడితే అప్పుడు వీళ్ళని తిరిగి వెనకకుపిలవవచ్చుననీ, వాళ్ళజీతాలు 'సామాన్యపు పనివాని కూలీరేటు' కంటె యెక్కువగా వుండకూడదనీ,

విధించే యీ సాధారణచర్యలే. కమ్యూన్ యొక్క ప్రజాతంత్ర స్వభావానికి ప్రత్యక్షప్రమాణాలు ఈచర్యలు కూలీలయొక్కయు, రైతుల్లో అత్యధిక సంఖ్యాకులయొక్కయు. ప్రయోజనాలకు ఐక్యత సంఘటించుటయేగాక పెట్టుబడిదారీ విధానాన్నుంచి సోషలిజానికి పోవడానికి ఒకమెట్టుగా ఉపయోగపడుతాయి. ఈచర్యలు, రాజ్యాంగయంత్రానికే. కేవలం సమాజం యొక్క రాజకీయ పునర్నిర్మాణానికే సంబంధించి వుంటాయి. 'దోపిడీ గాండ్లను దోచుకోవడం' పూర్తి అయినప్పుడు గాని. అట్లాచేయడానికి యేర్పాట్లు జరుగుతూన్నప్పుడు గాని. అంటే ఉత్పత్తిసాధనాలమీద పెట్టుబడిదార్లకుగల ప్రత్యేక అధికారాన్ని సాముహికాధికారంగా మార్పుచేసినప్పుదే పైచర్యలు అర్థవంతములూ. ప్రయోజనం గలవీ అవుతాయి. మార్క్సు. యిట్లా వ్రాసేడు.

> "తక్కువ వ్యయసాధ్యమైన ప్రభుత్వం" అనే హెచ్చరిక. బూర్జువావిప్లవా లన్నిటిలోనూ ఉపయోగించబడుతూవుంది. దానిని కమ్యూన్ సాధించగలిగింది. రాబడిలో అత్యధిక భాగాన్ని మ్రింగివేసే సైన్యాన్నీ. ఉద్యోగివర్గాన్నీ. తొలగించడంద్వారా యీ హెచ్చరికను సాధించేరు."

రైతుల్లోనుంచీ, మధ్యతరగతుల్లోని యితరశాఖల్లోంచీ అతిస్వల్ప సంఖ్యాకులుమాత్రమే "పైకివస్తారు," (బూర్జువాఅర్థంలో) "ప్రపంచంలో తమ బ్రతుకుతెరువు చూసుకుంటారు." అనగా యేదో వున్నవాళ్ళగా గాని, పెట్టుబడిదారులుగా కాని, ప్రత్యేకసౌకర్యాలూ, రక్షణలూవున్న ఉద్యోగులుగా గాని అవుతారు. రైతులువుండే బూర్జువా దేశాలన్నిట్లోనూ కూడా (బూర్జువాదేశాల్లో చాలవాటిలో రైతులు వుంటితీరుతారు) రైతుల్లో అత్యధిక సంఖ్యాకులు ప్రభుత్వంచేత పీడించబడుతూ. ప్రభుత్వం కూలిపోవాలనే కోరుతూంటారు. వాళ్ళంతా స్వల్పవ్యయసాధ్యమైన ప్రభుత్వమే కావాలని వాంఛిస్తూవుంటారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ఒక్కశ్రామిక

వర్గమే సాధించగలుగుతుంది. శ్రామికులు దీనిని సాధించడంవల్ల, రాజ్యాంగయంత్రాన్ని సోషలిస్టు పద్ధతులపైన పునర్నిర్మాణంచేయడంలో ఒక అడుగుముందుకు వేస్తారు

### 3. పార్లమెంటరీ విధానాన్ని నాశనం చేయడం.

"కమ్యూన్ . కేవలము ఒక పార్లమెంటరీ సంస్థగా మాత్రమే గాక, పనిచేసే సంస్థగా, అంటే శాసననిర్మాణాన్నీ, కార్యనిర్వహణాన్నీ కూడా ఒకేసారి కొనసాగించేదిగా వుంటుంది. ."మార్క్సు.

". . ...ఏ మూడేళ్ళకో. ఆరేళ్ళకో ఒకసారి, పాలకవర్గం లోని యే వ్యక్తి పార్లమెంటులో తమకు ప్రాతినిధ్యంవహించి, పీడించుతూండాలో (*Vertreten und Zertreten*) నిర్ణయించుతూవుండడమే, సార్వజనీనమైన ఓటింగు హక్కు యొక్క వినియోగము కాదు. వ్యక్తిగతమైన ఎన్నికహక్కు యజమానులకు తమపనికి తగినందరు కూలీలను, ఓవర్‌సీర్లను, బుక్–కీపర్లనూ యెంచుకొనేందుకు యెట్లా ఉపయోగించిందో, అట్లే, సంఘము లుగా యేర్పడ్డ ప్రజలకి యీ సార్వజనీనమైన ఓటింగుహక్కు వాళ్ళపనిలో వినియోగపడాలి."

పార్లమెంటరీ తత్త్వాన్ని మార్క్సు యీ విధంగా ౧౮౭౧ లోనే విమర్శించేడు. ఒదుగుబాటుతనం, సంకుచిత దేశాభిమానం విపరీతంగా వ్యాపించియుండడంవల్ల, వాటి ధర్మమా యని యిదికూడా 'మరచిపో బడింది.' మన రోజుల్లోని యీ సోషలిస్టు నామధారులు 'కేబినెట్' లలో మంత్రులుగానూ, పార్లమెంట్ల సభ్యులుగాను వెళ్ళడమే వృత్తిగా పెట్టుకొని, శ్రామికులకు ద్రోహులై, పార్లమెంటరీతత్త్వ విమర్శనను కేవలం అరాజ్యవాదులకే (*Anarchists*) ఒదిలిపెట్టేరు. అంతేగాక, యీ సాకు తీసికొని, పార్లమెంటరీతత్త్వాన్ని విమర్శచేసే వాళ్ళనందర్నీ 'అరాజ్యవాదులు, అని అంటున్నారు. పార్లమెంటరీవిధానం చాలా 'అభివృద్ధి

చెందిన' దేశాల్లోని శ్రామికులు, స్కీడ్‌మాన్, డేవిడ్, లెగీన్, సెంబట్, రెనాదెల్, హెండర్సన్, వాండర్‌వార్డ్, స్టానింగ్, బ్రాంటింగ్, బిస్సో లాటి మొదలైన 'సోషలిస్టుల' పేరుచెప్పుతేనే అసహ్యించుకొంటూ, ఒకు గుబాటుతత్వానికి దగ్గరసంబంధం గల 'అనార్కో సిండికాలిజమ్' పైపుకి క్రమ క్రమంగా మొగ్గుతూన్నారు.

కాని, ప్లెఖనోవ్, కాట్స్కీ మొదలైన వాళ్ళకివలె మార్క్స్, విప్లవ యుతగతితర్కాన్ని వక్రబడాయి ఎబుర్లుగానూ, గొడవగానూ తలచలేము. పరిస్థితులు విప్లవానుకూలంగా లేనప్పుడు, బూర్జువాపార్లమెంటరీ విధానం అనే 'ఊబిని' కూడా మనం ముందుకు జాగ్రత్తగా సాగిపోవాలి. ఈ 'ఊబిని' తమకు ప్రయోజనకారిగా చేసికోజాలనందులకు, మార్క్స్ నిర్దాక్షిణ్యంగా అరాజ్యవాదుల్ని ఖండించడం మాత్రమే గాక పార్లమెంటరీ తత్వాన్ని నిజమైన విప్లవకర శ్రామికదృష్టితో విమర్శించేము.

ఏ మూడేళ్ళకో, ఆరేళ్ళకో ఒకసారి, పాలకవర్గంలోని యేవ్యక్తి పార్లమెంటులో తమకు ప్రాతినిధ్యం వహించి, పీడించుతూండాలో నిర్ణ యించుతూండడం, - యిదే బూర్జువాపార్లమెంటరీవిధానానికి సారాంశము పార్లమెంటరీవిధానంతోగూడిన రాజరికాల్లోనేగాక ఉత్కృష్టమైన పరిజా తంత్ర ప్రజాస్వామ్యాల్లో కూడా యిదే యదార్థమని ఋజువైనది.

రాజ్యాంగయంత్రం అంటే యేమిటో తెలుసుకొన్నాము. పార్ల మెంటరీవిధానంకూడా యీ రాజ్యాంగయంత్రంయొక్క ఒక రూపమేనని కూడా తెలుసుకొన్నాము. ఇంక, యీ రాజ్యాంగయంత్రం విషయంలో శ్రామికుల కర్తవ్యాలు యేమిటీ అని ఆలోచించి చూస్తే, పార్లమెంటరీ తత్వంనుంచి తప్పించుకోడం, దానికి స్వస్తి చెప్పడం, యెట్లాగో తెలు సుకోవచ్చును.

కాని, ఒక్క విషయాన్ని నొక్కి వక్కాణించాలి. ది మ్యూ న్ యొక్క పరిశీలనపైన ఆధారపడే మార్క్స్ తన విమర్శను కొనసాగిం

చేరు. నేటి మన 'సోషల్ డెమాక్రాట్‌లు' (సోషలిజానికి ద్రోహులు) మార్క్స్‌యొక్క యీ ఉపదేశాన్ని మరచిపోయేరు. వీళ్ళకి, పార్లమెంటరీతత్వ్వ విమర్శ అంటే అరాజ్యవాదులూ, విప్లవ వ్యతిరేకులూ చేసేది అనే కాని మరోటి అర్థం కానేరాదు.

పార్లమెంటరీతత్వాన్నుంచి తప్పించుకోవాలంటే చేయవలసిన పని, ప్రతినిధి సంస్థల్నీ, యెన్నికల్నీ రద్దుపరచడంగాదు. కేవలం బాతాఖానీ స్థలాలుగా వున్న పార్లమెంట్లను 'పనిచేసే' సంస్థలుగా మార్చాలి. "కమ్యూన్ కేవలమూ ఒక్క పార్లమెంటరీసంస్థగామాత్రమే గాక పనిచేసే సంస్థగా, అంటే శాసనసర్మాణాన్నీ, కార్యనిర్వహణాన్నీ కూడా చేసే సంస్థగా వుంటుంది. .. "

## 4. జాతియొక్క తా నిర్మాణము.

" ... .. కమ్యూన్. .... ...... ప్రతిగ్రామంయొక్కయు రాజకీయసంస్థ కాగలదని, జాతీయనిర్మాణాన్ని గురించిన సంక్షిప్త వర్ణనలో విస్పష్టంగా చెప్పబడింది. కాని, వీటిని అభివృద్ధిచేయడానికి కమ్యూన్‌కు అవకాశం లేకపోయింది."

ఈ కమ్యూన్‌లనుండియే పారిస్‌లోని 'నేషనల్ ఎసెంబ్లీ' యెన్నుకోబడును.

" . ... కేంద్రప్రభుత్వం నిర్వహించవలసిన ముఖ్యమైన విధులు యింకా కొన్ని వుంటాయి. వీటిని తొలగించకూడదు. (తొలగించాలి అనేది దారుణమైన అబద్ధం) ఈ విధుల నన్నిటినీ కమ్యూన్‌యొక్క ఆఫీసర్లద్వారా, పూర్తిగా బాధ్యత వహించే కమ్యూన్ ఉద్యోగులద్వారా నిర్వర్తింపచేయాలి. జాతియొక్క ఐక్యతను నిర్మూలించక, కమ్యూన్‌లద్వారా జాతీయైక్యతను నిర్మించి, బలపరచాలి. జాతీయైక్యతకు (*embodiment*)ఉదాహరణగా చెప్పబడుతూ, జాతికంటె అతీతమైనదిగానూ, స్వతంత్ర

మైనదిగానూ పరిగణించబడాలని కోరే, 'రాజ్యాంగయంత్రాన్ని' నాశనంచేసి, జాతీయైక్యతకు యధార్థత్వాన్ని ఆపాదించాలి. జాతి అనే శరీరంమీద, రాజ్యాంగయంత్రం అనే రణం బయలుదేరి, దాని సారాన్ని పీల్చి, బ్రతుకుతూ వుంటుంది . చేయవలసిం దేమిటంటే, పూర్వపు ప్రభుత్వంయొక్క పీడనాకరమైన శాఖల్ని ఛేదించిపారేసి, అది చేసే న్యాయసమ్మతమైన కార్యాల్ని, సమాజంకంటె భిన్నమైనదాననని చెప్పే అధికార సంస్థలనుండి లాక్కొని, సమాజానికి బాధ్యతవహించే సేవకులపరం చేయాలి."

మార్క్సుయొక్క యీ పరిశోధనల్ని ప్రస్తుతపు సోషల్ డెమోక్రాట్లలోని ఒదుగుబాటు తత్త్వంగలవాళ్ళు అర్థంచేసుకోనే లేదని తెలుస్తూంది; ద్రోహమైన బెరన్‌స్టీన్ వ్రాసిన 'ఎవల్యూషనరీ సోషలిజమ్' అనే గ్రంథాన్నిచూస్తే యిది నిజమని ఋజువు అవుతుంది. పీళ్లు, మార్క్సు యొక్కమాటల్ని తెలుసుకోడానికి ప్రయత్నమే చేయలేదని చెప్పడం యింకా యదార్థం. ఈ సందర్భంలోనే, మార్క్సుయొక్క పై వ్యాఖ్యానాన్నిగూర్చే వ్రాస్తూ, బెరన్‌స్టీన్. మార్క్సుకార్యక్రమము, "దాని రాజకీయదృక్పథంలో, ప్రతిముఖ్య విషయంలోనూ, ప్రౌఢన్ యొక్క ఫెడరాలిజమ్‌తో చాలవరకు సరిపోలుతుంది.. . మార్క్సుకున్ను, 'పెట్టీ-బూర్జువా' ప్రౌఢన్‌కున్ను (బెరన్‌స్టీన్, యీ 'పెట్టీబూర్జువా' అనే పదాన్ని వ్యంగ్యార్థకంగా కొటేషన్లలో పెట్టేడు.) ఈ విషయాల్ని గురించిన ఆలోచనాపద్ధతిలో యెంతోదగ్గర పోలికవుంది," అన్నాడు.

........ కమ్యూన్ యొక్క అనుభవాల్నిగురించి మార్క్సు యొక్క పై వివరణలో 'ఫెడరాలిజమ్' యొక్క పోలికయేలేదు, ఒదుగుబాటుతత్త్వంగల బెరన్‌స్టీన్‌గమనించ జాలని ఒక విషయంలో మాత్రం. మార్క్సు-ప్రౌఢన్‌తో యేకీభవించేరు;యే విషయాల్లో మార్క్సు-ప్రౌఢన్‌లు యేకీభవిస్తూన్నారని బెరన్‌స్టీన్ చెప్పేడో ఆ విషయాల్లోనే వాళ్ళిద్దరికీ పోలిక యేమీలేదు.

ప్రస్తుతపు రాజ్యాంగయంత్ర సాధనాల్ని 'నాశనం చేయడం' అనే విషయంలోనే మార్క్స్, ప్రౌధన్‌లు యేకీభవించేరు. అరాజ్యవాదులతో (ప్రౌధన్, బకునిన్‌లు యిద్దరితోనూకూడా) యేకీభావం కుదిరిన ఈ విషయాన్ని, ఒదుగుబాటుదార్లూ, వాట్స్కీ అనుయాయులూకూడా గమనించడానికి యిష్టపడరు. ఎందుచేతనంటే, యీ విషయంమీదనే, వాళ్ళకీ-మార్క్స్‌కూ భేదంవుంది కనుక.

సరీగా 'ఫెడరాలిజమ్' అనే దానిమీదే మార్క్స్-ప్రౌధన్, బకునిన్‌లతో వేరవుతూన్నాడు. (శ్రామికనియంతృత్వం విషయం అట్లా వుంచండి) అరాజ్యవాదంలోని పెట్టీబూర్జువా దృక్పథాలకు ఫలితంగానే 'ఫెడరాలిజమ్' అనే సిద్ధాంతం బయలుదేరుతూంది. మార్క్స్ 'కేంద్రీకరణవాది' *Centralist*. పైన ఉదాహరించబడిన భాగాల్లో 'కేంద్రీకరణసిద్ధాంతా'న్నుంచి మార్క్స్ తొలగిపోయిన దెక్కడాలేదు. బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని నాశనంచేయాలనడం—కేంద్రీకరణాన్ని నాశనం చేయాలనడం, ఒకవేళ అది కేవలం విద్యాహీనులై, 'రాజ్యాంగయంత్రం' పట్ల అంధవిశ్వాసం వున్నవాళ్ళే పొరబడాలి.

రాజ్యాంగాధికారాన్ని కార్మికులూ, బీదరైతులూ వశపరచుకుని తమచేతుల్లోకి తీసుకొని, స్వేచ్ఛగా కమ్యూన్‌ల నేర్పరచుకొని, పెట్టుబడిదారీవిధానాన్నీ, పెట్టుబడిదార్ల ప్రతిఘటనాశక్తినీ, నాశనం చేయడంలోనూ; రైల్వేలూ, ఫాక్టరీలూ, భూములూ, మొదలైనవాటిమీదనున్న ప్రత్యేకాస్తి హక్కును తొలగించి, జాతికంతకూ, సమాజానికంతకూ చెందేటట్లు చేయడంలోనూ; తమ కమ్యూనాలన్నిటియొక్క శక్తిని యేకీభవింపచేసినట్లైతే యేమవుతుంది ? అది 'కేంద్రీకరణం' గాదా ? దానికిన్నినూ సుసంగతమూ, ప్రజాతంత్రయుతమూనైన 'కేంద్రీకరణతత్వం' మరేదైనావుంటుందా ? అందుచేతే, శ్రామికవర్గ అధికార కేంద్రీకరణతత్వం అంటే యిదేకాదా?

కేంద్రీకరణం ఐచ్ఛికంగా సాధ్యమగుననిన్నీ; కమ్యూన్‌లన్నీ ఐచ్ఛింగానే ఒకిజాతిగా యేర్పడడం సాధ్యమనిన్నీ; బూర్జువా రాజ్యాంగయంత్ర సాధనాల్నీ, బూర్జువావర్గాధిక్యతనీ, నాశంచేయడంలో శ్రామికుల కమ్యూన్‌లన్నీకూడా ఐచ్ఛికంగానే యేకీభవించులా యనిన్నీ,- బెరన్‌స్టీన్ గ్రహించలేదు. జ్ఞానశూన్యులందరికి వలెనే బెరన్‌స్టీన్‌కూడా 'కేంద్రీకరణం' అంటే యేదో పై నుంచితెచ్చి సమాజంమీద రుద్దినవిధానంగా మాత్రమే; తెచ్చిరుద్ది అధికారివర్గ, సైనికసంస్థలచేత నిలపపెట్టబడవలసిన దానినిగా మాత్రమే ఊహించగలడు.

తనమాటలకు తప్పకుండా పెడర్థాలు తీస్తారని, భవిష్యత్తును తెలిసికొన్నవానికివలె, మార్క్స్, జాతీయైక్యతను నాశనం చేయయత్నించిందనీ, కేంద్రాధికారాన్ని తొలగించ యత్నించిందనిన్నీ,—కమ్యూన్‌పైన మోపబడే నిందలు పచ్చిఅబద్ధాలని నొక్కిచెప్పేడు. 'జాతీయైక్యతానిర్మాణానికై' అనే మాటను, మార్క్స్ బుద్ధిపూర్వకంగా ఉపయోగించేడు. సైనిక, అధికారివర్గములతో గూడిన బూర్జువా 'కేంద్రీకరణానికీ'— ఉద్దేశ్యపూర్వకమైన, ప్రజాతంత్రయుతమైన శ్రామిక 'కేంద్రీకరణానికీ'—గల భేదాన్ని స్పష్టంచేయడానికే మార్క్స్ యిట్లాచెప్పేడు.

"విననొల్లని వానికంటె చెవిటివాడు యింకోడు వుండబోడు." నేటి సోషల్‌డెమోక్రాట్‌లలోని ఒడుగుబాటుదారులు, 'రాజ్యాంగయంత్రాధికారం' అనే యీ 'బదనిక' ను నాశనంచేయడాన్నిగురించి వినడానికి యిష్టపడరు.

## 5. "బదనిక" వంటి రాజ్యాంగయంత్రాన్ని నాశనంచేయడం.

ఈ విషయాన్ని గురించి యిదివరకే మార్క్స్ రచనలనుండి చక్కని ఉదాహరణలను యిచ్చేము. దానికి అనుబంధంగా మరికొంత చెప్పాలి.

"చరిత్రలో, యే నూతనసామాజిక జీవితవిధానాలైనా కనిపెట్టబడి, నశించిన వెనుకటి సామాజికవిధానాలతో యే కొంచెమైనా

పోలికగలిగివుంటే, వాటిని పెంపొందివనే పొంటడుట తటస్థించుతూ వుంది. ఈ విధంగానే ఆధునికరాజ్యాంగ యంత్రాన్ని ధ్వంసంచేసి వేస్తూన్న యీ నూతనమైన కమ్యూన్‌ను, పునర్జీవనాన్ని పొందుతూన్న మధ్యయుగాలనాటి 'కమ్యూన్' ల మారురూపమునిన్నీ,....

. చిన్నచిన్న రాజ్యాంగాల సమ్మేళనమునీ *Union*

(మాంటేస్క్యూ, గిరాండిస్టులు) . అధికకేంద్రీకరణం కూడదని పూర్వకాలంలో జరిపిన పోరాటంయొక్క నూతన రూపం అనీ తలంచబడింది."

" సమాజంమీద జీవిస్తూ, దాని స్వేచ్ఛనాటంకపరుస్తూవుండే బదనికలాంటి 'రాజ్యాంగయంత్రం' యిప్పటిదాకా రాచకురుపువలె పీల్చేస్తూన్న శక్తులనన్నిటినీకూడా యీ కమ్యూన్ యొక్క రాజ్యాంగవిధానం, తిరిగి సామాజికశరీరానికే వప్పచెప్పివుండేది. కేవలం యీ కమ్యూన్ యొక్క రాజ్యాంగవిధానం వల్లనే ఫ్రాంసుయొక్క పునరుజ్జీవనం సాధ్యమైవుండేది . "

" ఈ కమ్యూన్ యొక్క రాజ్యాంగవిధానం, పల్లెటూళ్ళలోని ఉత్పత్తిదారులసందరినీ, ఆయాజిల్లాల పెద్ద పట్టణములలోని విద్యావంతుల నాయకత్వం క్రిందకు తెచ్చి, పల్లెటూరి ప్రజల ప్రయోజనాల్ని సమర్థించే ప్రతినిధులనుగా పట్టణకూలీలనే చేసియుండెదిది. కమ్యూన్ అంటే ఒకవిధమైన స్థానికస్వపరిపాలనా విధానం లాంటిది. ఇప్పుడు కేవలమూ అనవసరమైనదిగా వున్న రాజ్యాంగయంత్రంయొక్క అధికారానికి, యీ కమ్యూన్ ప్రతిగా వుండనేవుండదు "

"రాజ్యాంగయంత్రాధికారం యొక్క నిర్మూలనం", "పీల్చిపిప్పి చేసే రాచకురుపు" అయిన రాజ్యాంగయంత్రాన్ని "ఛేదించి తీసేయడం" "నాశనంచేయడం" "రాజ్యాంగ యంత్రాధికారం యిప్పుడు అనవసరం

అవుతుంది''—యిట్లాంటి విశేషణాలనే, కమ్యూనిజంయొక్క అనుభవాన్ని వివరించి, మరింపు వేసేటప్పుడు, రాజ్యాంగయంత్రాన్ని గూర్చి మార్క్సు ఉపయోగించేడు.

ఇవన్నీ సుమారు యేభైసంవత్సరాలక్రిందట వ్రాయబడినాయి; ప్రజాసామాన్యానికి స్వచ్ఛమైన మార్క్సిజాన్ని అందజేయడానికి, దీనినంతనూ, యెట్లావున్నదానినట్లా 'త్రవ్వి బయటికితీయ' వలసివస్తూంది. ఇంకోదాన్ని బ్రహ్మాండమైన శ్రామికవిప్లవాలకి సమయం ఆసన్నమైనప్పుడే. గత మహావిప్లవంయొక్క పరిశీలననుంచి మార్క్సు తేల్చిన సారాంశములు సరిగ్గా మరిచిపోబడినాయి.

"కమ్యూనును యెన్నో పెడర్థాలు చెప్పబడుతూన్నాయి. అన్ని పెడర్థాలు తీసేవాళ్లూ, వాళ్ల స్వప్రయోజనాలకోసమే అట్లా చెప్తూన్నారు. కమ్యూన్ యెట్లాకావలిస్తే అట్లా వంచుకోదగిన రాజ్యాంగవిధానమని యిందువల్ల స్పష్టమవుతూంది; అదివరదాకా వున్న పూర్వపురాజ్యాంగవిధానాలన్నీకూడా చాల పీడాకరమయినవి. ఇందులోవున్న రహస్యం యిది: కమ్యూను అసలులా కూలీవర్గాల ప్రభుత్వమే: ఉత్పత్తిచేసే వర్గానికీ, అనుభవాన్నిపొందే వర్గానికీ గల పోరాటానికి యిది ఫలితం: కష్టజీవులయొక్క ఆర్థికదాస్యవిమోచనమును సాధించగల రాజ్యాంగవిధానము, దీనిలో చిట్టచివరకు కనుగొనబడింది."

"కష్టజీవుల ఆర్థిక దాస్యవిమోచనమును సాధించలేనిచో, కమ్యూనుయొక్క రాజ్యాంగవిధానము కేవలమూ నిరుపయోగమూ, వట్టిభ్రమా అయివుండేది."

సమాజాన్ని సోషలిస్టుపద్ధతులమైన పునర్నిర్మాణ మొనరించడానికి అనువైన రాజ్యాంగవిధానాన్ని 'కనిపెట్టడానికి' భ్రమాపూరితులైన సోషలిష్టు నామధారులు ప్రయత్నిస్తూన్నారు. అరాజ్యవాదులు పూర్తిగా రాజ్యాంగ

విధానాన్నిగురించిన ఆలోచననే మానేశారు. నేటి సోషల్‌డెమొక్రట్‌లలోని ఒదుగుపాటుదారులు. పార్లమెంటరీ ప్రజాతంత్రరాజ్యాంగం యొక్క రాజకీయవిధానాలనే హద్దుగాపెట్టుకొని, వాటిని అంగీకరించి, వాటి హద్దును మించకూడదంటూన్నారు; వీళ్లందరూ, యీ రాజకీయవిధానాలనే పైపై దర్తిషులుగా భావించి, తలయొప్పివి వైలాగ వాట్లముందర సాగిలబడుతూ వాట్లని నాశనంచేయడానికి యత్నించేవాళ్లనందర్నీ 'అరాద్వాదుల' ని తిట్టిపోస్తున్నారు.

సోషలిజంయొక్క, రాజకీయపోరాటాలయొక్క మొత్తం చరిత్ర నుండి, మార్క్సు ఒకసారాంశాన్ని తేల్చేడు. రాజ్యాంగయంత్రం తప్పనిసరిగా అదృశ్యమైతీరుతుందనీ; (రాజ్యాంగయంత్రయుతదశనుండి రాజ్యాంగయంత్రరహితదశకు మారేటప్పుడు) "శ్రామికవర్గము పాలకవర్గంగా యేర్పడి" రాజ్యాంగయంత్రంయొక్క స్థానాన్ని ఆక్రమిస్తుందనీ. ఈ భవిష్యద్దశయొక్క రాజ్యాంగస్వరూపాల్ని కనిపెట్టడానికి మార్క్సు ప్రయత్నించనేలేదు. ఫ్రెంచిచరిత్రను పరిశీలించుటకును, వివరించుటకును మాత్రమే మార్క్సు తనశ్రద్ధను వినియోగించేడు; ౧౮౫౧ సంవత్సరపు సంఘటనలవల్ల మార్క్సు ఒకనిర్ణయానికి వచ్చేడు: పరిస్థితులుమారుతూ, బూర్జువారాజ్యాంగయంత్రసాధనాలు వినాశాన్ని సమీపిస్తూన్నాయని తేల్చుకున్నాడు.

కమ్యూన్, చివరకు ఓడిపోయినా, అదిజీవించినకాలం స్వల్పమే అయినా, అదిచాల బలహీనమైనదైనా, శ్రామికవర్గప్రజావిప్లవోద్యమం చెలరేగినప్పుడు, అది యేయేరాజకీయస్వరూపాలను బయటకుతెచ్చినదో మార్క్సు పరిశీలించనారంభించేడు.

శ్రామికవిప్లవం వల్ల 'చిట్టచివరకు కనిపెట్టబడిన' రూపమే 'కమ్యూన్' అనీ, కష్టజీవులయొక్క ఆర్థికదాస్యవిమోచనము దీనిక్రిందనే సాధించబడుననియూ నిర్ణయానికి వచ్చేడు.

బూర్జువా రాజ్యాంగయంత్రాన్ని నాశనంచేయడానికి శ్రామికవర్గ విప్లవంచేసిన ప్రథమప్రయత్నమే 'కమ్యూన్'. నాశనంచేయబడిన బూర్జువా రాజ్యాంగయంత్రంయొక్క స్థానంలో ప్రవేశపెట్టబడదగిన రాజ్యాంగ స్వరూపం, 'కమ్యూన్' లోనే 'చిట్టచివరకు కనిపెట్టబడింది.'

౧౯౦౫, ౧౯౧౭ సంవత్సరాలలోని రష్యావిప్లవాలు, కమ్యూన్ కంటె భిన్నమైన పరిస్థితుల్లో, భిన్నమైన పరిసరాల్లో, దానియొక్క కార్యాలనే కొనసాగించి, మేధావియైన మార్క్సుయొక్క చారిత్రకవిశ్లేషణమును రుజువు చేసేయి. దానిని యీ క్రింద చూడగలము.

## నాలుగో ప్రకరణం నుండి ఉద్ధృతము.

## అనుబంధంగా ఏంగిల్సుయొక్క

## వివరణము.

మార్క్సు, కమ్యూన్ అనుభవాల యొక్క అర్థాన్నిగురించిన మూలసూత్రాన్ని వ్రాసేడు. మార్క్సు యెత్తుకొన్న సమస్యల్నే తిరిగి యెత్తుకొని, ఆతని వివరణనూ, నిర్ణయాలనూ ఏంగిల్సు స్పష్టపరుస్తూ వచ్చేడు. ఇట్లాచేసేటప్పుడు యీ సమస్యలలో గల యితరవిషయాల్నికూడా బయలుపరుస్తూ వచ్చేడు. అందుచేత వాటిని మనం ప్రత్యేకంగా పరిశీలించాలి.

### 1. 'గృహసమస్య.'

'గృహసమస్య' అనే గ్రంథంలో (౧౮౭౨) యిదివరకే ఏంగిల్సు, యీ విషయంలో కమ్యూన్ యొక్క అనుభవాల్ని వివరించేడు. రాజ్యాంగయంత్రం విషయంలో విప్లవంయొక్క కర్తవ్యాల్నిగురించి తిరిగి తిరిగి పరిశీలిస్తూ వచ్చేడు.

కమ్యూన్ తరువాత, దానిలోని అనుభవాలప్రభావంవల్ల 'బ్లాంక్విస్టులు'

తిరిగి మార్క్సిస్టులుగా మారడాన్నిగురించి వ్రాస్తూ, ఏంగిల్సు, యిట్లా చెప్పేరు:

> " శ్రామికవర్గం, రాజకీయరంగంలో పనిచేయవలసిన ఆవశ్యకతయు: పర్గాలనూ. వాటితోబాటు రాజ్యాంగయంత్రాన్ని తొలగించుటను మధ్యదశలో శ్రామికవర్గనియంతృత్వముయొక్క ఆవశ్యకతయు... " (౫౫ పేజీ).

ఇక్కడ 'రాజ్యాంగయంత్రాన్ని తొలగించుట' యొక్క ఆవశ్యకతను గుర్తించడమున్నూ, 'యాంటీ–డూహ్రింగ్' లోనే పైవిషయాన్ని అరాజ్యవాదమని ఖండించడమున్నూ చూసి, స్తనశల్యపరీక్షచేయడానికి అలవాటుపడినవాళ్లున్నూ, మార్క్సిజాన్ని వినాశనంచేసే బూర్జువాలున్నూ దీనిలో పరస్పరవైరుధ్యం వుందని భావించవచ్చును. కొందరు ఒడుగు బాటుదారులు, ఏంగెల్సునుకూడా 'అరాజ్యవాది' అనడంలో ఆశ్చర్యపడ వలసినదేమీలేదు. ఎందుచేతనంటే సంకుచితజాతీయవాదులైన సోషలిస్టులు, యిటీవల అధికంగా అంతర్జాతీయవాదుల్ని 'అరాజ్యవాదుల'ని నిందించడం పరిపాటి అయింది.

వర్గములు తొలగించబడుటతోపాటు రాజ్యాంగయంత్రంకూడాతప్పక తొలగించబడితీరుతుందని, మనకు మార్క్సిజమ్ నిరంతరం బోధిస్తూవుంది. రాజ్యాంగయంత్రం 'నాశనమైపోవడాన్ని' గురించి 'యాంటీ–డూహ్రింగ్' లోని ఆ సుప్రసిద్ధభాగంలో ఏంగిల్సు, రాజ్యాంగయంత్రాన్ని నాశనంచేయ మన్నారనిగాదు, అరాజ్యవాదుల్ని నిరసించుతూన్నది. వాళ్లు, 'రాజ్యాంగ యంత్రాన్ని హఠాత్తుగా వెంటనే' ఒక్కసారిగా తొలగించివేయడం సాధ్యంఅవుతుంది అన్నారు కాబట్టే ఏంగిల్సు వాళ్లను ఖండించేడు.

నేడు బాగా వ్యాప్తంగావున్న సోషల్ డెమోక్రాటిక్ సిద్ధాంతము, రాజ్యాంగయంత్రాన్ని తొలగించడంతో సంబంధించినంతవరకూ మార్క్సిజమ్‌కూ, అరాజ్యవాదానికీగల సంబంధానికి పెడర్థాలు తీస్తూంది. అందుచేత

యీ సందర్భంలో, మార్క్స్ ఏంగెల్సులకును, అరాజ్యవాదులకును జరిగిన వాగ్వివాదాన్ని జ్ఞాపకం తెచ్చుకోవడం చాలాఅవసరం.

## 2. అరాజ్యవాదులతో వివాదము.

ఈ వివాదము ౧౮౭౩ సంవత్సరంలో జరిగింది. ప్రౌధన్ అనుయాయుల్నీ, స్వపరిపాలనావాదులు లేక అధికారనిరాసవాదుల్నీ విమర్శిస్తూ మార్క్స్—ఏంగెల్సులు రెండువ్యాసాల్ని ఇటాలియన్ సోషలిస్టు వ్యాస సంపుటానికి పంపించేరు. ఈ వ్యాసాలు ౧౯౧౩ వరకూ జర్మనీభాషలోనికి తర్జుమా కానేలేదు. ఆ సంవత్సరమే 'న్యూ జీట్' లో యీ వ్యాసాలు ప్రచురించబడినాయి .

.... .. ఏంగెల్సు.. "అధికారనిరాసవాదుల" మని తమ్ము పిలుచుకొనే ప్రౌధన్ అనుయాయుల విప్లవాభిప్రాయాల్ని హేళన చేసేడు; అధికారాన్నీ, లోబడియుండడాన్నీ, రాజ్యాంగశక్తినీ కూడా వీళ్లు నిరాకరిస్తారు.. ." ఈ అధికారనిరాసవాదులు .. రాజ్యాంగ యంత్రం. యే సామాజికసంబంధాలకి ఫలితంగా జనించిందో, వాటిని నాశనం చేయకుండానే రాజ్యాంగయంత్రంయొక్క రాజకీయశక్తిని ఒక్కదెబ్బతో త్రోసిపారేయాలనీ సామాజికవిప్లవంయొక్క ప్రథమకర్తవ్యము, అధికారాన్ని నాశనంచేయడమేననీ వాదిస్తారు

"ఈ పెద్దమనుష్యులు విప్లవాన్ని ఎప్పుడైనా చూసేరా? అసలు విప్లవంఅంటేనే అధికారపూరితమైనది. దీనిలో సందేహంఏమీలేదు. విప్లవంఅంటే ఏమిటి? ప్రజలలోని ఒకభాగం మరొకభాగం మీద తనయిచ్ఛను తుపాకులు, సన్నీలు, ఫిరంగులు మొదలైన సాధనాల ద్వారా అంటే మిక్కిలీ అధికారపూరితములైన సాధనాలద్వారా విధించడమే, విప్లవం ఇందులో జయించినపక్షం, తన ఆయుధ బలంవల్ల విప్లవప్రతిఘాతులలో భయాన్ని కలుగచేసి, తన అధికారాన్ని నిలువబెట్టుకుంటుంది. బూర్జువావర్గానికి వ్యతిరేకంగా

సాయుధులైన ప్రజలయొక్క అధికారబలంమీదనే ఆధారపడి వుండకపోతే, పారిస్ కమ్యూన్ ఒక్కరోజైనా నిలువబడివుండ గలిగేదా? అంతేగాక, పారిస్ కమ్యూన్, తన యీ అధికారాన్ని తగినంతగా వినియోగించలేదని మనం విమర్శించడంలేదా? అందువల్ల అధికారనిరాసవాదులు, తాము మాట్లాడేదేమిటో అర్థం చేసుకోకపోయేనా వుండాలి; అట్లాంటప్పుడు వాళ్లు ప్రజల్ని కంగారు పెట్టడంతప్ప మరేమీ చేయలేరు; లేదా, వాళ్లు తెలిసే యిట్లా మాట్లాడుతూన్నట్లైతే, శ్రామికవర్గంయొక్క ఉద్యమానికి ద్రోహం చేసినవాళ్లైనా అవుతారు; యీ రెండింటిలోనూ యేదో ఒకటి నిజమైయుండాలి. ఏదినిజమైనా కానీ, వాళ్లు, విప్లవప్రతిఘాతుకులకే సహాయంచేసిన వాళ్లవుతూన్నారు."

నేటి సోషల్‌డెమోక్రాట్ల అరాజ్యవాద విమర్శనము రోంపపాటంగా మామూలైపోయి, మూర్ఖతకూ, అసభ్యతకూ పాల్పడింది. "మేము రాజ్యాంగయంత్రాన్ని గుర్తిస్తాము; అరాజ్యవాదులు రాజ్యాంగయంత్రం అవసరంలేదంటారు!" ఏమాత్రం ఆలోచనాశక్తివున్న విప్లవకారికైనా యీ అసభ్యత సహజంగానే అసహ్యం కలిగించితీరుతుంది. ఏంగెల్సుచెప్పేది యిది కానేకాదు. సామాజికవిప్లవానికి ఫలితంగా రాజ్యాంగయంత్రం అదృశ్యమైతీరుతుందని సోషలిస్టులందరూ గుర్తించేరని, ఏంగెల్సు నొక్కి పక్కాణించేడు. తరువాత ఆతడు, విప్లవసమస్యనుగురించి విమర్శించ బూనుకుంటాడు. ఈ సమస్యను, సోషల్ డెమోక్రాట్లందరూ తమ ఒరుగుబాటుతత్త్వానికి ఫలంగా, వదలిపెట్టి, సర్వసాధారణంగా తప్పించుకొంటూన్నారు. దీనిని 'పరిష్కరించే' పనిని అరాజ్యవాదులకే వదలిపెడుతూన్నారు. సింహాన్ని కేసరాలు పట్టుకుని ఎదిరించినట్లుగా, యీ సమస్యను ఏంగిల్సు ప్రత్యక్షంగా యెదుర్కొంటాడు. రాజ్యాంగయంత్రంయొక్క విప్లవశక్తిని, అంటే పాలకవర్గంగా యేర్పడిన సాయుధమైన శ్రామికవర్గం

యొక్క విప్లవశక్తిని యింకా అధికంగా ఉపయోగించుకొని వుండవలసిందిగాదా ?

విప్లవంలో శ్రామికవర్గంయొక్క కర్తవ్యాలు యెట్లాంటివి? అనే ప్రశ్నవచ్చేటప్పటికి నేటి సోషల్ డెమోక్రాట్లు భుజాలు కుదించుకుంటూ, కుతర్కంతో, తప్పించుకొనేందుకు. " కొంచెం ఆగిచూడదంటె, " అంటూన్నారు. విప్లవంకోసమై శ్రామికవర్గాన్ని తయారుచేయవలసిన తమ కర్తవ్యాన్ని తప్పించుకొని, యిట్లాంటి సోషల్ డెమోక్రాట్లు ద్రోహంచేసేరని అనడంలో అరాజ్వాదులదేమీ తప్పులేదు. గడచిన యీ శ్రామికవర్గవిప్లవంయొక్క అనుభవాల్ని ఉపయోగించుకొని, ఏంగిల్సు, బ్యాంకుల విషయంలోనూ, రాజ్యాంగయంత్రం విషయంలోనూకూడా శ్రామికులు ఏమిచేయాలో, ఎట్లాచేయాలో అనేవాటినిగూర్చి సరియైన వివరణాన్ని యిచ్చేడు.

## 3. బెబెల్‌కు జాబు.

రాజ్యాంగయంత్రాన్నిగూర్చి మార్క్సు, ఏంగిల్సుల పరిశీలనలలో ఏకైకప్రాధాన్యంగలదికాకపోయినా, ప్రధానమైనవాటిలో ఒకటి, ఏంగిల్సు ౧౮౭౫ మార్చి ౧౮–౨౮ తేదీలలో బెబెల్‌కు వ్రాసిన జాబులోనుంచి యెత్తి వ్రాసిన క్రిందిభాగంలో వుంది. మనకు తెలిసినంతవరకు, ఈ జాబు బెబెల్ ప్రకటించుకొన్న స్వీయచరిత్రలోని రెండోభాగంలో (*My Life*) అది వ్రాయబడినతర్వాత ముప్పైఆరుసంవత్సరాలకు ౧౯౧౧ లో మొదటిమాటు బైటకువచ్చింది.

ఇదివరలో మార్క్సు, బ్రాకీకి జాబువ్రాస్తూ, 'గోథా–ప్రోగ్రామ్' ను విమర్శించేడు. అదే ప్రోగ్రామ్‌ను, ఏంగిల్సు, బెబెల్‌కు వ్రాసినజాబులో విమర్శించేడు. అందులోనూ ప్రత్యేకంగా, రాజ్యాంగయంత్రాన్ని గురించిన ప్రశ్నను ఉదాహరిస్తూ :

"    .    స్వతంత్రప్రజారాజ్యాంగం అనేమాట స్వతంత్ర రాజ్యాంగంగా మార్చబడింది. ఈ మాటల అర్థాన్ని వ్యాకరణ రీత్యా చూస్తే, 'స్వతంత్రరాజ్యాంగం' అంటే ప్రజలకు బాధ్యత వహించనట్టి నిరంకుశప్రభుత్వంతోగూడిన రాజ్యాంగమన్నమాట. యథార్థానికి 'రాజ్యాంగయంత్రం' అనిపించుకోతగని 'కమ్యూన్' యేర్పడిన తర్వాతనైనా రాజ్యాంగయంత్రాన్నిగూర్చిన యీ వాతాఖానీసంతసనూ ఒకమూల పారేయడం చాల అవసరం. అరాజ్వాదులు చాలాకాలంనుంచీ యీ 'ప్రజారాజ్యాంగయంత్రం' అనే మాటను మనమీద రుద్దేరు. ప్రౌఢోనును ఖండిస్తూ మార్క్సు వ్రాసిన పుస్తకంలోనూ, తర్వాత కమ్యూనిస్టు మేనిఫెస్టోలోనూ కూడా, సోషలిస్టు సమాజవిధానం ప్రవేశపెట్టబడిన తర్వాత రాజ్యాంగయంత్రం దానంతటదే కరిగి పోతుందనీ, (*Sich auflost*), అదృశ్యమై పోతుందనీ, స్పష్టంగా చెప్పబడేవుంది." మన ప్రత్యర్థుల్ని బలాత్కారంగా అణిచివేయడానికై, విప్లవంలో ఉపయోగింపబడవలసిన తాత్కాలికసంస్థయే, రాజ్యాంగయంత్రము: అందువల్లనే స్వేచ్ఛగల, ప్రజాసమ్మతమైన, రాజ్యాంగయంత్రాన్నిగూర్చి మాట్లాడుట కేవలమూ అసంగతము. రాజ్యాంగయంత్రం ఉండాలని, శ్రామికవర్గము కోరుతూన్నంత కాలమూ, దానిని స్వాతంత్ర్య రక్షణకైగాక, తన ప్రత్యర్థుల్ని అణిచివేయడానికిమాత్రమే ఉండాలంటూంది; స్వాతంత్ర్యాన్ని గురించి మాట్లాడడానికి అవకాశం వచ్చిందనగానే, వెనుకటి రూపంలో రాజ్యాంగయంత్రమే అంతరిస్తుంది. అందుచేతనే మనం, 'రాజ్యాంగయంత్రము' అనే మాటకు బదులుగా ప్రతీచోటాకూడా, 'కమ్యూనిటీ' అనే పదాన్నే ఉపయోగించమంటాము. ఇది, 'కమ్యూన్' అనే ఫ్రెంచిమాటకు సరియైన చక్కని, పురాతన జర్మన్‌పదము." (జర్మన్ ప్రతిలో ౩౨౧.—౩౨౨ పేజీలు.)

". . .రాజ్యాంగయంత్రంయొక్క సరియైన అర్థాన్నిబట్టిచూస్తే, కమ్యూన్‌ను రాజ్యాంగయంత్రం అనడానికి ఎంతమాత్రమూవీలులేదు." సిద్ధాంతరీత్యాచూస్తే, ఏంగెల్సుయొక్క అతిముఖ్యమైన వివరణ, యిదే. పై విషయాలన్నీ చూసినతర్వాత యీ వివరణము చాల సులభగ్రాహ్యము. ప్రజలలో అధికసంఖ్యాకులను అణిచిపెట్టడం మానేసి, స్వల్పసంఖ్యాకులనే (దోపిడీగాండ్లనే) అణిచిపెడుతూ వుండడంవల్ల 'కమ్యూన్'ను 'రాజ్యాంగయంత్రం' అనడానికి వీలులేదు. అది బూర్జువారాజ్యాంగ యంత్రాన్ని ముక్కలుచేసేసింది. అణిచిపెట్టే సాధనంగా రాజ్యాంగ యంత్రంలో ప్రత్యేకంగా వుంచిన సైన్యానికి బదులుగా, కమ్యూన్‌లో ప్రజలే సాయుధులై ముందుకువచ్చి నిలవబడతారు. దానియొక్క సరియైన అర్థాన్నిబట్టిచూస్తే, రాజ్యాంగయంత్రానికీ, కమ్యూన్‌కూ చాలాభేదంవుంది. కమ్యూన్ యింకా బలపడి, మరికొంతకాలం సాగివున్నట్లైతే, రాజ్యాంగ యంత్రంతాలూకు సాధనాలు కమ్యూన్‌లో యింకా మిగిలియున్నవికూడా వాటంతట అవే నశించిపోయివుండును; రాజ్యాంగయంత్రం యొక్క సంస్థల్ని, కమ్యూన్, స్వయంగా ఎత్తివేయవలసియుండేదికాదు; చేయడానికి పనేమీలేకపోవడంవల్ల ఒక్కొక్కటే ఆ సంస్థలన్నీ నిలిచిపోయివుండేవి.

## 4. మార్క్సు వ్రాసిన "ఫ్రాంసులో అంతర్యుద్ధము" నకు 1891 లో ఏంగెల్సు వ్రాసిన భూమిక.

"ఫ్రాంసులో అంతర్యుద్ధము"యొక్క మూడవకూర్పుకు భూమికను వ్రాస్తూ, (ఇది ౧౮౯౧ మార్చి ౧౮వ తేదీని వ్రాయబడి, మొదట్లో న్యూ జీట్‌లో ప్రచురించబడింది.) ఏంగెల్సు, రాజ్యాంగయంత్రంపట్ల తన వైఖరిని వ్యక్తపరుస్తూ, ముఖ్యములైన అనేక యితరవిశేషాంశాల్నికూడా యిచ్చేడు. అందులోనే, కమ్యూన్‌యొక్క అనుభవాల్నిగురించి అద్భుతంగా వ్రాసేడు. కమ్యూన్ తరువాత అప్పటివరకూ జరిగిన యిరవై సంవత్సరాల

అనుభవమూ ఏంగెల్సు వ్రాతకు గంభీరత్వాన్ని కలుగచేసింది. జర్మనీలో 'రాజ్యాంగయంత్రంయెడల మూఢవిశ్వాసం' విరివిగా వ్యాపించివుంది; దానిని నాశనంచేయడానికే ఏంగెల్సు యీ వివరణను ఉద్దేశించేరు. ఏంగెల్సుయొక్క యీ వివరణమే, యిక్కడ చర్చించబడ్డ సమస్యపైన, మార్క్సిజమ్‌యొక్క 'కడపటి వివరణ' మని చెప్పవచ్చును.

. ... ఏంగెల్సు ప్రాముఖ్యతనిచ్చిన కొన్నిపారాలను యిక్కడ యిస్తూన్నాను.

" . పూర్వపుకేంద్రీకృత ప్రభుత్వముయొక్క యీ పీడనాధికారాన్నే,— సైన్యము, పోలీసు, ఉద్యోగ వర్గాలు లో నెపోలియన్‌చేత సృష్టించబడి, అప్పటినుంచీ ప్రతినూతనప్రభుత్వంచేతా విరోధులపై ప్రయోగించబడుతూవచ్చిన ప్రధానాయుధమైన అధికారివర్గమూ, యీ మూడింటినీ,— పారిస్‌లో యీవరకే కూలద్రోసినట్లు, ఫ్రాంసు అంతటా కూలద్రోయాలి."

"కూలీవర్గము, అధికారంలోకివచ్చినతర్వాత పూర్వపురాజ్యాంగయంత్రాన్నే నడిపించుచూ ముందుకుబోలేదని, కమ్యూన్, తప్పని సరిగా గుర్తించవలసివచ్చింది; నూతనంగా జయించిన అధికారాన్ని పోగొట్టుకొనకుండా వుండాలంటే, కూలీవర్గం, ఒకవైపున అంతవరకూ తనమీద ప్రయోగించబడుతూన్న పీడనా సాధనాలనన్నిటినీ తొలగించివేయాలి; రెండోవైపున, తన స్వంత ప్రతినిధులూ, ఉద్యోగులూ,— వీళ్లనుంచి జాగ్రత్తపడడానికై,— ఉద్యోగులందరూ యేక్షణమందైనా సరే తొలగించబడడానికి లోనై వుంటారని ప్రకటించాలి.......... .."

ఒక్క నిరంకుశరాజరికంలోనే గాకుండా ప్రజాతంత్రప్రజాస్వామ్యంలోకూడా,రాజ్యాంగయంత్రంరాజ్యాంగయంత్రంగానేవుంటూందనీ,అంటే,— 'సమాజసేవకులు' 'సమాజప్రతినిధులు' అయిన ఉద్యోగులనేసమాజానికి

యజమానులుగాచేసే ముఖ్యలక్షణాన్నీ, ప్రత్యేకస్వభావాన్నీ రాజ్యాంగ యంత్రం అట్టేపుంచుకుంటూందని ఏంగెల్సు మరీమరీ నొక్కిచెప్పేడు.

> “ ... ఇంతవరకూ వున్న ప్రభుత్వపద్ధతులన్నిటిలోనూ తప్పనిసరిగావున్న యీ లక్షణానికి (రాజ్యాంగయంత్రమూ, దాని వివిధఅంగములు) వ్యతిరేకంగా, అంటే సమాజానికి సేవకులుగా వుండడానికిమారు యజమానులుగా వుంటూన్న రాజ్యాంగయంత్ర శాఖలలోని ఉద్యోగులప్రాబల్యానికి వ్యతిరేకంగా, కమ్యూన్, రెండువిరుగుడులు ప్రయోగించింది. మొదట్లో, అన్నిపదవులకూ, పరిపాలనా, న్యాయవిద్యాశాఖలన్నింటికీకూడా ఉద్యోగులు సార్వజనికమైన వోట్లచే యెన్నుకోబడాలనీ. ఈ వోటర్లందరూ తమ యిష్టంవచ్చినప్పుడు యీ ఉద్యోగుల్ని తొలగించ నధికారం గలిగి వుంటారనీ, కమ్యూన్ ప్రకటించింది. రెండోది, పెద్దాచిన్నా అనకుండా ఉద్యోగులందరికీకూడా సామాన్యకూలీల కివ్వబడే వేతనాలే యివ్వబడాలని శాసించింది. అది యిచ్చిన జీతాలన్నిటిలోకీ పెద్దది, సంవత్సరానికి ౬౦౦౦ ఫ్రాంకులు. ఈ విధంగా ప్రతినిధి సంస్థలన్నిటిలోను నియోజించబడినవాళ్లను శాసిస్తూచేసిన చట్టములకు అదనంగా యీ పద్ధతిని (జీతాలు తక్కువయిచ్చుట) జరుపరుచుటచేత పదవులకు ప్రాకులాడడం, వుద్యోగాలకు దేబిరించడం కూడా నిర్మూలించబడినాయి ”

ఇక్కడకు వచ్చేటప్పటికి సుసంగతమైన ప్రజాతంత్రము ఒక ప్రత్యేకదశకు అభివృద్ధిచెందింది. అది, ఒకవైపున సోషలిజంగా మార్పుచెందుతూ, రెండోవైపున సోషలిజం ప్రవేశపెట్టబడుటకు తగిన పరిస్థితుల్ని కల్పిస్తూ, సోషలిజం ప్రవేశపెట్టబడుటకై ఒత్తిడిచేస్తూంది. ఏంగిల్సు, దీనిని స్పష్టంగా గుర్తించేడు. రాజ్యాంగయంత్రాన్ని నిర్మూలించడానికి, ప్రభుత్వకార్యాల్ని చాలసౌలభ్యంగా, అంటే సాధారణజనసమూహాని

కంతటూ అందువాటులోవుండేటట్లు, రెక్కలుచూడడం, పరిశీలించడం, మొదలైనవాటినిగా చేయవలసివుంటుంది; ఇంకోటేమిటంటే, పెట్టుబడిదారీ దేశాల్లో నిరంతరమూ జరుగుతూన్నట్లుగా, లాభకరం గాకపోయినా 'గౌరవప్రదమైనట్టి' యేదో ఒక ప్రభుత్వోద్యోగస్థానంలోచేరి, దానిపై పుద్యోగంలోనికో, బ్యాంకులు, జాయింటు స్టాక్ కంపెనీలు మొదలైన వాట్లలోని లాభకరమైన యే పెద్దపదవిలోనికో పోయేటందుకు దీనిని మెట్టుగా పుపయోగించుగోకుండా వుండేటట్లుగా, పదవీకాంక్షకు స్థానం లేకుండా చేయాలి

ఏంగెల్సు, యిట్లా వ్రాసెను :

" .. పూర్వపురాజ్యాంగయంత్రంయొక్క యీ విచ్ఛేద నమున్ను (*Sprengung*), దానిస్థానంలో నూతనమునూ, నిజంగా ప్రజాతంత్రయుతమున్నూ అయిన మరొక విధానమును ప్రవేశ పెట్టుటయున్నూ, 'ఫ్రాంసులోని అంతర్యుద్ధము' యొక్క మూడోభాగంలో విశదంగా వర్ణించబడివుంది. కాని, ఆ నూతన విధానాన్ని ప్రవేశపెట్టుటనుగూర్చి క్లుప్తంగా తిరిగి యిక్కడ వ్రాయడం అవసరము. ఎందుచేతనంటే, జర్మనీదేశంలో, రాజ్యాంగ యంత్రంపట్ల మూఢవిశ్వాసము, శాస్త్రగ్రంథాల్లోనుంచి, బూర్జువా వర్గం యొక్కేగాకుండా కూలీలయొక్కకూడా నిత్యజీవితాల్లో పాదుకొంది. తాత్త్వికభావనను బట్టి చూస్తే, రాజ్యాంగయంత్ర మంటే 'భావముయొక్క ప్రత్యక్షరూపము' లేదా, తాత్త్వికపరి భాషలోనికిపోతే 'భూలోకంలో ఈశ్వరరాజ్యం' అన్నమాట. అంటే శాశ్వతమైన సత్యము, న్యాయము యెక్కడ నివాసంగావుంటాయో లేక వుండేటట్లుచేయగలమో ఆ ప్రదేశం అని అర్థం. ఈ భావన వల్లనే, రాజ్యాంగయంత్రంపట్లా, దానికి సంబంధించిన ప్రతీదాని పట్లా ప్రజలకు మూఢభక్తి విశ్వాసాలు కలిగేయి. రాజ్యాంగ

యంత్రమూ, దానితాలూకు పెద్దపెద్దజీతాలు తీసికొనేఉద్యోగులూ, వీటివల్లగాక అంటే ప్రస్తుతం అమల్లోవున్న పద్ధతివల్లగాక యింకే యితరపద్ధతివల్లాకూడా సమాజానికంతటికీ కావలసిన ప్రయోజనములూ, సామాన్యకార్యాలూ జాగ్రతగా నిర్వహించబడజాలవనే అభిప్రాయానికి ప్రజలు తమ చిన్ననాటినుంచీ దాసులౌతావడంవల్ల యీ మూఢభక్తివిశ్వాసాలు మరీ బలపడతాయి. వంశక్రమానుగతమైన రాజరికాన్నుంచి విదిలించుకొని,ప్రజాతంత్ర ప్రజాస్వామ్యంలో పాల్గొనేటప్పటికే, ప్రజలు తామొక ఘనకార్యాన్ని చేసినట్లు, గొప్ప మార్పుతేవడానికై ముందడుగువేసినట్లు. తలుస్తారు. కాని, యదార్థం ఆలోచిస్తే, రాజరికంలోకివలెనే ప్రజాతంత్ర ప్రజాస్వామ్యంలోకూడా రాజ్యాంగయంత్రం, వర్గపీడనకే సాధనంగా వుంటూంది. వర్గాధికారానికై జరిగే పోరాటాల్లో జయించిన తర్వాత దుష్టమైన రాజ్యాంగయంత్రమే శ్రామికవర్గానికి సంక్రమిస్తుంది. అప్పుడు, జయశీలమైన శ్రామికవర్గంకూడా కమ్యూన్‌కు వలెనే, రాజ్యాంగయంత్రంయొక్క మిక్కిలీ దుష్టమైన అంగాల్ని వెంటనే ఛేదిస్తుంది; తరువాత నూతనతరం బయలుదేరి, నవీనములూ, స్వేచ్ఛాయుతములూ అయిన సామాజికపరిస్థితుల్లో పెరిగి, యీ రాజ్యాంగయంత్రం అనే చెత్తను పెంటకుప్పమీద పారేసే సమర్థతగలది అవుతుంది."

ఆరవ ప్రకరణమునుండి ఉద్ధృతము.

## ఒదుగుబాటుదారులు మార్క్సు సిద్ధాంతాలను వికృతంగా చేయడం

'ప్రిన్సిపల్స్ ఆఫ్ ఎవల్యూషనరీ సోషలిజం' అనే తన గ్రంథంలో బెర్న్‌స్టీన్, మార్క్సిజమ్ బ్లాంకిజమ్‌లోకి దిగిందని నిందించేడు.

(తరువాత విప్లవకరమైన మార్క్సిజానికీ ప్రతినిధులైన బోల్షివిక్‌లమీద రష్యాలోని ఒడుగుబాటుదారులచేతా, బూర్జువా ఉదారవాదులచేతా యీ నిందే అనేకసార్లు మోపబడింది.) ఈ సందర్భంలో బెర్న్‌స్టీన్ ప్రత్యేకంగా మార్క్స్ వ్రాసిన "ఫ్రాన్సులో అంతర్యుద్ధము" ను తీసికొని, కమ్యూన్ వల్ల నేర్చిన గుణపాఠాలవిషయమై మార్క్స్, ప్రౌఢాన్ లు యేకీభవిస్తూన్నారని, మనం యిదివరలో చూసినట్లుగా చూపయత్నించి విఫలుడైనాడు. "కూలీవర్గము, కేవలమూ సిద్ధంగా అమర్చివుంచబడిన రాజ్యాంగయంత్రాన్ని స్వాధీనంచేసుకొని తన స్వోపయోగానికై నడిపించలేదు." అంటూ మార్క్స్ ఒక పర్యవసానానికి వచ్చేడు; ఈ విషయాన్నే, ౧౮౭౨ లో కమ్యూనిస్టు మేనిఫెస్టోకు వ్రాసిన పీఠికలో బలపరచేడు. మార్క్సుయొక్క యీ సిద్ధాంతం మీదికే బెర్న్‌స్టీన్ తన దృష్టిని మళ్లించేడు.

ఈ వాక్యం బెర్న్‌స్టీన్‌కు యెంతో సంతోషాన్ని కలుగచేయడంవల్ల కాబోలు, దీనిని తన గ్రంథంలో మూడుచోట్ల వ్యాఖ్యానంచేసేడు. కాని అతని వ్యాఖ్యానం చాలవిరూపమైనదై, ఒడుగుబాటుతత్వాన్ని వ్యక్త పరుస్తూవుంది.

కూలీవర్గము, రాజ్యాంగయంత్రాన్నంతనీ ఛేదించి, బద్దలుకొట్టి, ఎగురగొట్టేయాలని మార్క్స్ ఉద్దేశ్యమైనట్లుగా యిదివరలోచూసేవున్నాము. (*Sprengen=blow up* అనే మాటను ఏంగిల్సు ఉపయోగించేడు.) కాని, బెర్న్‌స్టీన్ యీ మాటలకుచేసిన వ్యాఖ్యానాన్ని బట్టి చూస్తే, 'అధికారాన్ని స్వాధీనంచేసికొనేటపుడు అత్యధికవిప్లవౌత్సుక్యం చూపకు' దని మార్క్స్ కూలీవర్గాన్ని హెచ్చరించేడా, అనిపిస్తూంది.

మార్క్సుయొక్క వ్రాతలకు యింతకంటె అసభ్యములూ, అగౌరవప్రదములూ అయిన పెడర్థాల్ని మరెవరూ ఊహించనైనారేరు.

.. .ఈ సమస్యవిషయంలో కాట్స్కీ యిట్లా చెపుతాడు: "జయశీలమైన శ్రామికవర్గము ప్రజాతంత్రకార్యక్రమాన్ని సాధించి,

అనుభవానికి తెచ్చుకుంటుంది."ఇట్లాచెపుతూ దాని వివరాలను ఒక్కొక్కటే యేకరువుబెట్టేడు. కాని, బూర్జువాప్రజాతంత్రం యొక్క స్థానంలో శ్రామికవర్గప్రజాతంత్రాన్ని స్థాపించాలని, ౧౮౭౧ సంవత్సరంలో మనం నేర్చుకొన్న గుణపాఠాన్నిగూర్చి, ఒక్కమాటకూడా ఆడలేదు ...

... .. ఈ ముఖ్యవిషయాన్ని గురించి యెత్తుకోకపోవడం వల్ల, కాట్స్కీ, యిందులోనే ఒదుగుబాటుతత్త్వానికి త్రోవయిచ్చేడు ....

"కమ్యూన్, ఒక పార్లమెంటరీసంస్థగా వుండరాదు; పనిచేసే సంస్థగా అంటే శాసననిర్మాణాన్నీ, కార్యానిర్వహణాన్నీకూడా ఒకేసారి నిర్వహించేదిగా వుండాలి." అన్న మార్క్సుమాటల్ని గురించి, కాట్స్కీ ఆలోచించనేలేదు.

... (ప్రజలకు వ్యతిరేకమైన) ఉద్యోగివర్గముతో (ప్రజలకు గాని) ప్రజాతంత్రాన్ని కలిపే బూర్జువా పార్లమెంటారిజమ్‌కున్నూ; ఉద్యోగీయవర్గాన్ని సమూలంగా నాశనంచేసి, తన కార్యాన్ని కొనసాగ వలసినంతవరకూ కొనసాగించే, అంటే ప్రజలకొరకైన ప్రజాతంత్రాన్ని పూర్తిగా యేర్పాటుచేయడానికి యత్నించే, శ్రామికవర్గ ప్రజాతంత్రానికీ గల భేదాన్ని కొంచెమైనా కాట్స్కీ గ్రహించనేలేదు.

ఇక్కడ, 'రాజ్యాంగయంత్రంపట్ల పూర్వకాలపు 'మూఢభక్తినీ', ఉద్యోగీయవర్గంయెడల 'మూఢవిశ్వాసాన్నీ' తిరిగి కాట్స్కీ ప్రదర్శించేడు.

కాట్స్కీ, మార్క్సిజమ్‌నుంచి ఒదుగుబాటుతత్వానికి దిగిపోయేడు. ఒదుగుబాటుదారులు రాజ్యాంగయంత్రాన్ని నాశనంచేయడానికి యిష్టపడరు. అల్లే, యీతడుకూడా, రాజ్యాంగయంత్రాన్ని నాశనంచేయడాన్నిగురించి యెత్తుకోనేలేదు.. ........

బూర్జువావర్గంతో అనేకసంబంధాలు కలిగివుండి, పరిపాటియైన నిత్యకృత్యాలతోనూ, మాంద్యతతోనూ నిండివున్న పూర్వపురాజ్యాంగ యంత్రమే ఉండాలా? లేదా, దాన్ని నాశనంచేసి మరొక నూతనపాలనా

యంత్రాన్ని స్థాపించాలా? అనేదే, ముఖ్యమైనవిషయం. విప్లవంఅంటే, యింకో నూతనవర్గం, వెనుకటి రాజ్యాంగయంత్రంతోటే ప్రభుత్వాన్ని సాగిస్తూ, పరిపాలనచేయడంగాదు; యీ నూతనవర్గం వెనుకటి రాజ్యాంగ యంత్రాన్ని నాశనంచేసి, మరొక నూతనపరిపాలనాయంత్రంతో ప్రభుత్వాన్ని నడిపించడమే విప్లవంలో ముఖ్యవిషయం. మార్క్సిజములోని యీ మూలసిద్ధాంతాన్ని కాట్స్కీ కప్పిపుచ్చడమో, లేక అవగాహనచేసికోలేక పోవడమో, జరిగింది

. . కాట్స్కీ చెప్పినదాన్నిబట్టి, సోషలిజమ్ వచ్చేకకూడా యెన్నుకోబడిన ఉద్యోగులు వుంటారు గనుక ఉద్యోగవర్గం, ఉద్యోగీయ తత్త్వంకూడా అట్లేవుంటాయని యెవరైనా పొరపాటుబడవచ్చును। ఇది శుద్ధతప్పు సోషలిజంక్రింద కార్యనిర్వాహకులు 'ఉద్యోగులు' గానూ, 'ఆఫీసర్లు' గానూ వుండరనియూ,— యెన్నుకోబడడం, ఎప్పుడులడితే అప్పుడు వోటర్లచేత తిరిగి పిలిపించబడుటకు లోబడివుండడం, జీతాలు కూడా సాధారణకూలీల జీతాలతో సమానంగా మాత్రమేపొందడం,— వీటికితోడు, పార్లమెంటరీ సంస్థల్ని తొలగించి, వాటిస్థానే 'పనిచేసే సంస్థల్ని' అంటే శాసననిర్మాణాన్ని, కార్యనిర్వహణాన్నికూడా ఒకేసారిగా చేసే సంస్థల్ని స్థాపించడం,— వీట్లన్నిటివల్లా పూర్వపుపద్ధతిఅంతా తొలగించబడి తీరిందని, కమ్యూన్‌యొక్క ఉదాహరణను తీసికొని మార్క్సు ఋజువుచేసేడు.

కాట్స్కీయొక్క వాదనలన్నీ, అందులోనూ ముఖ్యంగా 'మన పార్టీల్లోనూ, కార్మికసంఘాల్లోనూకూడా ఉద్యోగులులేనిదే మనం ఏమీ చేయనేలేకపోతాము' అనే వింతవాదననిచూస్తే, పూర్వం బెర్న్‌స్టీన్, మార్క్సిజానికి వ్యతిరేకంగా చేసిన 'వాదనలనే' తిరిగి యీతడు యేకరువు పెడుతూన్నాడని తెలుస్తుంది, స్వవచనవ్యాఘాతుకమైన 'ప్రిన్సిపల్స్ ఆఫ్ ఎవల్యూషనరీ సోషలిజమ్' అనే తన పుస్తకంలో, బెర్న్‌స్టీన్ 'ఆదిమ

కాలపు ప్రజాతంత్రభావాన్ని యెదిరించేది దానినే అంటూ, "సిద్ధాంత రూపమైన ప్రజాతంత్రం" అని పిలుస్తూ, ఆజ్ఞాపూర్వకమైన ఉత్తరువులు, ప్రతిఫలించలేని కార్యనిర్వాహకులు, అధికారంలేని కేంద్రప్రతినిధి సంస్థలు, మొదలైన వాట్లను యెదుర్కొన్నాడు.

బూర్జువావర్గంలో విప్లవకరంగా చెప్పేపోవడాన్ని కమ్యూన్ చర్యలలో మార్క్సు చూసేడు. విమర్శనాబుద్ధితోనూ, వివరణాసామర్థ్యంతోనూ మార్క్సు పరిశీలించేడు కాబట్టి దీనిని గుర్తించేడు. పిరికితనంచేతనూ, బూర్జువావర్గంతో తీవ్రసంఘర్షణలోకి దిగడానికి యిష్టంలేకనూ, ఒదుగుబాటుదారులు కమ్యూన్‌యొక్క యీ యెదడాయిని గుర్తించలేకపోవడమేకాక దీనినుంచి భయపడినారు; దీనినే అరాజ్యవాదులు, తొందరపాటుచేతనో, మహత్తరమైన సామాజికపరిణామనియమాన్ని గ్రహించడానికి సామర్థ్యంలేకనో గుర్తించ నిష్టపడకున్నారు.

ఈ రెండువిధాలైన తప్పులనూ తప్పించుకొనేపద్ధతిని మార్క్సు మనకు బోధిస్తున్నాడు. వెనుకటి రాజ్యాంగయంత్రాన్ని పూర్తిగా నాశనం చెయ్యడంలో జంకులేని ధైర్యాన్ని నేర్పుతున్నాడు. అదేసమయంలో క్లిష్ట సమస్యలకు యథార్థరూపంలో సమాధానం యిచ్చేపద్ధతిని బోధిస్తున్నాడు; ఉద్యోగీయవర్గాన్ని మూకలపెళ్లతో పెల్లగించడానికి తగిన కట్టుదిట్టాల్ని చేయడంద్వారా, ప్రజాతంత్రపద్ధతిని విశాలంచేసి, కొద్దివారాల్లోనే నూతనమైన శ్రామికవర్గ రాజ్యాంగయంత్ర నిర్మాణానికి కమ్యూన్ పూనుకొంది. మనము, కమ్యూనార్డులనుంచి విప్లవకరమైన ధైర్యాన్ని నేర్చుకోవాలి; అనుభవపూర్వకమైన వాళ్ల యత్నాలలో శీఘ్రసాధ్యములూ, తక్షణ ఆవశ్యకములూ అయిన పద్ధతులు సూచించబడినాయి. ఉద్యోగీయవర్గంయొక్క సంపూర్ణనాశనానికి, మనం యీ మార్గంద్వారానే పోవాలి.

౫

# “శ్రామిక విప్లవమూ: స్వపక్షద్రోహియైన కాట్స్కీ,” నుండి ఉద్ధృతము.

## 1. మార్క్సును మోసగాడగు ఉదారవాదిగా, కాట్స్కీ ఎట్లు ప్రదర్శించినదీ.

పారిస్ కమ్యూన్ కూడా శ్రామికవర్గనియంతృత్వమేకాని అది సార్వజనికమైన వోట్లచే యెన్నుకోలబడింది. అంటే బూర్జువావర్గానికి కూడా, వోటుహక్కు తొలగించకుండా, ‘ప్రజాతంత్రపద్ధతిమీద’ యెన్నుకోలబడింది. కాట్స్కీ ఉప్పొంగిపోయి, “స్వచ్ఛమైన ప్రజాతంత్రవిధానంలోని వోటర్లలో అత్యధికసంఖ్యాకులు శ్రామికులైనపుడు ఫలితంగా శ్రామిక వర్గనియంతృత్వం యేర్పడుతుందని మార్క్స్ ఉద్దేశ్యం” అని ప్రారంభించేడు. (౨౧ పేజీ)

ఈ వాదనచూస్తే ఎవరికైనా ‘నదమంత్రపుసిరి దొరికినంత’ ఖులాసాపుట్టుకొస్తుంది. మొదటిది, బూర్జువావర్గంలో చెప్పుకోతగ్గవాళ్లూ, వాళ్ల ఉద్యోగులూ, అంతాకూడా పారిస్‌నుండి వెర్సేలిస్‌కు పారిపోయేరని అందరికీ తెలిసినవిషయమే. అక్కడ వెర్సేలిస్‌లో, ‘సోషలిస్టు’ అయిన లూయీబ్లాంక్ కూడా వున్నాడు. ఈ విషయంవల్లనే ‘అన్నిరకాల’ సోషలిస్టులూకూడ కమ్యూన్‌లో పాల్గొన్నారని కాట్స్కీ చెప్పినమాటల్లోని

అబద్ధం వెల్లడిఅవుతూంది. పారిస్ ప్రజలందరూ రెండువిభాగాలైపోయి, తీవ్రపోరాటాన్ని కొనసాగిస్తూంటే, అందులోనూ బూర్జువాపక్షంలోని యోధులూ, రాజకీయాల్లో చురుకుగాపనిచేసేవాళ్లూ ఒకపక్షంలో గుమిగూడి వుండగా, ఈ విభాగాన్ని 'స్వచ్ఛమైన ప్రజాతంత్రమనీ' 'సార్వజనీనమైన' వోటుహక్కులోగూడినదనీ చెప్పడం హాస్యాస్పదంగాదా?

రెండోది, కమ్యూన్, వెర్సైల్స్ ప్రభుత్వంతో పోరాటంలోవుంది. ఫ్రాన్సులో పారీలప్రభుత్వం బూర్జువాప్రభుత్వంతో కూడింది. ఫ్రాన్సు యొక్క అదృష్టాన్ని పారిస్కమ్యూనే నిర్ణయించియున్నట్లైతే యీ 'సార్వజనీనమైన' వోటింగుహక్కునుగానీ, 'స్వచ్ఛమైన ప్రజాతంత్రానికీ,' యెట్లాంటి అవస్థపట్టివుండేదో! ఫ్రాన్సుకంతకీచెందిన 'బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్సు'ను స్వాధీనంచేసుకోకపోవడంలో, కమ్యూన్ చాల గొప్ప పొరపాటు చేసిందని మార్క్స్ తనఅభిప్రాయాన్ని వెలిబుచ్చినపుడు అతడు 'స్వచ్ఛమైన ప్రజాతంత్రం' యొక్క సిద్ధాంతాల్ని, అచంణావిధానాన్ని గణనచేసేడా? పదిమందికలిసి యేదైనా పనిచేయడానికిగాని, చివరకి నవ్వుకోడానికిగాని వీలులేకుండా పోలీసువాళ్ళనిర్బంధాలు కొనసాగుతూన్న దేశంలోవుండి యీ పుస్తకాన్ని వ్రాసేడుగనక కాట్స్కీ బ్రతికిపోయేడు. లేకపోతే ప్రతీచోటా ప్రజలు యీతడికి తాటాకులుకట్టి యేడిపించి వుండేవాళ్లు.

'స్వచ్ఛమైన ప్రజాతంత్రం' యొక్క దృక్పథాన్నుంచి యేంగిల్సు కమ్యూన్నుగురించి చెప్పినమాటల్ని జ్ఞాపకంతెచ్చుకోమని, మార్క్స్-ఏంగిల్సుల సిద్ధాంతాలు కంఠతాపట్టిన కాట్స్కీని కోరుతూన్నాను.

"ఈ పెద్దమనుష్యులు విప్లవాన్ని ఎప్పుడైనా చూసేరా? అసలు విప్లవంఅంటేనే అధికారపూరితమైనది. దీనిలో సందేహం ఏమీ లేదు. విప్లవంఅంటే యేమిటి? ప్రజలలోని ఒకభాగం మరొక భాగంమీద తనయిచ్ఛను తుపాకులు, సనీలు, ఫిరంగులు మొద

రైన సాధనాలద్వారా అంటే మిక్కిలీ అధికారపూరితములైన సాధనాలద్వారా విధించడమే. విప్లవం. ఇందులో జయించిన పక్షం, తన ఆయుధబలంవల్ల విప్లవప్రతిఘాతులలో భయాన్ని కలుగచేసే, తనఅధికారాన్ని నిలుపబెట్టుకుంటుంది. బూర్జువావర్గానికి వ్యతిరేకంగా సాయుధులైన ప్రజలయొక్క అధికారబలం మీదనే ఆధారపడి వుండకపోతే, పారిస్‌కమ్యూన్ ఒక్కరోజైనా నిలువలిగి వుండగలిగేదా? అంతేగాక. పారిస్‌కమ్యూన్, తన యీ అధికారాన్ని తగినంతగా వినియోగించలేదని. మనం విమర్శించడంలేదా?

ఇదుగో! ఇక్కడేవుంది, మీరుచెప్పే 'స్వచ్ఛమైన ప్రజాతంత్రం' వర్గాలుగా విభజించబడిన సమాజంలో 'స్వచ్ఛమైన ప్రజాతంత్రం' సంగతిని మాట్లాడ సాహసించిన యీ పెట్టీబూర్జువాసోషల్ డెమాక్రాటు యొక్క తెలివితక్కువను (౧౯ వ శతాబ్దంలో నాలుగో పదిలోని ఫ్రెంచి సోషల్ డెమాక్రసీ, ౧౯౧౪—౧౯ సంవత్సరాల్లోని యూరోపియను సోషల్ డెమాక్రసీ ఉద్దేశించి) ఏంగిల్సు ఎంతగా పరిహసించేవాడో గదా!

ఇంతతోచాలును. కౌట్స్కీ. మాట్లాడిన అసంగతములనన్నిటినీ యేకరువుపెట్టడం సాధ్యంగాదు. ఎందుచేతనంటే, ఆతని నోటవచ్చే ప్రతీమాటాకూడా పరస్పరవిరుద్ధంగానే వుంటుంది గనుక.

మార్క్సు, ఏంగిల్సులు అతివివరంగా పారిస్‌కమ్యూనును పరిశీలించేరు ప్రస్తుతపు రాజ్యాంగయంత్రాన్ని చితుకకొట్టి, బద్దలుకొట్టడానికి యత్నించడంలోనే కమ్యూన్ చేస్తున్నారు. ప్రజాతంత్రం యెక్కువ స్వచ్ఛం అవుతూన్నకొలదీ బూర్జువాల యీ పన్నాగాలు మరింతనేర్పుతో పన్నబడుతూ, యెక్కువ ఫలవంతము లౌతూన్నాయి. తద్వ్యతిరేకంగా, ప్రజాసామాన్యాన్ని అంటే దోపిడీచేయబడుతూన్నవాళ్ళని

పరిపాలనా కార్యాలలోనికి ఆకర్షించిన ప్రథమప్రభుత్వమే ప్రపంచానికంతకీ, సోవియట్ ప్రభుత్వము. (సరిగ్గా చెప్పాలంటే, సోవియట్ ప్రభుత్వము రెండోది. పారిస్ కమ్యూన్ యిట్టి ప్రయత్నాన్ని చేసినవాటిల్లో మొదటిది.) అనేక ఆటంకాలుకల్పించి కష్టజీవుల్ని బూర్జువాపార్లమెంట్లకు దూరంగానేవుంచుతూన్నారు. (బూర్జువాప్రజాతంత్రాల్లో, యే ముఖ్య విషయమూకూడా పార్లమెంట్లలో నిర్ణయించబడదు. అవన్నీకూడా స్టాక్ ఎక్స్చేంజి, బ్యాంకులు, మొదలైనవాటిల్లోనే నిర్ణయించబడుతూంటాయి.) అందువల్ల, బూర్జువాపార్లమెంట్లు, తమకు సంబంధించినవి కానేకాదనీ, తమను అణచిపెట్టి పీడించడానికి బూర్జువాలు ఉపయోగిస్తున్న సాధనాలు మాత్రమేననీ, తమ శత్రువర్గంయొక్క అంటే దోపిడీచేసే అల్పసంఖ్యాకులయొక్క సంస్థలనీ, శ్రామికులు బాగా గ్రహిస్తారు. ఇదంతా గమనించకుండా వుండేవాడు బూర్జువావర్గానికి సేవకుడేనా అయివుండాలి, లేదా రాజకీయంగా మృతుడేనా అయివుండాలి. బూర్జువాగ్రంథాల్లోని గూఢంగావున్నవిషయాల్లోని యాథార్థ్యాన్ని చూడలేని బూర్జువా ప్రజాతంత్ర భ్రమలో మునిగితేలి, వాటిని వంటబట్టించుకొన్నవాడై, యథార్థానికి బూర్జువావర్గానికి దాసుడవుతాడు.

దోపిడీచేయబడుతూన్న వర్గాలయొక్క దృష్టితో యీ సమస్యను చూడనివాడు యీ యథార్థాన్ని తెలుసుకోలేడు. ప్రపంచంలో యెక్కడైనా చివరకు ఎంతో ప్రజాతంత్రయుతంగా వుంటూందని చెప్పబడే బూర్జువా దేశాల్లో ఒక్కదానిలోనైనా సరే, సాధారణ కార్మికుడు, సాధారణ పల్లెటూరికూలీ, పల్లెటూరి పేదవాడు, (వీళ్లే ప్రజల్లో అత్యధికసంఖ్యాకులు) స్వతంత్రచ్ఛాయనైనా అనుభవించుతూన్నారా? సోవియట్ రిష్యాలో వలె తన అభిప్రాయాల్ని వ్యక్తపరచగలగడం, పెద్దపెద్ద ముద్రణాయంత్రాలూ, గోదాముల్లోవుండే కాగితపుబేళ్లు, వీట్లనుపయోగించుకొని, తన వర్గ ప్రయోజనాల్ని కాపాడుకోగలగడం, రాజ్యాంగయంత్రాన్ని నిర్మించడం,

దాన్ని నడపడం,— వీటిల్లో తమవర్గానికిజెందిన స్త్రీపురుషుల్ని నియోగించుకొనగలగడం,— వీటిసన్నిటినీ మరేదేశంలోనైనా చేయగలుగుతూన్నారా?

ఈ విషయాలసన్నింటినీ విన్నతర్వాత సమాధానంయివ్వడానికి సందేహించేవాడు, కార్మికుల్లోగాని, వ్యవసాయకూలీల్లోగాని, ఏదేశంలోనైనా సరే, కాట్కస్కి దొరుకుతాడా? బూర్జువాపత్రికలలోని వార్తాశకలాల్ని అప్పుడప్పుడుచదివి, ప్రపంచంఅంతట్లోనూ వుండేకష్టజీవులు సహజంగానే సోవియట్ రిపబ్లిక్ యెడల సానుభూతిని చూపుతూన్నారు. ఎందు వల్లనంటే, సోవియట్ రిపబ్లిక్; శ్రామికులదేనని వాళ్లుగ్రహించేరు. ఎంత ఉత్తమోత్తమం అయినా ప్రతీబూర్జువా ప్రజాతంత్రమూ కూడా ధనికులకే ఉపయోగిస్తూండడం, అట్లాగాక, సోవియట్ప్రజాతంత్రం కష్టజీవులైన పేదవాళ్లకొరకే ఉపయోగపడడం, వాళ్లుచూస్తూనే వున్నారు.

"మనం, పాలింపబడుతూన్నాము. మన రాజ్యాంగాన్ని బూర్జువా ఉద్యోగస్తులు, పెట్టుబడిదార్ల పార్లమెంట్లు, వాళ్ల జడ్జీలు, నడిపిస్తూన్నారు" అని ప్రతీబూర్జువాదేశంలోనూ, చివరకు యెంతో ప్రజాతంత్రయుతమైనవిగా తలచబడే బూర్జువాదేశాల్లోనూ, కోట్లకొలదీ పీడితవర్గాల ప్రజలు తమ నిత్యానుభవాలద్వారా తెలుసుకొంటూన్నారు; యిదే ప్రత్యక్షమూ, నిర్వివాదమూ ఆయిన సత్యమని వాళ్లు గ్రహించుకొంటూన్నారు. దీనికి వ్యతిరేకంగా, సోవియట్ రష్యాలో అధికారవర్గం పూర్తిగా నాశనంచేయబడింది; పూర్వపుజడ్జీలు అందరూ వాళ్లపీఠాలనుండి తరిమివేయబడ్డారు, బూర్జువా పార్లమెంటు పటాపంచలైపోయింది; యీ పార్లమెంటుకు బదులుగా కార్మికులూ, రైతులూ, అత్యధికప్రజాసమ్మతమైన ప్రాతినిధ్యాన్ని బడసేరు; అధికారవర్గంయొక్క స్థానాన్ని సోవియట్లు ఆక్రమించడం గాని, వాళ్లని తమ అదుపుఆజ్ఞల్లో పెట్టడం గాని జరిగింది; జడ్జీలను యెన్నుకోవడం కూడా సోవియట్లద్వారానే! ఎంతో ప్రజాతంత్రయుతంగా వుందనే బూర్జువా ప్రజాస్వామ్యం కంటేసూ సోవియట్ పరిపాలనే అంటే సోవియట్

రూపంలోవున్న శ్రామికవర్గనియంతృత్వమే కోటిరెట్లు అధికప్రజాతంత్ర యుతంగా వుందని. పీడితవర్గాల ప్రజలు భావించడంలో ఆశ్చర్యం ఏమీలేదు.

సామాన్యకూలీకి కూడా తెలిసే యీ సత్యాన్ని కాట్స్కీ గ్రహించ లేకపోయేడు. ఎందువల్లను? ఎట్లా ప్రశ్నించుకొంటే సరియైన సమాధానం వస్తుందా? అనేదే కాట్స్కీకి తెలియలేదు। ప్రజాతంత్రం ఏ వర్గానికి? 'స్వచ్ఛమైన' ప్రజాతంత్రం (దీనికి వర్గాలతో సంబంధమే లేదా? లేక. యిదివర్గాలకు అతీతమా?) అనీ. 'పౌరసత్వహక్కుల్లో సమానత్వం లేనిదే ప్రజాతంత్రమే వుండదు' అనీ. కాట్స్కీ చెప్పేటట్లైతే ఆతడిని. చదువు కొన్న 'మార్క్సిస్టు' 'సోషలిస్టు' అయిన కాట్స్కీని. ఒక్క ప్రశ్న వెయ్య వలసివుంటుంది. దోపిడీచేసేవాళ్లకూ, చేయబడేవాళ్లకూ సమానత్వం సాధ్యమా? రెండో యింటర్నేషనలులోని సిద్ధాంతవేత్తలకు నాయకుడైన కాట్స్కీ వ్రాసిన గ్రంథాన్నిగురించి చర్చిస్తూ. యీలాంటి చిన్నప్రశ్న వెయ్యడం చాలా అసందర్భంగానూ, అవిశ్వసనీయంగానూ కనిపించ వచ్చును కాని. యిట్లా ప్రశ్నించకతప్పదు. మరి. చదువుకున్నవాడే అయినా, కాట్స్కీనిగురించి వ్రాయడంలో. దోపిడీ చేసేవాళ్లకూ, చేయ బడేవాళ్లకూ సమానత్వం యెందువల్ల సాధ్యంకాదో అతనికే మనం బోధించవలసివుంటుంది।

## ౩. దోపిడీ చేసేవాళ్లకూ దోచుకోబడేవాళ్లకీ సమానత్వం సాధ్యమా?

"దోపిడీ చేసేవాళ్లెప్పుడూ, ప్రజలలో అత్యల్పసంఖ్యాకులుగానే వున్నారు," అని కాట్స్కీ చెపుతూన్నాడు. (పేజీ ౧౪)

ఇది అక్షరాలానిజం. మనవాదనను యిక్కడనుంచే ప్రారంభించు దాము. దోపిడీ చేసేవాళ్లకూ, దోచుకోబడేవాళ్లకూ గల సంబంధాన్ని

మూలంగా తీసుకొని, సోషలిస్టు దృక్పధాన్నుంచి, మార్క్సిస్టుగా ఒకడు వాదించవచ్చును. లేదా, అధికసంఖ్యాకులకు, అల్పసంఖ్యాకులకు గల సంబంధాన్ని మూలంగా తీసుకొని, బూర్జువా ప్రజాతంత్రి దృక్పథాన్నుంచి ఉదారవాదిగా, మరొకడు వాదించవచ్చును.

మార్క్సిస్టుగా వాదించేటట్లైతే, మనం యిట్లా చెప్పాలి: దోపిడీ చేసేవాళ్లు, దోచుకోబడేవాళ్లమీద తమ అధికారాన్ని చెలాయించడానికి రాజ్యాంగయంత్రాన్ని (ప్రజాతంత్రం కూడా రాజ్యాంగయంత్రంయొక్క రూపాల్లో ఒకటే) సాధనంగా చేసుకొంటారు. దోచుకోబడే అత్యధిక సంఖ్యాకులు, దోచుకొనే అల్పసంఖ్యాకులచేత పరిపాలించబడుతూన్నంత కాలమూ, ప్రజాతంత్రం తప్పనిసరిగా దోపిడీచేసేవాళ్ల ప్రజాతంత్రంగానే వుండితీరుతుంది. దోచుకోబడేవాళ్ల రాజ్యాంగయంత్రం, యిల్లాంటి రాజ్యాంగయంత్రాన్నుంచి మూలసిద్ధాంతాల్లో కూడా భిన్నమైవుంటుంది; అది దోచుకోబడేవాళ్ల ప్రజాతంత్రంగా వుంటుంది; దోపిడీచేసేవాళ్లను అణిచివేయడానికే సాధనంగా వుంటుంది. కాని, ఒక వర్గాన్ని అణిచి వేయడమంటేనే, ఆ వర్గంతో సంబంధించినంతవరకూ అసమానత్వం వుంటుందనీ, ఆ వర్గం, 'ప్రజాతంత్రం' లో వుండే సౌకర్యాలకు దూరమై పోయేవుంటుందనీ, అర్థము.

.. కాట్స్కీ వాదనల్లో, దోపిడీచేసేవాళ్లకీ, దోచుకోబడే వాళ్లకీ గల సంబంధాన్నే యెత్తుకోలేదు. సాధారణప్రజాతంత్రమే, (యిది వరలో మనకు పరిచితమైయున్న 'స్వచ్ఛమైన ప్రజాతంత్రమే'), అధిక సంఖ్యాకుల ప్రభుత్వమే, యితనివాదనలలోని ముఖ్యవిషయం. ఇదంతా పారిస్ కమ్యూన్‌ను గురించి వ్రాసేటప్పుడే చెప్పేదనిమాత్రం మీరు గమనించాలిసుమా!

పోలికకోసం, మార్క్స్, ఏంగిల్సులు కూడా పారిస్ కమ్యూన్ సందర్భంలోనే, నియంతృత్వాన్నిగురించి చేసిన చర్చను చూద్దాము.

మార్క్సు: "బూర్జువావర్గంయొక్క నియంతృత్వానికి బదులుగా కార్మికులు... తమ, విప్లవకర నియంతృత్వాన్ని ప్రవేశబెట్టినప్పుడు.... బూర్జువావర్గంయొక్క ప్రతిఘటనను నాశనంచేయడానికి . . ... కార్మికులు, రాజ్యాంగయంత్రానికి, విప్లవకరమున్నూ, తాత్కాలికమున్నూ అయిన ఒక రూపాన్ని కల్పిస్తారు: ... "

ఏంగిల్సు: "విప్లవంలో జయించినపక్షం, తన ఆయుధబలంవల్ల విప్లవప్రతిఘాతులలో భయాన్ని కలుగజేసి, తన అధికారాన్ని నిలువబెట్టుకుంటుంది. బూర్జువావర్గానికి వ్యతిరేకంగా సాయుధులైన ప్రజలయొక్క అధికారబలంమీదనే ఆధారపడివుండకపోతే, పారిస్ కమ్యూన్ ఒక్క రోజైనా నిలువబడివుండగలిగేదా? అంతేగాక, పారిస్ కమ్యూన్, తన యీ అధికారాన్ని తగినంతగా వినియోగించలేదని మనం విమర్శించడం లేదా?"

ఏంగిల్సు: "మన ప్రత్యర్థుల్ని బలాత్కారంగా అణిచివేయడానికై విప్లవంలో ఉపయోగించబడవలసిన తాత్కాలికసంస్థయే, రాజ్యాంగయంత్రము. అందువల్లనే, స్వేచ్ఛగల, ప్రజాసమ్మతమైన రాజ్యాంగయంత్రాన్ని గూర్చి మాట్లాడుట కేవలమూ అసంగతము రాజ్యాంగయంత్రం వుండాలని శ్రామికవర్గము కోరుతూన్నంతకాలమూ, దానిని స్వాతంత్ర్య రక్షణకైగాక తన ప్రత్యర్థుల్ని అణిచివేయడానికి మాత్రమే వుండాలంటూన్నారు; స్వాతంత్ర్యాన్ని గురించి మాట్లాడడానికి అవకాశం వచ్చిందనగానే, వెనుకటిరూపంలో రాజ్యాంగయంత్రమే అంతరిస్తుంది."

కాట్స్కీని, మార్క్సు, ఏంగిల్సులకును మధ్య, ఆకాశానికీ భూమికీ గలంత అంతరంవుంది; బూర్జువాఉదారవాదులకూ, శ్రామిక విప్లవవాదులకూ గలంత అంతరం వుంది. కాట్స్కీ మాట్లాడుతూన్న 'స్వచ్ఛమైన ప్రజాతంత్రం' లేక సాధారణ 'ప్రజాతంత్రం' అంటే 'స్వేచ్ఛ గల, ప్రజాసమ్మతమైన రాజ్యాంగయంత్రం' అనేదానికి పర్యాయపదమే,

౬

# పార్టీ ప్రోగ్రామును పునర్విమర్శ చేసి, పార్టీపేరును మార్చడాన్ని గురించి, రష్యన్ కమ్యూనిస్టు పార్టీయొక్క ఏడవ కాంగ్రెస్‌లో యిచ్చిన ఉపన్యాసం నుండి ఉద్ధృతము.

సోవియటు ప్రభుత్వవిధానాన్ని సవివరంగా వర్ణించవలసివుంది. 'రాజ్యాంగయంత్రము : విప్లవము' అనే గ్రంథంలో దీనినిగురించి నా సిద్ధాంతదృక్పథాన్ని తెలియజేయడానికి యత్నించేవున్నాను. ప్రభుత్వమును గురించి మార్క్సిస్టులు చెప్పే నిర్వచనాన్ని, పశ్చిమయూరోపులోని, పలుకుబడిగలిగియున్న సోషలిస్టునాయకులు చాలా వికృతంగాచేసేరు; కాని, సోవియటువిప్లవంవల్లనూ, రష్యాలో సోవియట్లను నిర్మించడం వల్లనూ గలిగిన అనుభవంవల్ల మార్క్సిస్టుల నిర్వచనమే రూఢిపరచ బడింది. మన సోవియట్లు యింకా అపరిష్కృతములుగానూ, అసంపూర్ణ ములుగానూ ఉన్నాయి. ఇందులో సందేహం ఏమీలేదు. అవి చేసేపనిని చూసినవాళ్లకు యీ విషయం స్పష్టంగా తెలుస్తూనేవుంది. కాని, ఒక నూతనప్రభుత్వవిధానం యేర్పరిచబడిం దనేదే యిక్కడ ముఖ్యంగా గమ

సించవలసిన విషయం. సోషలిజం తనయొక్క ప్రపంచవిస్తృతాభి వృద్ధిలో ముందడుగువేస్తూందని సూచించు చరిత్రాత్మక సంఘటన, యిదే!

ఇటువంటి ప్రభుత్వమే పారిస్‌పట్టణంలో, కొద్దివారాలపాటు స్థాపించబడింది. అదే, కమ్యూన్. కాని, కూలీలు తామీపనిని చేస్తూ న్నామనికూడా యెరగరు; కమ్యూనార్డులు, తాము సృష్టించిన విధానాన్ని గ్రహించనేలేదు. మేల్కొన్న ప్రజల్లో సహజంగావుండే బుద్ధినైశిత్యంతో వాళ్లు 'కమ్యూన్' ను నిర్మించేరు. ఫ్రెంచి సోషలిస్టుల్లో ఒక్కడూకూడా తామీపని చేస్తూన్నామని యెరుగడు. పారిస్ కమ్యూన్ యొక్క, జర్మన్ సోషల్ డెమోక్రసీ పొందిన చిరకాలాభివృద్ధియొక్క, అనుభవాన్ని ఆధారంగా చేసుకొన్నాము గాన మనం సోవియట్ ప్రభుత్వాన్ని స్థాపించి నప్పుడు, దాన్ని మనం చైతన్యంతోనే చేసేము. ఈ నూతనప్రభుత్వ విధానము ప్రజాసమూహాలచేతనే యేర్పరచబడింది. మన దేశంయొక్క మధ్యతరగతి స్వభావానికి ఫలితంగా మిగిలివున్న క్రమశిక్షణారాహిత్య మున్నూ, అసంపూర్ణత్వమున్నూ యింకా మన సోవియట్లలో వున్నాయి. ఇది కొద్దివారాలనుంచిగాని, కొద్దినెలలనుంచిగాని నడుస్తూన్నది గాదు; ఒక్కపట్టణంలోనేగాక బ్రహ్మాండమైన ఒకదేశంలో, అనేకజాతుల్లో, యీ సోవియట్ ప్రభుత్వం నడిపించబడుతూంది. ఇట్లాంటి సోవియట్ ప్రభుత్వవిధానము తన అర్హతను ఋజువు చేసుకొంటుంది. . . ..

దేశంఅంతటా పరిశ్రమల్ని స్థాపించి, నడపడాన్ని ప్రజలందరూ త్వరలో నేర్చుకొనేటందుకు యీ సోవియట్ ప్రభుత్వం ఒక సాధనంగా ఉపయోగిస్తుంది. ఇది కష్టసాధ్యమైన, బ్రహ్మాండమైన పని. ఒక్క మన దేశానికే వుపయోగిస్తుందనే దృష్టితో దీనిని చూడక, యూరోపు లోని కూలీలందరినీ మనకు యీ పనిలో సాహాయం చేయమని కోరాలి. ఈ విశాలదృక్పథాన్ని మనసులో పెట్టుకొని, మన ప్రోగ్రామును గురించి వివరించి చెప్పాలి. పారిస్ కమ్యూన్ ప్రారంభించిన కార్యాన్నే,

సోవియట్ ప్రభుత్వం కొనసాగిస్తూందని చెప్పడం, యీ కారణంవల్లనే. యూరోపియన్ కార్మికులుకూడా యీ మార్గాన్నే అనుసరించేటట్లైతే మనకు సహాయభూతులు కాగలుగుతారు . ..

మనం వెనక్కి త్రోసివేయబడిన ప్రతీసారీ, శత్రువుల వర్గశక్తులు మనల్ని పూర్వపుస్థితికి తిరిగి తరుమగలిగినప్పుడల్లా,— మనం బూర్జువా పార్లమెంట్లను అవకాశం ఉన్నంతవరకూ ఉపయోగించుకొంటూ, అనుభవంవల్ల మనం యిదివరలో జయించిన దానికొరకు, సోవియట్ అధికారానికై, సోవియట్ ప్రభుత్వవిధానం కొరకై, పారిస్ కమ్యూన్ వంటి ప్రభుత్వవిధానంకొరకై పోరాడి తీరుతాము. ఈ విషయం మన ప్రోగ్రాములో స్పష్టం చేయబడియుండాలి.. .

౭

# "బూర్జువా ప్రజాతంత్రము : శ్రామిక వర్గ నియంతృత్వము" నుండి ఉద్ధృతము.

శ్రామికులందరూ కమ్యూన్ యెడల మనఃపూర్వకంగా సానుభూతి చూపుతూంటారు గనక సోషలిస్టులుగా పరిగణింపబడ దలచే వాళ్లందరి చేతా మాటల్లో పొగడబడుతూంది, పారిస్ కమ్యూన్. ఇది, బూర్జువా పార్లమెంటరీ విధానంయొక్క, ప్రజాతంత్రంయొక్క పరిమితమైన ఉపయోగాన్నీ, చారిత్రకమైన హద్దునూ స్పష్టంగా వెల్లడిచేసింది. మధ్య యుగాలనాటి రాజకీయసంస్థలతో పోల్చి చూస్తే యివి చాలా అభివృద్ధి

సూచకములే అయినా, ప్రస్తుతపు శ్రామికవిప్లవశకంలో వీటిని అత్యవసర ముగా, మూలానికంటూ మార్పు చేయవలసివుంది. చరిత్రలో కమ్యూన్ యొక్క స్థానాన్నీ, భావాన్నీ, మార్క్సు ఎంతోచక్కగా చెప్పడమే గాకుండా బూర్జువా ప్రజాతంత్రంయొక్క, పార్లమెంటరీవిధానంయొక్క దోపిడీస్వభావాన్ని ఋజువు చేసేరు. ఈ సంస్థలు, ఆస్తిపరులగు వర్గాలలోని యే వ్యక్తి పార్లమెంటులో, ప్రజలకు 'ప్రాతినిధ్యంవహించి, పీడించుతూవుండాలో' (*Vertreten and Zertreten*) నిర్ణయించడానికి పీడితవర్గాల ప్రజలకు కొన్ని సంవత్సరాలకొకసారి అవకాశం యిస్తూన్నా యని, మార్క్సు సవివరంగా ఋజువుచేసేరు. నేడు సోవియట్ ఉద్యమం, ప్రపంచం అంతటా, నాడు కమ్యూన్ తలపెట్టిన కార్యాన్నే కొన సాగిస్తూంటే, సోషలిజానికి ద్రోహులైన వీళ్లందరూ కమ్యూన్‌యొక్క యథార్థానుభవాల్నీ, గుణపాఠాల్నీ మరిచిపోయి, మధ్యతరగతులవాళ్లు 'సాధారణ ప్రజాతంత్రాన్ని' గురించి చెప్పిన పూర్వపు తుక్కుసిద్ధాంతాలను బైటికి తవ్వుతూన్నారు.

పెట్టుబడిదారీ రాజ్యాంగయంత్రంలోవుండే ఉద్యోగివర్గాన్నీ, న్యాయ స్థానాల్నీ, పోలీసు—సైనికసంస్థల్నీ బ్రద్దలుకొట్టి, నాశనంచేసి,ఆ రాజ్యాంగ యంత్రం స్థానే, కష్టజీవులైన ప్రజలయొక్క స్వపరిపాలనాసంస్థను స్థాపించి, శాసననిర్మాణ, కార్యనిర్వహణశాఖల్లో వుండే విభిన్నతను తొల గించడంలోనే పారిస్ కమ్యూన్ యొక్క ప్రత్యేకఘనత వుంది.

నేటి, బూర్జువా ప్రజాతంత్ర ప్రజాస్వామ్యాలన్నీకూడా, చివరకి శ్రామికప్రజాతంత్రమని సోషలిజానికి ద్రోహులైనవాళ్లచేత బూటకపు ప్రచారం చేయబడుతూన్న జర్మన్ ప్రజాస్వామ్యంకూడా, బూర్జువా రాజ్యాంగయంత్రసాధనాల్ని అట్టేవుంచుకొంటూనేవున్నాయి. "ప్రజా తంత్రాన్ని" కాపాడుతా మనడంకూడా, బూర్జువా వర్గాన్నీ, దోపిడీచేయ డానికి ఆ వర్గానికివున్న సౌకర్యాల్నీ కాపాడుతా మనడానికే, మారుపేరని దీనినిబట్టి స్పష్టంగా ఋజువౌతూంది.

౮

# యూరోపు, అమెరికాదేశాల కార్మికులకు వ్రాసిన జాబు నుండి ఉద్ధృతము.*

శ్రామికవర్గనియంతృత్వం యొక్క అభివృద్ధిక్రమంలో 'సోవియట్ అధికారము' అనేది చరిత్ర ప్రసిద్ధమైన రెండో ఘట్టము లేక దశ. మొదటి ఘట్టము, పారిస్ కమ్యూన్, కమ్యూన్‌యొక్క అర్థాన్నీ, ప్రాధాన్యతనీ గురించి మార్క్సు, తన 'ఫ్రాంసులోని అంతర్యుద్ధం' అనే గ్రంథంలో స్పష్టంగా వివరించేడు. కమ్యూన్, ఒక కొత్తరకపు రాజ్యాంగయంత్రాన్ని, శ్రామికపక్ష రాజ్యాంగయంత్రాన్ని సృష్టించిందని, అందులో మార్క్సు వివరించేడు. ప్రతీ రాజ్యాంగయంత్రమూ, చివరకు, ఎంతో ప్రజాతంత్ర యుతమైనదని చెప్పబడే ప్రజాస్వామ్యముకూడా,— ఒక వర్గాన్ని యింకో వర్గం పీడించడానికి ఉపయోగించే సాధనంగాక మరేదీకాదు. శ్రామికవర్గ రాజ్యాంగయంత్రమంటే, బూర్జువా వర్గాన్ని అణిచివేయడానికి శ్రామికవర్గం నిర్మించుకొన్న ఒక సాధనమే. ఇట్లు బూర్జువా వర్గాన్ని అణిచివేయడం

* ఈ జాబు ౧౯౧౯ జనవరి ౨౪వ నాటి 'ప్రవదా' పత్రికలో ప్రకటించబడింది. రెండో యింటర్‌నేషనల్ కార్మికవర్గానికి యేవిధంగా ద్రోహంచేసిందో, మూడో యింటర్‌నేషనల్ యేపరిస్థితుల్లో యేర్పడిందో, విప్లవోద్యమం యూరోపులో యెట్లా వ్యాపిస్తూందో, సోవియట్లయొక్క గొప్పతనం యేమిటో యీ జాబుల్లో వ్రాయబడింది. —సంపాదకుడు.

కూడా చాలా అవసరం. ఎందుచేతనంటే, భూస్వాములూ, పెట్టుబడిదార్లూ, బూర్జువా వర్గమూ, వాళ్ల సేవకులూ, దోపిడీగాళ్లందరూ కూలద్రోయబడగానే, అంటే దోపిడీగాళ్లను దోచుకోవడం ప్రారంభించబడగానే, వాళ్లు అన్నిటికీ తెగించి, వెర్రిఆవేశంతో, నిర్లక్ష్యంగా ప్రతిఘటించనారంభిస్తారు. ఆ ప్రతిఘటన నెదుర్కోడానికి యీ శ్రామికవర్గనియంతృత్వం అవసరం.

## ౬

## "మన విప్లవంలో శ్రామికుల కర్తవ్యాలు," నుండి ఉద్ధృతము.

కార్మిక, కర్షక, సైనిక ప్రతినిధులతోగూడిన సోవియట్ల అర్థం సరిగా గ్రహించబడలేదు. ఈ సోవియట్లయొక్క వర్గస్వభావమూ, రష్యా విప్లవంలో వాటి పాత్రాకూడా స్పష్టంగా గ్రహించబడనేలేదు. అంతేగాక యివి, రాజ్యాంగయంత్రంయొక్క ఒక నూతనరూపాన్ని లేక కొత్త మాదిరిని తెలియజేస్తున్నాయనే విషయంకూడా గ్రహించబడలేదు.

అభివృద్ధిజెందిన బూర్జువా రాజ్యాంగయంత్రంయొక్క సంపూర్ణ రూపమే, పార్లమెంటరీ ప్రజాతంత్ర ప్రజాస్వామ్యము. ఇందులో, అధికారం అంతా పార్లమెంటుకు స్వాధీనంచేయబడింది; కాని, ప్రభుత్వ యంత్రమూ, పాలననుసాగించే సంస్థలూ మామూలువే. శాశ్వతసైన్యము, పోలీసు, అధికారివర్గమూ,— తొలగించరానివై, ప్రత్యేకసౌకర్యాలు కలిగి, ప్రజలమీద ఋద్దటికి వుంటాయి.

కాని, పందొమ్మిదో శతాబ్దంయొక్క కడపటిభాగంలో ప్రారంభమైన విప్లవయుగం, అత్యున్నతమైన ప్రజాతంత్ర రాజ్యాంగయంత్ర విధానాన్ని బయటపెట్టింది. ఏంగిల్సు దీన్నిగురించి చెప్తూ, ఇది కొన్ని హంశాల్లో రాజ్యాంగయంత్రంగా వుండనే వుండదనీ, "సరియైన అర్థంలో యిది యింకెంతమాత్రమూ రాజ్యాంగయంత్రం కానేకాదనీ" చెప్పేడు. పారిస్ కమ్యూన్, యిటువంటి రాజ్యాంగయంత్రమే. ఈ ప్రభుత్వవిధానం, ప్రజలకు సంబంధంలేని సైన్యాన్నీ, పోలీసుశాఖనీ రద్దుగావించి, వాటిస్థానే ప్రజలనే సాయుధుల్నిగా చేస్తుంది. ఇదే కమ్యూన్‌కు సారాంశము. సోషలిజాన్ని వెంటనే 'ప్రవేశపెట్టడానికి' యత్నించిందనీ, యింకా అనేక యితరఅపవాదుల్నీ, తప్పుడుప్రచారాల్నీ, నిందల్నీ, బూర్జువా గ్రంధకర్తలు, కమ్యూన్‌మీద మోపేరు.

౧౯౦౫, ౧౯౧౭ సంవత్సరాల్లో రష్యావిప్లవం సృష్టించనారంభించిన రాజ్యాంగయంత్రవిధానం యిటువంటిదే. ప్రజాప్రతినిధులతోగూడిన 'అఖిల రష్యా ప్రజాప్రతినిధి పరిషత్తు' లో కలుపబడిన 'కార్మిక కర్షక సైనిక నియోజితుల సోవియట్లతోగూడిన ప్రజాస్వామ్యం,— అనగా సోవియట్ ఆఫ్ సోవియట్స్,— కూడా యిటువంటిదే! ఇదీ అప్పుడే స్థాపించబడింది. ఇప్పుడే, యీ క్షణంలోనే తమంతటతామై, కోట్లకొలదీ ప్రజలు తమకు నచ్చినమాదిరి ప్రజాతంత్రాన్ని స్థాపించుకుంటూన్నారు. కేడెట్ పార్టీలోని చదువుకొన్న ప్రొఫెసర్లు వచ్చి బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం యొక్క శాసనావళి తయారుచేసేవరకూగాని, పండితమ్మన్యులు, పెట్టీ బూర్జువా 'సోషల్ డెమొక్రసీ' కి నిత్యపూజారులూ అయిన ప్లెఖనోవ్, కాట్స్కీలవంటివాళ్లు రాజ్యాంగయంత్రాన్నిగూర్చి మార్క్సు చెప్పిన సిద్ధాంతాన్ని పెడదారుల్లో పెట్టడం మానేవరకూగాని, ప్రజలు ఊరుకోలేదు.

మొత్తంమీద విప్లవశకంలోనూ, ముఖ్యంగా పెట్టుబడివిధానాన్నుంచి సోషలిజానికి మారేకాలంలోనూ, రాజ్యాంగయంత్రమూ— ప్రభుత్వమూ

కూడా అవసరమేనని మార్క్సిజమ్ వాదిస్తుంది. ఈ విషయంలోనే మార్క్సిజమ్, అరాజ్యవాదంతో వ్యతిరేకిస్తుంది.

ప్లెఖనోవ్, కౌట్స్కీ అండ్ కో యొక్క ఒదుగుబాటుతనపు, పెట్టీ బూర్జువా సిద్ధాంతం అయిన 'సోషల్ డెమోక్రసీ' తో కూడా మార్క్సిజమ్ వ్యతిరేకించుతుంది. పైనచెప్పిన దశలో పారిస్ కమ్యూన్ వంటి రాజ్యాంగమే అవసరంగాని, 'సోషల్ డెమోక్రాట్లు' సమర్థిస్తూన్న బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంవంటి రాజ్యాంగయంత్రం పనికిరాదని మార్క్సిజమ్ చెపుతుంది.

ఇటువంటి రాజ్యాంగవిధానానికీ, బూర్జువా ప్రజాస్వామ్యానికీ గల ముఖ్యభేదం యిట్లా వుంటుంది :

బూర్జువాప్రజాస్వామ్యంనుండి నిరంకుశరాజరికానికి మరలిపోవడం చాలా సులభం. (దీనిని చరిత్రే ఋజువుచేసింది.) ఎంచేతనంటే, అణిచిపెట్టి వుంచడానికి పనికివచ్చే సంస్థలైన పోలీసు, సైనిక, అధికారి వర్గాలు యధాప్రకారంగానే వుంచలడతాయి. కమ్యూన్, కార్మిక కర్షక సైనిక ప్రతినిధుల సోవియట్లూ, యీ పీడనాయంత్రాల్ని బ్రద్దలుకొట్టి, తీసిపారేసేయి.

బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ప్రజాసామాన్యంయొక్క స్వంతంత్రరాజకీయజీవితాన్ని నలిపిచంపేసి, రాజ్యాంగయంత్రాన్ని ప్రజా తంత్ర పద్ధతులపై నిర్మాణంచేయడంలో ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొనకుండా, మొదటినుండి చివరవరకూ ఆటంకాలు కల్పిస్తూంటుంది. తద్వ్యతిరేకంగా కార్మిక, కర్షక, సైనిక ప్రతినిధుల సోవియట్లు, పీడించే బూర్జువావర్గం యొక్క స్వాతంత్ర్యాన్నే అరికడతాయి.

పారిస్ కమ్యూన్ నిర్మించిన మాదిరి రాజ్యాంగాన్నే, ఈ సోవియట్లు తిరిగి సృష్టిస్తూన్నాయి. దీన్ని గూర్చే 'మార్క్స్' "కష్టజీవుల ఆర్థిక

దాస్యవిమోచనమును సాధించగల రాజకీయవిధానం చిట్టచివరకు కనుగొనబడింది." అన్నారు.

కమ్యూనిజాను 'ప్రవేశపెట్టడానికి' రష్యాప్రజలు యింకా తయారు కాలేదనే అభ్యంతరాన్ని చాలమందినోట తరుచు వింటూన్నాము. రైతులు స్వేచ్ఛ ననుభవించడానికి యింకా సిద్ధంగాలేరని జమీందారులు చెప్పే పూర్వపువాదన యిల్లాంటిదే! ఆర్థికపరిస్థితుల ననుసరించి వుండ సట్టిన్నీ, ప్రజల్లో అత్యధికసంఖ్యాకులు గ్రహించజాలనట్టిన్నీ మార్పులను, కమ్యూన్, అంటే కార్మిక కర్షక సైనిక ప్రతినిధుల సోవియట్లు,—'ప్రవేశ' పెట్టవు; 'ప్రవేశ' పెట్టాలని కోరవు; 'ప్రవేశ' పెట్టకూడదు. యుద్ధంవల్ల కలిగిన ఆర్థికవినాశమూ, క్షోభా యెంత యెక్కువ భయంకరమైనవైతే, అంత యెక్కువ త్వరలో యుద్ధంవల్ల మానవజాతి పొందిన తీవ్రాఘాతాల్ని మాన్పగల నిర్దుష్టమైన రాజకీయవిధానం అవసరం అవుతుంది. రష్యన్ ప్రజల్లో నిర్మాణానుభవం ఎంత తక్కువగా వుంటే అంత ఎక్కువ దృఢనిశ్చయంతో, వాళ్లు స్వీయసంఘ నిర్మాణభారాన్ని తమపైన వేసుకొని, సాగించాలి. అంతేగాని, ఏ కొద్దిమంది బూర్జువా రాజకీయవేత్తలకో, పెద్దజీతాలు తినమరగిన ఉద్యోగులకో, యీ నిర్మాణభారాన్ని వదలిపెట్టి, ప్రజలు ఊరుకోరాదు.

## ౧౦

# మూడవ 'అఖిల రష్యా సోవియట్ కాంగ్రెస్' లో 'కౌన్సిలు ఆఫ్ పీపుల్సు కమిస్సార్స్' యొక్క నివేదిక నుండి ఉద్ధృతము.*

కామ్రేడ్స్.

కౌన్సిల్ ఆఫ్ పీపుల్సు కమిస్సార్స్ తరపున నేను మీకు, రష్యాలో సోవియట్ ప్రభుత్వం స్థాపించబడిన తర్వాత గడచిన యీ రెండు నెలల పదిహేను రోజుల్లోనూ సోవియటులు చేసిన కార్యాల్ని గురించి నివేదిస్తాను.

రెండు నెలల పదిహేను రోజులు,— యింతకుముందు ఒకసారి కూలీల ప్రభుత్వం ఒకదేశం అంతమీదా, పెట్టుబడిదార్లమీదా, దోపిడీగాళ్ళ మీదా అధికారం చెలాయించిన కాలంకంటె,—౧౮౭౧ లోని పారిస్ కమ్యూన్‌లో కూలీలు అధికారంవహించిన కాలంకంటె,— ఇది ఒక్క అయిదు రోజులు మాత్రం ఎక్కువ.

---

* ఇది ౧౯౧౮ జనవరి ౨౪ (౧౧) న జరిగింది.

రః వెనకటి కూలీప్రభుత్వాన్ని జ్ఞాపకానికి తెచ్చుకోవాలి; గత వృత్తాంతాన్ని దృష్టియందుంచుకొని, దాన్ని ౧౯౧౭ నవంబరు ౭వ తేదీని (అక్టోబరు ౨౫) స్థాపించబడిన సోవియట్ పరిపాలనతో పోల్చిచూడాలి. యుద్ధంవల్లా, తత్ఫలితమైన వినాశంవల్లా పరిస్థితులెంత సంకటంగానూ, చిక్కులుగానూ వున్నా, అంతర్జాతీయంగా కార్మికోద్యమం ఎంత అభివృద్ధిపొందిందో, రష్యాలోని సోవియట్ అధికారము పారిస్ కమ్యూన్ కంటె యెంత అనుకూలపరిస్థితుల్లో వుందో తెలుసుకోవాలంటే సోవియట్‌ను వెనకటి శ్రామికవర్గ నియంతృత్వంతో పోల్చిచూడాలి.

సోవియట్ అధికారానికి బీజరూపమైన కమ్యూన్‌ను సృష్టించిన పారిస్ కూలీలు, డెబ్బై రోజులవరకూ అధికారంలో వుండి, తర్వాత ఫ్రెంచి కేడెట్లు, మెన్షివిక్‌లు, సోషల్ రివల్యూషనరీలలోని మితవాదులు, కెలిడిన్లైట్లు మొదలైనవాళ్ళ ఫిరంగిగుండ్ల కెరయైపోయేరు. కూలీప్రభుత్వాన్ని మచ్చుచూసినందుకు, యెవ్వరూ కనీ వినీ యెరగని వెలను నిహతులరూపంగా ఫ్రెంచికూలీలు యిచ్చుకోవలసివచ్చింది. ఈ కూలీప్రభుత్వం యొక్క ఉద్దేశ్యాల్నీ, ఆదర్శాల్నీ, ఫ్రాంసులోని అత్యధికసంఖ్యాకులు గ్రహించకపోవడమే, కమ్యూన్ వినాశానికి కారణము

మనము, కమ్యూనార్డులకంటె మంచిస్థితిలో వున్నాము. ఎట్లాగంటే, రష్యన్ సైనికులు, కార్మికులు, కర్షకులు కూడా శత్రువులతోటి పోరాటంలో సాధనంగా సోవియట్ ప్రభుత్వాన్ని సృష్టించుకోగల్గేరు, వాళ్ళు తమ పోరాటంలో ఉపయోగించే సాధనాల్నిగురించి, ఇది ప్రపంచానికి వెల్లడిచేస్తూంది. ఇందువల్లనే, రష్యన్ కార్మికకర్షకుల పరిస్థితి పారిస్ శ్రామికుల పరిస్థితికంటె చాల భిన్నంగా వుంది. కమ్యూనార్డులకు సాధనాలూ లేవు; ప్రజలు వాళ్ళ ఉద్దేశ్యాన్ని గ్రహించలేకనూ పోయేరు. కాని, మనం సోవియట్ల అధికారంమీదనే ఆధారపడ్డాము. ఈ కారణం వల్లనే అత్యధికసంఖ్యాకులైన ప్రజలయొక్క విశ్వసనీయమూ, సోత్సా

హము అయిన సహాయమూ, ప్రాపూ మనకు వుంటనీ, మన సోవియట్ అధికారము అజేయమనీ నిస్సంశయముగా చెప్పగలము.

# పారిస్ కమ్యూన్: శ్రామికవర్గ నియంతృత్వం యొక్క కర్తవ్యాలు.

కమ్యూన్, శ్రామికవర్గ నియంతృత్వమా?

మార్క్స్ వ్రాసిన 'ఫ్రాంసులో అంతర్యుద్ధము' అనే గ్రంథం యొక్క మూడవకూర్పుకు ఏంగిల్సు భూమిక వ్రాస్తూ, ఈ క్రింది వాక్యంతో ముగించేసు.

> "ఇటీవల మళ్ళీ ప్రతీవాడూ 'శ్రామికవర్గ నియంతృత్వం' అనే మాటలకు భయపడుతూన్నాడు. సరే, బాగానేవుంది. కాని, పెద్దమనుష్యులారా! ఈ నియంతృత్వం ఎట్లా వుంటుందో తెలుసునా? పారిస్‌కమ్యూన్‌ను చూడండి. శ్రామికవర్గ నియంతృత్వం అంటే అదే!"

కాని, నియంతృత్వాలన్నీ ఒకేమాదిరిగా వుండవు. కమ్యూన్ నిర్వహించిన కార్యాల స్వభావమూ, దాని నిర్మాణమూ, పూర్తిగా సోషల్ డెమోక్రాటిక్ సిద్ధాంతాల ననుసరించడంవల్లనే, అది నిజమైన, స్వచ్ఛమైన శ్రామికవర్గ నియంతృత్వం అయిందా? ఎంతమాత్రమూ కాదు! వర్గచైతన్యంగల శ్రామికులు(కొద్దోగొప్పో వర్గచైతన్యం గలవాళ్లు)అంటే యింటర్‌నేషనల్ యొక్క సభ్యులు, కమ్యూన్‌లో అత్యల్పసంఖ్యాకులు

గానే వున్నారు; యీ ప్రభుత్వంలో అత్యధికసంఖ్యాకులు, మధ్యతరగతు లకు జెందిన ప్రజాతంత్రవాదులే. కమ్యూన్‌ను గురించి పరిశోధించిన వాళ్ళలో ఆధునికు డొకడు(గస్టేవ్ జేఫ్)యీ విషయం నిజమని చాటేడు. ఉదాహరణకు, నేషనల్‌గార్డు యొక్క సెంట్రల్‌కమిటీలోని ముప్పైఅయి దుగురిలోనూ యిద్దరు మాత్రమే సోషలిస్టులు(యింటర్‌నేషనల్ సభ్యులు). కాని, యీ యిద్దరికీ, (వార్‌లిన్, ఎవోయ్‌సీ) అధికారంలో వున్న తమ తోటివారిలో చాల పలుకుబడి వుంది. ఈ సెంట్రల్‌కమిటీని గురించే 'లిస్సాగరే' యిట్లా వ్రాసేడు: "కమిటీమెంబర్లు సుప్రసిద్ధ ఆందోళనా కారులా? లేక, సోషలిస్టులా? కాదు. కాదు. అందులో సుప్రసిద్ధమైన వాడొకడూ లేడు. మధ్యతరగతి దుకాణదారులు, గుమాస్తాలు, కిరాణా వర్తకులు........" అయినా, వార్‌లిన్, ఎవోయ్‌పీలు కమిటీలో చేరేరు. తరువాత, తరువాత పిండే, ఆస్టిన్, జోర్డిస్‌లు సెంట్రల్ కమిటీలో చేరేరు.

ఇంటర్‌నేషనల్‌యొక్క పార్టీపత్రిక 'న్యూ- యార్కర్- ఆర్బీటర్- జీటంగ్' ౧౮౭౧ జూలై ౧౮ తేదీనాటిసంచికలో యిట్లా వ్రాసింది:

> "కమ్యూన్, యింటర్‌నేషనల్‌యొక్క సృష్టి గాదు. ఇవి రెండూ ఒకటిగాదు. కాని, యింటర్ నేషనల్‌యొక్క సభ్యులు కమ్యూన్‌యొక్క ప్రోగ్రామును అంగీకరించి, దాని మొదటి అభి ప్రాయాల్ని విపులీకరించేరు. అంతేగాక, వాళ్ళు ఎంతో అభినివే శంతోనూ, విశ్వాసంతోనూ, కమ్యూన్‌ను బలపరచేరు. ఎందు కంటే, కార్మికవర్గానికి దాని ప్రాముఖ్యత చాలా వుందని వాళ్ళు గుర్తించేరు."

సుప్రసిద్ధమైన 'జనరలు కౌన్సిలు', మార్క్సు నాయకత్వంక్రింద, (ఇంటర్‌నేషనల్‌కు చెందిన పారిస్‌ఫెడరేషన్‌యొక్క ఈ యెత్తుగడల్ని) సమర్థించింది. తన, మేనిఫెస్టోలో యిట్లా వ్రాసింది: "ఎక్కడగానీ,

ఏ రూపంలోగానీ, ఎట్టి పరిస్థితుల్లోగానీ వర్గకలహం జరుపబడేటప్పుడు, మా ఎసోసియేషన్ సభ్యులు అగ్రభాగంలో వుండి పోరాడడం సహజమే." అంతేకాని, మన పూర్వులైన యింటర్నేషనల్ సభ్యులు 'కమ్యూన్' తో కలిసిపోవడానికి ఇష్టపడలేదు. ఆ సమయంలో కూడా వాళ్లు, తమ ప్రత్యేక శ్రామికవర్గ పక్షనిర్మాణాన్ని సమర్థించుకొంటూనే వున్నారు. జేఫ్ యిట్లా వ్రాసేరు: "ఇంటర్నేషనల్ యొక్క ఫెడరల్ కౌన్సిలు, తన ప్రతినిధులద్వారా మొట్టమొదట సెంట్రలు కమిటీలోనూ, తర్వాత కమ్యూన్ లోనూ తన పలుకుబడిని స్థాపించుకొని, ముఖ్యసమస్యలపైవచ్చు నిర్ణయాలకి మార్గదర్శిత్వంవహించడంలో కృతార్థురాలైనది"

ఆ కాలంనాటి శ్రామికవర్గ సంస్థయొక్క స్వతంత్రవ్యక్తిత్వానికిది ఉజ్జ్వలమైన ఉదాహరణ. ఇంటర్నేషనల్ యొక్క ప్రతినిధులు, కమ్యూన్ లో పాల్గొన్నారు. ఫెడరల్ కౌన్సిలు సమావేశానికి, వీళ్లకూడా ఆహ్వానించబడ్డారు:

> "ఇంటర్నేషనల్ వర్కింగ్ మన్స్ ఎసోసియేషన్ యొక్క ఫెడరల్ కౌన్సిలు ప్రత్యేకసమావేశము, మే ౨౦వ తేదీ శనివారం మధ్యాహ్నం ౧ గంటకు జరుపబడును. కమ్యూన్ లో సభ్యులుగా వుండి, ఇంటర్నేషనల్ లో కూడా సభ్యులైనవాళ్ళు హాజరు కావలెను. కమ్యూన్ లో వీరు అవలంబించిన దృక్పథాన్ని గురించీ, దానిలో బయలుదేరిన భేదాభిప్రాయాలకు కారణములూ, స్వభావమూ, వీటిని గురించీ, సంజాయిషీ యివ్వవలసి యుండును. సభ్యతాపత్రము చూపించిననేకాని ప్రవేశించుటకు వీలు లేదు."

ఇంతే గాదు. పైన వ్రాయబడిన ప్రత్యేక సమావేశంలోని తీర్మానాన్నిగురించి, యిక్కడ యింకో చక్కని వుదాహరణ యిస్తున్నాను:

> "మే ౨౦ వ తేదీనాటి ప్రత్యేకసమావేశంలో ఇంటర్నేషనల్ వర్కింగ్ మన్స్ ఎసోసియేషన్, యీక్రింది తీర్మానాన్ని చేసింది:

'ఇందులో సభ్యులై, కమ్యూన్‌లోకూడ సభ్యులై వున్నవాళ్ళ రిపోర్టును విని వారి స్థానం పూర్తిగా విశ్వాసయుతమైనదే యని సమర్థిస్తూంది. కష్టజీవుల ప్రయోజనాల్ని, తమ కందువాటులో వున్నన్నివిధాలా కాపాడుటకై భవిష్యత్తులోకూడ పోరాడమని ప్రోత్సహిస్తూంది; వెర్సేయిస్ ప్రభుత్వంతోటి పోరాటాన్ని తీవ్రతరం గావించడానికై కమ్యూన్‌యొక్క ఐకమత్యాన్ని కాపాడ బూనుకొమ్మని కూడ ప్రోత్సహిస్తూంది. అంతేగాక, కమ్యూన్ యొక్క మీటింగుల్ని పూర్తిగా వెల్లడిచేసేటట్లు చేయప్రయత్నించమని తన సభ్యుల్ని కోరుతూంది. కార్యనిర్వాహకుల పనుల్ని కంట్రోలుచేయడానికి ప్రజలకు పూర్తిగా అధికారంవుంది; ప్రజలకు గల యీ హక్కుకు విరుద్ధంగా, 'పబ్లిక్ వెల్‌ఫేర్ కమిటీ' యొక్క పనులను విమర్శించుటలో ప్రజల్ని నిరోధిస్తూన్న, మేనిఫెస్టో ౩ వ పేరాను మాజీచేయ (*Repeal*) యత్నించమని కూడా కోరుతూంది."

ఇంటర్‌నేషనల్‌యొక్క యీ సమావేశానికి ఆరుగురు సభ్యులు మాత్రం హాజరై ముగ్గురు హాజరు కానందుకు సమాధానం పంపించుకున్నారు. మార్చి ౧౯ వ తేదీకి కమ్యూనులో ౨౫ గురు కూలీవర్గ ప్రతినిధు లున్నారని, లిస్సాగరే లెక్కించేడు; కాని, వాళ్ళందరూ ఇంటర్‌నేషనల్‌కు చెందినవాళ్ళు కారు. అప్పటికీ, కమ్యూన్‌లో అధికసంఖ్యాకులు మధ్యతరగతులకు చెందినవాళ్లే.

కమ్యూన్‌యొక్క చరిత్రనీ, ఇంటర్‌నేషనల్ సభ్యులచే నిర్వహించబడిన పాత్రనూ యేకరువుబెట్టడాని కిది అదనుకాదు. ఎగ్జిక్యూటివ్ కమిటీలో (కార్యనిర్వాహకవర్గంలో) డాఌవిల్లీ ఒక సభ్యుడు; వార్లిౝ, ఠోర్డీ, బెస్లేలు ఫైనాన్సు కమీషన్‌లోనూ; డాఌవిల్లీ,పిండే, ఫులిటరీ కమీషఌలోనూ; యాసీ, ఛలైన్‌లు పబ్లిక్ సేఫ్టీ కమీషఌలోనూ; మలోౝ,

ఫ్రాంకెల్, థీస్ట్, డ్యూపోంట్, అవ్రేల్ లు లేబరుకమిషన్లోనూ వున్నారని చెపుతే ప్రస్తుతం చాలు. ఏప్రిలు ౧౬ వ తేదీని కొత్త ఎలక్షన్లు వచ్చేయి. మరికొందరు యింటర్నేషనల్ సభ్యులు, ఆ యెలక్షన్లో కమ్యూనులోకి తీసుకోబడ్డారు. (వాళ్ళలో, మార్క్సు అల్లుడు, లాంగ్వెట్ కూడా వున్నాడు.) అయినా, యింటర్నేషనల్కు తీవ్రశత్రువులు, వెసీమీర్ వంటివాళ్ళు కూడా కొందరు, కమ్యూనులో వున్నారు. కమ్యూను యొక్క కడపటిదినాల్లో, సమర్థులైన యింటర్నేషనలిస్టులు,—జోర్డ్, వార్లిన్లు (ఫైనాన్సు) ఆర్థికశాఖ కధిపతులుగా వున్నారు.

వ్యాణిజ్య—కార్మికశాఖలు, (*Trade and Labour*) ఫ్రాంకెల్ అధ్యక్షతక్రింద నిర్వహించబడినాయి. పోస్టల్, టెలిగ్రాఫ్, మింట్, పన్నుల శాఖలు కూడా సోషలిస్టుల చేతుల్లోనే వున్నాయి. అయినప్పటికీ మిక్కిలీ ముఖ్యములైన శాఖల మంత్రివర్గాలు చాలావరకు మధ్యతరగతులచేతుల్లోనే వుండిపోయినాయి.

అందుచేత ఏంగిల్సు, పారిస్ విప్లవప్రభుత్వంలో, అందులోనూ భావక్షేత్రింలో నాయకత్వం అంతా శ్రామికవర్గప్రతినిధులదే యనే విషయాన్నే దృష్టిలో పెట్టుకొనే కమ్యూన్ను శ్రామికవర్గ నియంతృత్వమని పిలిచేడు.

కాని, పారిస్ కమ్యూన్ యొక్క తత్క్షణోద్దేశ్యము, సంపూర్ణమైన సోషలిస్టువిప్లవమా? కాదు మనం అట్లాంటి భ్రమలనుపెట్టుకోనక్కరలేదు.

జనరల్ కౌన్సిలు, తన సుప్రసిద్ధమైన మేనిఫెస్టోలో, కమ్యూనును గురించి (యిది మార్క్సువ్రాసిందే) యిట్లా చెప్పింది: "వర్గాధిక్యతకు కారణమైన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంయొక్క పునాదుల్ని నాశనం చెయ్యడానికి కమ్యూన ఒకసాధనంగా ఉద్దేశించబడింది." దీని వెనువెంటనే ఆ మేనిఫెస్టోలో:

"అమృతకార్యాల్ని వేటినీకూడా కమ్యూనునుండి కార్మికవర్గం

కోరినేలేదు. వాళ్ళు. ఏదో అమృతస్వర్గాన్ని సాధించమని కమ్యూన్‌ను కోరనేలేదు. కార్మికవర్గం. తన దాస్యవిమోచనకున్నూ, ఉన్నత సామాజిక జీవితాన్ని పొందడానికిన్నీ ..... మానవుల యొక్క పరిసరాల్నీ, ప్రకృతినీ కూడా మార్చగల కొన్ని చారిత్రిక క్రమవిధానాలకు లోబడి ముందుకు పోవడం అవసరమని తెలుసుకొనే వుంది. కమ్యూన్, ఏవో ఆదర్శాల్ని సాధించబూనుకోలేదు; మిగుల ముగ్గి, రాలిపోవనైయున్న పెట్టుబడిదారీవిధానంయొక్క గర్భంలో యిదివరకే అభివృద్ధిజెందియున్న నూతనసామాజిక శక్తులకు స్వేచ్ఛ నియ్యమనే, కార్మికులు కమ్యూన్‌ను కోరేరు."

కమ్యూన్ చర్యలన్నీ, సామాజిక శాసనాలన్నీ ఉపయోగంలోకి తీసికొనిరాదగినవే గాని భ్రమాజనితములు గావు. 'సోషలిస్టుల కనీసపు కోర్కెల పట్టిక' యని నేడు మనం అంటూన్నదానినే సాధించడానికి కమ్యూన్ పూనుకొంది. ఈ సందర్భంలో కమ్యూన్ చేయబూనుకొన్న దాన్ని స్పష్టంగా జ్ఞాపకానికి తెచ్చుకోవడానికై, ఏంగిల్సుయొక్క భూమిక నుండి, యీక్రింది భాగాన్ని ఉదాహరిస్తూన్నాను:

"అంతవరకూ ప్రభుత్వాన్ని నడిపించిన నేషనల్ గార్డు 'సెంట్రల్‌కమిటీ' తన కర్తవ్యాల్ని పారిస్ కమ్యూన్‌కు వప్పగించింది. బలవంతంగా సైన్యాల్లో చేర్చుకొనే పద్ధతితోబాటు స్థిరసైన్యాలూ, యితరవిధాలైన పటాలాలూ, అన్నీ మార్చి ౩౦ వ తేదీనే తొలగించబడినాయి. ఒక్క 'నేషనల్‌గార్డు' మాత్రమే వుంచబడింది. ఆయుధధారణచేయగల పౌరులందరూ యీ నేషనల్ గార్డులో చేరవచ్చును. ౧౮౭౦ అక్టోబరు లగాయితు ౧౮౭౧ అక్టోబరువరకూ యివ్వవలసిన అద్దెల్ని రద్దుచేస్తూ, ఆదివరలోనే చెల్లించబడిన మొత్తాలన్నియూ ముందుసంవత్సరపు బాకీలక్రింద సరిపెట్టుకోబడవలెనని శాసించింది; మునిసిపల్ తాకట్టుదుకాణాల్లో

కుదువబెట్టబడిన వస్తువులన్నిటినీ, పేదవాళ్లకు ఉచితంగానే తిరిగి యిచ్చేసింది. విదేశీయులుకూడా కమ్యూన్‌కు ఎన్నుకోలబడవచ్చు ననియూ, వాళ్లుకూడా ప్రభుత్వాధికార నిర్వహణానికి హక్కు గలిగియుంటారనీ, ఆరోజుననే శాసనం చేయబడింది: 'ప్రపంచ ప్రజాస్వామ్యధ్వజమే— కమ్యూన్ యొక్క ధ్వజము' అని ప్రకటించ బడింది గనుక యీ శాసనం చేయబడింది. ఏప్రిలు ౧ వ తేదీని, కమ్యూన్ యొక్క ఏ ఉన్నతోద్యోగికీకూడా, సభ్యుడైనా— కాక పోయినా, ఎక్కువలో ఎక్కువ సంవత్సరానికి ౬౦౦౦ ఫ్రాంకులకు మించినజీతం యివ్వరాదని నిశ్చయించబడింది. రాజ్యాంగానికీ, చెర్చికీ సంబంధం లేదని ఆ మరుసటిదినమే ప్రకటించి, మత కార్యాలకు యివ్వబడే ప్రభుత్వవిరాళాల్ని నిలుపుచేసి, మతగురువుల తాలూకు, సంస్థలతాలూకు ఆస్తులనన్నిటినీ స్వాధీనంచేసికొని, జాతీయంగా చేసేరు. దీనికితోడు, ఏప్రిలు ౨ వ తేదీని, సమస్త మతచిహ్నాలూ, ప్రార్థనలూ, విధులూ,— క్లుప్తంగా చెప్పాలంటే 'వ్యక్తి అంతఃకరణకు సంబంధించిన ప్రతిలాంఛనాన్నీ' పాఠశాలల నుంచి తీసిపారేయాలని ఆజ్ఞాపించబడి, సక్రమంగా కొనసాగించ బడింది. ఏప్రిలు ౬ వ తేదీని, నేషనల్‌గార్డుయొక్క ౧౩౭ వ పటాలము, 'గిల్లొటీన్' ను బయటికి లాగి, ప్రజల సంతోషధ్వనులు మిన్నుముట్టుతూండగా బహిరంగంగా తగులబెట్టేరు. ౧ వ నెపోలియన్ చక్రవర్తి 'వెన్‌డోమ్ ప్లేస్' లో నిర్మించిన స్తంభాన్ని కూలద్రోయు నాజ్ఞ, ౧౨ వ తేదీనే యివ్వబడింది. ౧౮౦౯ యుద్ధంలో పట్టుబడ్డ ఫిరంగులతో జయసూచకంగా నిర్మించబడిన యీ స్తంభము అతిశయదేశారాధనకూ, అంతర్జాతీయ స్పర్ధలకూ స్మారకచిహ్నంగా వుంటుందనే యీ ఆజ్ఞ యివ్వబడింది. మే నెల ౧౬ వ తేదీనే యీ స్తంభం కూలద్రోయబడింది. మూసివేయబడి

యున్న ఫాక్టరీలూ, వర్క్‌షాపులూ రిజిస్టరుచేసి, ఆదివరదాకా వాటిల్లో పనిచేసిన కూలీలందర్నీ సహకారసంఘాలుగా ఏర్పాటుచేసి ఆ సంఘములచేత యీ ఫాక్టరీలను పనిచేయించుటకై తగిన ప్లానులు ఏప్రిలు ౧౬ వ తేదీనే వేయబడినాయి. ఇంతేగాక, యీ సహకారసంఘాలన్నిటినీ కలిపి, ఒక పెద్ద సహకార సంస్థగా యేర్పాటుచేయాలని కూడా ఆజ్ఞలు యివ్వబడినాయి. ౨౦ వ తేదీనే లేబరు ఎక్స్ఛేంజిని రద్దుచేసేరు; రెండో సామ్రాజ్యకాలంనుంచీ ఇది, పోలీసులతో లాలోచీగావుండే కొందరు పోకిరీలకు గుత్తగా అధమతరహా దోపిడీగాండ్ల చేతుల్లో వుండేది. అప్పటినుంచీ దీనిపనంతా, పారిస్‌యొక్క యిరవై జిల్లాలయొక్క మేయర్ల చేతుల్లో వుంచబడింది. ఏప్రిలు ౨౦ వ తేదీని, తాకట్టుదుకాణాల్ని తొలగిస్తూ, అవి వుండడం కూలీలకు వాళ్ల పనిముట్లమీదా, పరపతిమీదా గల హక్కుకు వ్యతిరేకమనీ, అందువల్ల వీటిని తొలగించాలనీ శాసించబడింది. పదహారవ లూయీచక్రవర్తిని వురితీసినపాపానికి పరిహారార్థంగా కట్టబడిన క్రైస్తవదేవాలయం నాశనంచేయాలని మే ౫ వ తేదీని ఆజ్ఞయిచ్చింది!"

కమ్యూన్, కొంతవరకూ అదిచేసిన పొరపాట్లవల్లా, అతిఔదార్యంవల్లా ప్రతిఘాతాన్ని అణిచివేయలేకపోయిందని తెలిసినవిషయమే. కమ్యూనార్డులు నాశనమైపోయేరు. సరే. కాని, వాళ్లు శ్రామికులయొక్క పార్టీకి అగౌరవం తీసుకురావడంగాని, రాజీచేసుకోవడంగాని చేసేరా? లేదు. రష్యాలో ముందునుండు రాబోయే విప్లవప్రభుత్వంమీద ఒక కన్నుంచి, మార్టినోవ్, కమ్యూనార్డులను కారుకూతలు కూస్తున్నాడు. ఇదంతా శుద్ధాబద్ధం. ఎంచేతనంటే, మార్క్సుకూడా యిట్లా వ్రాసేడు:

"నూతనసమాజోదయానికి పురస్సూచకంగా పారిస్ 'కమ్యూన్' శాశ్వతంగా జరుపబడుతుంది. కూలీల పారిస్, దానికోసం త్యాగం

చేసినవాళ్లు ప్రపంచకష్టజీవుల హృదయాల్లో శాశ్వతావాసం యేర్ప ఱచుకొన్నారు. కమ్యూన్‌ను నాశనంచేసినవాళ్లని, చరిత్ర అప్పుడే ప్రజాభిప్రాయమనే వధ్యశిలకు అంటగట్టింది. వాళ్ల మతగురువు లందరిప్రార్థనలూ కూడా వాళ్లను యీ ప్రతీకారాన్నుంచి తప్పించ లేవు."

ఈ చిన్న చారిత్రక ప్రమాణము, మనకు గుణపాఠాన్ని గరపేదిగా వుందని మనకు తెలుసును. సోషలిస్టు శ్రామికుల ప్రతినిధులు, మధ్య తరగతులతో కలిసి ఒక విప్లవప్రభుత్వంలో పాల్గొనవచ్చుననీ, కొన్ని ప్రత్యేకపరిస్థితుల్లో అట్లా చేయడం విధియనిన్నీ, అది మనకు అన్నిటికంటే ముందు బోధిస్తూవుంది. కమ్యూన్ చేయవలసింది అన్నిటికంటె ముఖ్యంగా ప్రజానియంతృత్వస్థాపనమే గాని సోషలిస్టు నియంతృత్వ స్థాపనముగాదనీ, మనం చెప్పే 'కనీసప్రణాళిక' నే అమల్లో పెట్టివుండ వలసినదనీ అది మనకు బోధిస్తూవుంది. కడపటికి, కమ్యూన్ మనకు జ్ఞాపకం చేసేదేమంటే,— కమ్యూన్‌నుంచి మనం గుణపాఠాల్ని నేర్చుకొనే టప్పుడు, అది చేసిన పొరపాట్లనుగాక, సరియైన మార్గాన్ని సూచించేవీ, జయప్రదమైనవీ, ఉపయోగంలో పెట్టదగినవీ అయిన కార్యాల్నే స్వీకరిం చాలి. (వాళ్లు బ్యాంక్ ఆఫ్ ఫ్రాంసును స్వాధీనంచేసికోలేదు; వెర్సేలిస్ పైకి దాడిసల్పలేదు; స్పష్టమైన ప్రోగ్రామును వేసుకోలేదు.) ౧౮౭౧ నాటి యోధులనుండి మనం గ్రహించవలసినది 'కమ్యూన్' అనే పేరు మాత్రమే గాదు. అది వుపయోగించిన ప్రతీ హెచ్చరికనూ గ్రుడ్డిగా అనుకరించకూడదు. వాళ్ల ప్రోగ్రాముకూ, ఆచరణకూ సంబంధించిన యీ హెచ్చరికల్లో జాగ్రతగా యెన్నుకొని, మనము అవలంబించాలి. వాటిల్లోనుంచి రష్యాదేశపు పరిస్థితుల కనుకూలమైన వాటి నెంచుకోవాలి. అట్టి హెచ్చరిక ఏది? "కార్మిక కర్షకుల యొక్క విప్లవకర ప్రజాతంత్ర నియంతృత్వము," అనేదే ఆ హెచ్చరిక.

ప్రోలిటరీ, నెం ౮., ౧౭ జూలై, ౧౯౦౫.

# నవశక్తి.

సంపాదకులు : మద్దూరి అన్నపూర్ణయ్య.

చందా ఏడాదికి రు 3 లు. విడిప్రతి ఒక అణా.

☞ కార్యస్థానం బెజవాడకు మార్చబడిందని గమనించ ప్రార్థన.

"నవశక్తి" కార్యాలయం,
గవర్నరుపేట, బెజవాడ.

# అన్నా

**(Barricades in Berlin)**

వీరగాథ— వెంటూరా।

జర్మనీలో కార్మికులు, కమ్యూనిస్టులు, 'మే డే' నాడు సల్పిన పోరాటం, చేసిన త్యాగం, సాధించిన విప్లవం;— కన్నులకి కట్టినట్లు చిత్రించేరు, 'అన్నా' లో, గ్రంథకర్త, హ్లా న్యూ క్రాంజ్.

తెలుగులో మంచిరసవంతంగా అనువదించి, ఆంధ్రులకందించేరు, అశ్వనీకుమారదత్తు.

క్రౌను 300 పుటలు. వెల 8 అణాలు.

కావలిస్తే:—దర్భా శ్రీరామమూర్తి,
న్యూస్ ఏజంటు,
భీమవరం, ప॥ గోదావరి జిల్లా.

# మాస్లో తిరుగుబాటు.

రచయిత : తుమ్మల వెంకట్రామయ్య.

వెల 1 అణా మాత్రం.

పుస్తకాలకు :—"నవశక్తి" కార్యాలయం,
గవర్నర్‌పేట, బెజవాడ.